
శ్రీరుక్మిణీపాండురంగాభ్యాం నమః
శ్రీశ్రీశ్రీ భావానంద భారతీ సద్గురుభ్యో నమః

భావానంద జయ                    రాధాకృష్ణ జయ

# మంగళ మంజరి



శ్లో॥ శ్రీకృష్ణోరాధికాకారః । శ్రీరాధాకృష్ణరూపిణీ ।
ఏకమేవ పరంబ్రహ్మ । ద్విధాభాతి న సంశయః ॥


రచయిత

**మహాత్మ పూజ్య శ్రీ అప్పాల విశ్వనాథశర్మగారు**

**శ్రీపాండురంగాశ్రమము**

పోస్ట్ : మరుకూకు, మం: ములుగు, జిల్లా: మెదక్

**మంగళమంజరి**

| | | |
|---|---|---|
| **రచన** | : | మహాత్మ పూజ్యశ్రీ **అప్పాల విశ్వనాథశర్మగారు** |
| **ప్రథమ ముద్రణ** | : | 1988 |
| **ద్వితీయ ముద్రణ** | : | జనవరి, 2009 |
| **తృతీయ ముద్రణ** | : | శ్రీ జయనామ సం॥ ఆషాఢి ఉత్సవం జులై 2014 |
| **సందర్భము** | : | శ్రీరుక్మిణీ పాండురంగస్వామి ప్రతిష్ఠాపన షష్టిపూర్తి మహోత్సవ సందర్భంగా ప్రచురింపబడినది. (07-07-2014) |
| **ప్రతులు** | : | వేయి |
| **ప్రకాశకులు** | : | శ్రీపాండురంగాశ్రమము |
| **సర్వహక్కులు** | : | ప్రకాశకులవి |
| **వెల** | : | రూ. 50/- |
| **అక్షరాలకూర్పు** | : | ఆరవేటి వెంకటసుబ్బయ్య 98496 92028 |
| **చిత్రాలంకరణ** | : | మదునూరి నారాయణమూర్తి |
| **ముద్రణ** | : | కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ విద్యానగర్, హైదరాబాద్. |

**ప్రాప్తిస్థానము :**

**శ్రీపాండురంగాశ్రమము**

మరుకూకు, మం. ములుగు,

జిల్లా : మెదక్ - 502 279

మొబైల్ : 9440573367, 96764 54189

మా వెబ్‌సైట్ దర్శించండి :

www.pandurangashram.org, E-mail: info@pandurangashram.in

# నీరాజనమ్

భగవంతుని పూజించే పద్ధతులలో ఎక్కువగా ఉపయోగింపబడేది "షోడశోపచారపూజ". ఇందులో 16 ఉపచారాలుంటాయి. ముఖ్యంగా అభిషేకమ్, పుష్పార్చనమ్, నీరాజనమ్ అనే మూడు ఉపచారాలు అధికంగా సమర్పించడం మనం చూస్తూంటాం. ఇందులో కూడా పరమపూజ్యశ్రీ మహాత్మ విశ్వనాథగురుదేవులు గారికి "నీరాజనసేవ" అంటే మరింత మక్కువ ఎక్కువ. భగవత్సేవాసమాజమ్ ద్వారా అనేక గ్రామాలను పర్యటించి పూజాకార్యక్రమాలను నిర్వహించి, విరివిగా భగవద్భక్తిని ప్రచారం చేసిన మహనీయులు. అంతేకాదు, ఏ గ్రామంలో పూజాకార్యక్రమం జరిగితే, ఆ గ్రామం పేరును చేర్చి ఒక పద్యాన్ని, ఒక మంగళహారతిని రచించి ఆ స్వామికి సమర్పించేవారు. ఆ మంగళహారతిని స్వయంగా హార్మోనియం వాయించి, దానికి తగిన రాగతాళాల మేలుకలయికతో చక్కగా స్వరపరిచేవారు. ఆ పద్యాన్ని మరియు హారతిని శ్రీగురువుగారి ఆత్మీయుడు, అచ్చమైన దాసుడగు కీ.శే. బ్రహ్మశ్రీ గుండు రఘురామశర్మ, దామరకుంట వాస్తవ్యులు, తన కమ్మనైన కంఠంతో ఎలుగెత్తి భక్తిపరవశులై పాడేవారు. అప్పుడు అచటి శ్రోతలందరూ మంత్రముగ్ధులై మైమరచిపోయేవారు. అదొక స్వర్ణసమయం. తలచుకుంటే చాలు తనువు పులకరించిపోతుంది.

నిజానికి పూజ్యశ్రీ విశ్వనాథగురుదేవులు గొప్ప సిద్ధపురుషులు. జీవన్ముక్తులు. సహజకవి పండితులు. సకలశాస్త్ర మర్మజ్ఞులు. సంగీతవిద్యా కోవిదులు. నిరాడంబరులు. అచ్చమైన శ్రీకృష్ణభక్తులు. వారు రచించిన మంగళహారతులు శ్రీమద్భాగవతములోని దశమస్కంధానికి ప్రతిబింబాలు. వారి రచనా పాటవము సాటిలేనిది. సరళమైన పదాలు, సరసమైన భావాలు, మృదుమధుర ప్రేమభక్తిరసభరితాలు. ఏ హారతి చదివినా, ఏది పాడినా, ఏది విన్నా సరే, ఒక ఆర్తభక్తుని విన్నపం. ఒక శరణాగతుని దీనాలాపం, ఒక ప్రేమభక్తుని విరహవేదన, దర్శనోత్కంఠత, ఒక గురూపదేశం, ఒక చక్కని ఉద్బోధ స్పష్టంగా గోచరిస్తుంది. అంతేకాదు, అందులో ఇంకా రాధామాధవుల గుసగుసలు వినిపిస్తాయి. అందాల రాధమ్మ అందెలసవ్వడులు కర్ణపుటాలను

పవిత్రం చేస్తాయి. విశ్వమోహనమైన మురళీస్వరాలు, రాగాలరవళులతో ఎదలోని లోతులను తడుముతాయి. బృందావనంలోని అందాలు, యమునా తరంగవీచికలు, కన్నయ్య చిందించే చిద్విలాసాలు, నీలినీలి అందాలు, చిరుచిరుమందహాసాలు, రాసనాట్యాలు, వ్యత్యస్త పాదాలవింతలు, వంశీవినోదాలు, కరుణాపూరిత దృక్కులు, దయాంతరంగతరంగాలు, వెన్నముద్దల కమ్మకమ్మని రుచులు, అబ్బో! ఇంకా ఎన్నో.... ఎన్నెన్నో.... అబ్బ! వర్ణించగానెవ్వనబ్బ తరము. విశ్వన్నగారి మాటలే పాటలుగా మారి ఈ జగాన వెల్లివిరిసాయి అంటే అతిశయోక్తి కాబోదు. అట్టి మహాత్ముని పాదకమలాలకు కోటికోటి నీరాజనాలు.

ఇంత కమ్మగా, చెవులకు పసందుగా భగవంతుని సన్నిధానంలో నిలిపే హారతులను ఒకచోట చేర్చి 'మంగళమంజరి' పేరుతో పుస్తకరూపంగా తీర్చిదిద్దబడి 1988లో మొదటి ముద్రణగా శ్రీవిశ్వనాథ గురుదేవుల కరకమలాలమీదుగా మనందరికీ అందించబడింది. ఆ తర్వాత శ్రీవారు రచించిన మరికొన్ని హారతులను చేర్చి 2009లో రెండవ ముద్రణగా ముస్తాబై మనచేతికి అందినది. ఇప్పుడు ఆ ప్రతులన్నీ నిండుకున్నాయి. కనుక, మరింత ముచ్చటగా తీర్చిదిద్దబడి, ముందుగా విషయసూచికను చివరగా అకారాది అనుక్రమణికను జతపరచి మూడవ ముద్రణగా ముద్రింపబడిన 'మంగళమంజరి' ఇదుగో! ఇప్పుడు మీచేతిలోనే ఉంది. మూడుమార్లుగా ముద్రణాయజ్ఞంలో తోచినంత ద్రవ్యమును ఉదారంగా సమర్పించిన వదాన్యులందరిపై పేరుపేరునా శ్రీగురుదేవుల అపారకృప నిరంతరాయంగా వర్షించుచుండుగాక! అని మా ప్రార్థన. సహృదయ పాఠకులారా! ఇక మీరు చదవండి. ఇతరులతో చదివించండి. భగవత్పూజలో పాడండి. పాడుకొనండి. భగవత్ప్రేమను పొందండి. నిరంతరం భగవద్భావంలో ఓలలాడండి. శేషం భగవత్కృప.

**"అందించుట మా వంతు - ఆనందించుట మీ వంతు"**

**ప్రకాశకులు**

**శ్రీపాండురంగాశ్రమము**

# మంగళమంజరి

## విషయసూచిక


| క్రసం. | విషయము | పుట సం. |
|---|---|---|
| 1. | **శ్రీవిఘ్నేశ్వర హారతి**–కరిముఖ! శ్రీకర.. | 17 |
| | **శ్రీ గురుహారతులు** | |
| 2. | నీరాజనమిదే – గొనుమోదేవా! | 18 |
| 3. | గురువరా! నీ దయ | 19 |
| 4. | శ్రీశంకరాచార్య హారతి... గురుదేవ! గురుదేవ! | 20 |
| 5. | పూజాపాట – మాపూజ గొనుమో ప్రభూ! | 21 |
| 6. | మానసబోధ కీర్తన – భజరే! మానస – గోవిందం | 27 |
| | **శ్రీపాండురంగ హారతులు** | |
| 7. | అందుకొనుమో పాండురంగా! | 29 |
| 8. | దయాసాగరా! రుక్మిణీపాండురంగా! | 31 |
| 9. | నమో రుక్మిణీ పాండురంగ ప్రభో! | 32 |
| 10. | శ్రీపాండురంగాయ – శ్రీమనోవల్లభాయ | 33 |
| 11. | నాకు సర్వస్వము సర్వదా – పాండురంగడే! | 34 |
| 12. | దేవదేవా! పాండురంగా! దీనమందారా! | 35 |
| 13. | పాండురంగ! రుక్మిణీమనోహర! | 36 |
| | **శ్రీకృష్ణ హారతులు** | |
| 14. | జయ మంగళము కృష్ణ! | 39 |
| 15. | పతితపావనా! కృష్ణా! | 40 |
| 16. | రావయ్య మాధవా! రాధమ్మతోడ | 41 |

17. నినుజూడగలేనా? కృష్ణయ్యా! .................................. 42
18. కనుపించకున్నావు – నిను నమ్ముకొన్నాను.................... 43
19. నీరాజనమ్మో హరీ! శ్రీహరీ! .................................... 44
20. నీలమేఘసుందరా! ........................................... 45
21. ఒకసారి కనుపించవేమయ్యా!................................ 46
22. కరుణాసాగరా! రాధాసుందరా!................................ 47
23. రారా! వేగ చిన్నికృష్ణ! రావేమయ్యా! .......................... 48
24. బృందావనమ్ములో – అందాలదేవుడు ......................... 49
25. పలికింది మురళి – రాగాల రవళి! ........................... 50
26. అందుకోవయ్యా – అందముగ నివ్వాళి ...................... 51
27. శరణు దేవదేవా! కృష్ణా!......................................... 52
28. మురళీకృష్ణా! మోహనకృష్ణా! .................................. 53
29. రావా? గోపబాలా! ............................................ 55
30. పరిపాలయమామ్ – గిరిధారిన్ ................................ 56
31. వినుమా నివ్వాళి పాటలా! ..................................... 57
32. మరచితివా – గోపాలా!......................................... 58
33. కలయహరే! దయానిధే! ........................................ 60
34. నీరాజనము గొనుమా – గోపాలా!............................. 61
35. నల్లనివాడా! రేపల్లెరేడా!........................................ 62
36. గోపాలదేవ! కాపాడరావ! ...................................... 63
37. హారతిన్ గొనుమో శుభాకారా! ................................ 64
38. మురళీమోహన! మాధవ! ...................................... 65
39. నమో గోపబాల! నమో చారుశీలా! ........................... 66

40. గోపాల! దయసేయుమా! ........................................ 67
41. వేణుగానలోలుడు – వేంచేసి యున్నాడు ..................... 68
42. కొనుము నివ్వాళి – గోలోక రాజా! ............................ 69
43. ఎందుకు దయరాదు నీకు ........................................ 70
44. మాధవా! హరి! గోవర్ధనధర! .................................. 71
45. పరసుఖదా! శ్రీ అనంత – పద్మనాభ! ........................ 73
46. రసమయ! శ్యామల సుందరా! ................................. 74
47. పిలచితి – రావయ్యా! కృష్ణయ్యా! ............................ 75
48. ఆలపించుమా మురళిని ......................................... 76
49. మురళీమోహన! కృష్ణయ్యా ...................................... 77
50. రారా! కృష్ణా! రాధాకృష్ణా! ...................................... 78
51. కరివరదా! కలవు సదా! ........................................ 80
52. కదలిరా హరి! నిండుగా ........................................ 81
53. గిరిధరా! మాధవా! ................................................ 82
54. కొను మంగళమో హరీ! ........................................... 83
55. అంతరంగాలలో – అలరారు .................................... 84
56. మురహరా! ఓ! గిరిధరా! ........................................ 85
57. మదన – జనక! హరి! ........................................... 86
58. నీలతేజ! రాధా – లోల! మంగళం ............................ 87
59. శ్రీపాండురంగా! తులసీ భూషితాంగా! ....................... 88
60. కృష్ణ! పరమాత్మ! వేగ – రావయా! ........................... 89
61. అల్లరివాడా! ఓ! శ్యామసుందరా! .............................. 90
62. నీరాజనమిదుగో – ప్రేమమయా! ............................. 91

63. అందుకోవయ్యా! మంగళము ................................ 92
64. రాధాలోలా! మంగళమో హరి! ............................ 93
65. అందమైన డెందమని ........................................ 94
66. రాధామాధవ! గిరిధారీ! రారా! ............................ 95
67. మురళీధరా! తిలకించురా!.................................... 96
68. హారతి – గిరిధారీ! గోవిందహరి! ........................... 97
69. హారతి – గొనుము – రాధాలోల! ........................... 98
70. గోకుల బృందావిహారీ! శ్రీహరి................................ 99
71. అందుకోర కృష్ణయ్యా! అందాలహారతీ!.................... 100
72. రాధికా సుందరా! గిరిధర!................................... 101
73. నీవాడనుగానా? శ్యామసుందరా! .......................... 102
74. వెల్గు వికసించింది .......................................... 103
75. కనిపించురా! కరుణాసాగరా!................................ 104
76. వేదాటవిలో – వెదకెదరేలా? ............................... 105
77. గిరిధర! గోపాల! ............................................. 106
78. రావయ్యా! రాసరాజా! ...................................... 107
79. మంగళమో – గిరిధారీ! .................................... 108
80. ఏహి మాధవా! ............................................... 109
81. కనులార ఒకసారి కనుపించుమయ్యా! .................... 110

## శ్రీరామ హారతులు

82. మనసా దిగులెందుకే......................................... 112
83. శ్రీరఘునందన ................................................ 113
84. ఓ పరమదయాకర! రామా!.................................... 114

85. మంగళమిదె గొనుమో! రామా! ............................ 115
86. మన్నించుమా! మమ్ములన్ శ్రీరామా! ....................... 116
87. నా గతి నీవే రామా! ........................................ 117
88. శ్రీరామ! జయరామ! ........................................ 118
89. దశరథ నందన! దశముఖ భంజన! ....................... 119

## శ్రీఆంజనేయ హారతులు

90. నీరాజనము గొనుమా! కపివీర! ............................ 120
91. కపీశా! హారతి గొనుమా! .................................... 121

## శ్రీశివ హారతులు

92. శివ! శివ! యనవే మనసా! ................................. 124
93. రారా! మంగళమందుకోరా! హరా! ........................ 125
94. మంగళం - గిరిజాంబికా సంగ! ............................ 126
95. ఓం మంగళం నమశ్శివాయ! ................................ 128
96. శంభో! శివ! సాంబ! శివ! .................................... 129
97. శివ! నీరాజనమ్మో పురారీ! .................................. 130
98. నిటలాక్ష! నీరాజనం ........................................... 132
99. పరమాత్మ! దయజూడరా! .................................... 133
100. ఎందుకయ్యా? జాగుసేతువు ............................... 134
101. నగజా మనోమందిరా! నటరాజ! ........................... 135
102. ఓ... శివ! గౌరీధరా! ......................................... 136
103. మంగళమయ్య - మహేశా! ................................. 137
104. నటసార్వభౌమ! నాలో వెలుగుమా! ........................ 138

105. పరమాత్మ! హరా! .............................................. 139
106. శంభో గిరిజాసమేత! చంద్రశేఖరా! ......................... 140
107. రావయ్యా! శంకరా! రసాకార! .............................. 141
108. నీరాజనము- భవానీ శంకరా! .............................. 142
109. నీలకంధరా! నీరాజనమ్మో! .................................. 143
110. మేలు నీకగు దీపమాల గైకొనుమా! ......................... 144
111. శివా! మంగళమ్ము - శివాలోల! ............................ 145
112. తే - దదామి - మంగళం .................................... 146
113. వెండికొండ దేవరా! ............................................ 147
114. గంగాధరా! హరా!............................................. 148
115. సమాకలయ - శుభ మంగళం ................................ 149
116. మంగళమో శంకరా! మా గతి ............................... 150
117. ఉమాభరణం - శరణం ........................................ 151

## శ్రీదేవి హారతులు

118. నీరాజనము గొనుము వాణీ! ................................. 154
119. ఆనందమయీ! శ్రీలలితా! ...................................... 155
120. జననీ! శ్రీరాజరాజేశ్వరీ!......................................... 156
121. కరుణామయి! శ్రీలలితా! ...................................... 157
122. జననీ! నీరాజనం............................................... 158
123. నీరాజనము - యశోదామాతా! .............................. 159
124. మంగళమమ్మ యశోదాదేవీ!.................................. 160
125. శుభమంగళమే రమే! ......................................... 161
126. పంచదశీ మను రాజ శోభతే!................................. 162

## వివిధములు

127. జయహారతి సత్యవ్రత నారాయణదేవ!....................... 164
128. వివేకానంద యతివర్యా! ..................................... 165
129. శ్రీసాయినాథాయ .............................................. 166
130. నరుడా! హరిని భజించుమురా! ............................ 167
131. వందనమో నృహరీ!............................................ 168
132. శ్రీనాచశైల – లక్ష్మీనృహరీ!.................................. 169
133. లాలీ వనమాలీ! ................................................ 170
134. లాలీ గోపబాలా! ................................................ 171
135. జోజో దయాపాంగ ............................................. 172
136. జోజో చిదానంద సుందర ................................... 173
137. శ్రీనివాస! ముకుంద! మురళీ................................ 174
138. మేలుకో గోపాల! ............................................... 176
139. లేవయ్యా! కృష్ణయ్యా! ...................................... 177
140. మేలుకో! నరసింహదేవ! .................................... 178
141. మంగళమ్ ........................................................ 179
142. శ్రీపాండురంగాష్టకమ్ ......................................... 180
143. శ్రీభావానందాష్టకమ్ ......................................... 182
144. శ్రీవిశ్వనాథాష్టకమ్ .......................................... 184
అకారాది అనుక్రమణిక....................................... 186

॥ శ్రీకృష్ణ శ్శరణం మమ ॥

# పరమపదసోపాన పంచకమ్


సోదరా!

సర్వదా.....

సర్వవృత్తులతో.....


పరమాత్ముని





- **విశ్వసించుము**
- **ప్రేమించుము**
- **సేవించుము**
- **స్మరించుము**
- **తరించుము**

# శ్రీ గురు ప్రార్థన



శ్లో॥ శ్రీకృష్ణాద్వైత సిద్ధాంత స్థాపినం యతిశేఖరమ్ ।
భావనాబల సంపన్నం భావానంద గురుం భజే ॥

**శ్రీశ్రీశ్రీ**

**యతివర భావానంద భారతీ భగవాన్ జయతు**

# శ్రీ భావానంద గురు బిరుదావళి


శ్రీమదనంత సౌందర్య, ప్రేమామృతానంద, మాధుర్యరస స్వరూప, అచింత్యానంత కళ్యాణగుణగణాకర, పరాత్పర, పూర్ణబ్రహ్మ, పురుషోత్తమ, షడైశ్వర్యపరిపూర్ణ, "శ్రీరుక్మిణీ పాండురంగ మహాప్రభు", కరకమల సంజాత, స్వతేజసాకల్పిత శ్రీపాండురంగాశ్రమ తేజోవిరాజిత, శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య, శమాది షడ్గుణసంపన్న, ధర్మసంస్థాపక, ముముక్షు జనోద్ధారక, కరుణాసముద్ర, జీవన్ముక్త సామ్రాజ్య పట్టాభిషిక్త, సహస్రాధిక శ్రీవిరాజిత, శ్రీశ్రీశ్రీ యతివర భావానందభారతీ సద్గురు భగవాన్ జయతు (జై) ॥

❖ ❖ ❖


# శ్రీ విశ్వనాథ గురు బిరుదావళి

శ్రీశ్రీశ్రీ యతివర భావానంద భారతీ భగవత్పాద కరకమల సంజాత, వైరాగ్యవిద్యా, భక్తియోగ శిక్షా ప్రవర్తక, పూర్ణకామ, తేజోమండలాధీశ, అశరణ శరణ్య, కరుణా వరుణాలయ, జీవమాత్రసఖ, భక్తభక్తిమాన్ భక్తానుగ్రహకాతర, శ్రీపాండురంగాశ్రమ సర్వాధ్యక్షప్రభు, శ్రీమదప్పాలవంశ పయః పారావార రాకాసుధాకర, శ్రీశ్రీశ్రీ విశ్వనాథ గురు మహరాజ్‌కీ జై ॥

❖ ❖ ❖



భావానంద హరి! రాధాకృష్ణ హరి!



**శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి ప్రతిష్ఠాపన**

**షష్టిపూర్తి (జులై 1954-జులై2014) మహోత్సవ సందర్భముగా**

**07-07-2014న మూడవ సారిగా ముద్రింపబడిన**

## ఈ పుస్తకమునకు సహకరించిన ద్రవ్యదాతలు

1. **ముట్పూరి పెంటయ్య, అంజమ్మ చారిటబుల్ ట్రస్ట్ గారు**

   గ్రా॥ వికారాబాద్, జి॥ రంగారెడ్డి

2. **శ్రీకృష్ణార్పణభావముతో ఒక కృష్ణభక్తురాలు**


3. **మంకెన రాఘవరెడ్డి, అమృతమ్మగారి కుమారుడు**

   **ఎం. రామకృష్ణారెడ్డి, రమాదేవిగార్లు**

   గ్రా॥ వెల్దండ, జి॥ వరంగల్

వదాన్యులగు పై దాతలందరికిని శ్రీరుక్మిణీ పాండురంగస్వామివారు ఆయురారోగ్యైశ్వర్యములను ప్రసాదించి కాపాడుగాక!

# 1. శ్రీవిఘ్నేశ్వర హారతి



**మోహనరాగం - ఆదితాళం**

**(శివ శివ శంకర - భక్తవశంకర -**
**శంభోహరహర నమో నమో - అనుమాదిరి)**

ప॥ కరిముఖ! శ్రీకర! పరమదయాకర!
గౌరీసుత! శుభ – నీరాజనం ॥క॥

1. వర పాశాంకుశ –వరదాభయకర!
పాహి – విఘ్నహర! లంబోదర!
హరగణనాయక! సిద్ధివినాయక!
మరవకుమా – మమ్ము – వరదాయకా! ॥క॥

2. మూషకవాహన! మోదకాశనా!
దోషాకర పరి – హాసి శిక్షణా!
దోషహరణ! శుభ – వేష! నాగమయ–
భూషణ! సేవక – జనపోషణా! ॥క॥

3. తొలినీపూజలు – సలిపిన – విఘ్నాలు –
తొలగి – సౌఖ్యములు –కలుగునయా!
సలలిత – సుందర! స్వామి! ఏకరద!
కలిహర! విశ్వేశు – గనవేమయా!! ॥క॥

## ౨. శ్రీగురు హారతి

**హిందుస్తాన్ భైరవి రాగం - ఆదితాళం**

ప॥ నీరాజనమిదె - గొనుమో దేవా !
నిరవధి సుఖదాతా ! శ్రీగురువర ! మా చేత ॥శుభ-నీ॥

చ॥ ఆర్తారావములందుకొని - మా
యార్తిని బాపగ బూనుకొని ।
కరుణామృతరస - కణములు మాపై
గురిపింపుము మది - దయనుగని ॥శుభ-నీ॥

2 జీవకోటి దుస్థితినిగని - గురు
దేవా! మంగళ - గీతివిని - హరి
భావానందమును - ప్రసాదించి మము
గావుము - నిరుపమ - ప్రేమధుని ॥శుభ-నీ॥

3 శ్రీగురుదేవా! రాగదే -
చిత్తశాంతి - సమకూర్పగదే
పత్ర - పుష్ప - ఫల - తోయములన్గొని
పరమానందము - నొందగదే ॥శుభ-నీ॥

# ౩. శ్రీ గురు హారతి

**మోహనరాగం - ఆదితాళం**

**(నవ్వవే నా చెలీ అనుమాదిరి)**

ప॥ గురువరా ! నీ దయ - ॥గు॥

అ॥ సరగునరావా! నా - మొరవినిబ్రోవ !
హరిమయ సంసార - యతిపుంగవా ! ॥గు॥

చ॥ కాషాయ శుభవర్ణ - కలితాంబరా !
కరవిస్ఫురద్దండ - జలమండలా !
కరుణాకరా ! మే - ఘ శ్యామలా !
కనుమా - భావానంద - వనమందిరా ! ॥గు॥

2 జీవబ్రహ్మాద్వైత - భావప్రదా !
దేవా! భూమాకార - ధీవైభవా !
సేవా ప్రియా - భూమి - దేవాన్వయా
శ్రీవత్సరమణీయ - శ్రీవిగ్రహా ! ॥గు॥

3 శ్రీపాండురంగ స్వ - రూపాఘనా !
శ్రితలోక మందార - నతపాలనా !
ఓ పావనా! - జ్ఞాన - దీపస్వనా !
శ్రీపాద - విశ్వేశ - శివకారణా ! ॥గు॥

# 4. శ్రీ శంకరాచార్య హారతి

**యమన్ కళ్యాణి రాగం - ఆటతాళం**

ప॥ గురుదేవ! గురుదేవ! వరశివగురుపుత్ర! పరశివ సుఖమాత్ర!
కరుణాలయ ! మంగళ మాకలయ సుచారిత్ర !
గురుదేవ ! గురుదేవ ! ॥గు॥

చ॥ కాషాయాంబర దండకమండలు ధృతవేష! ఖండిత కలికలుష!
పోషిత శరణాగతజన ! దూషితభవదోష !
శోషిత దుర్మత దుర్మదరోష ! మృదుభాష !
భాషావాదోత్తీర్ణవిశేష ! సుమనీష !
గురుదేవ ! గురుదేవ ! ॥గు॥

2 మండనమిశ్రోద్ధత మత ఖండన చాతుర్యా! ఽ ఖండతపశ్చర్య!
పాండిత్యోజ్జీవిత భూమండల శుభచర్య !
పాండుర దివ్య సలలితాఽఖండయశోధుర్య !
పండిత శ్రీశంకరభగవత్పాదాచార్య !
గురుదేవ ! గురుదేవ ! ॥గు॥

3 భావేభావేఽద్వైతమతా విష్కృతిబోధ ! పరివ్రాజకనాథ!!
సేవేత్వామిహసవినయ - భావమమితగాధ!
కేవల సచ్చిత్సుఖమార్గావేక్షణ విబుధ !
హే విశ్వార్తి నివారణ ! కృష్ణహృదయ సౌధ !
గురుదేవ ! గురుదేవ ! ॥గు॥

# 5. పూజాపాట

## తిలక్ కామోద్ రాగం - ఆదితాళం

ప॥ మా పూజగొనుమో ప్రభూ ! దయజేసి ॥మా॥
అ॥ ఓ పాండురంగా ! సకలోపచారాలతో
శ్రీ పాండురంగా ! ప్రేమోపచారాలతో ॥మా॥

### ధ్యానము

1 శ్రీరుక్మిణీనాథ ! దరహాసమున రాధ
దరిజేరి - వెలుగొంద - పరమానందము చింద
మురళీమోహన - పింఛధర ! కృష్ణ ! గోవింద !
మరువకనిన్నే - మా మదిలో - ధ్యానింతుము ॥మా॥

### ఆవాహనము

2 ఏకారణములేక - లోకాలనేలుదువు
ఆకారరహితా - బ్రహ్మాకార పరమాత్మ
ఆకారముననిన్ను - ఆనంద పీఠాన
ఆవాహనము సేతు - మయ్యా - మక్కువదీర ॥మా॥

### సింహాసనము

3 సిరిగల్గు దొరవీవు - నిరుపేదలము మేము
సరియైన పీఠమ్ము - సమకూర్చితేలేము
హరి ! ప్రేమతిలకించి - ఆసీనుడవు గమ్ము
అర్పింతుమయ్యా - సింహాసనముగ హృదయము ॥మా॥

## పాద్యము

4 పరిశుద్ధమగు - చంద్ర - భాగోదకము దెచ్చి
మెరుగైన - నవదూర్వాం - కురమంజరుల జేర్చి
పరమాత్మ - నీపాద - పద్మాలు - భక్తితో -
ప్రక్షాళణముజేసి - పాద్యమర్పించెదము ॥మా॥

## అర్ఘ్యము

5 మురళీవాదనమందు - పరికింప కనువిందు
వరదాన గుణమందు - సరిలేరు జగమందు
మురిపించు తనువే - మాపరమైన క్షణమందు
కరనీరజాలు - అర్ఘ్యమునంద - మునుముందు ॥మా॥

## ఆచమనము

6 నెమ్మితురాయి కురుల - నీటుగ కదలాడ
తమ్మియందము మించు - తావక ముఖమందు
కమ్మని హరిగంగ - కరతలమున నింతు
ముమ్మారు - ఆచమన - మును జేసి - ప్రేమతో ॥మా॥

## మధుపర్కము

7 ఆలయమున నీకు - అభిషేక మొనరింప
పిలచిరి - బంగారు - పీఠమ్ముపై జేర
ఆలస్యమగునేమొ? - అలసిపోదువు స్వామి!
హాయిగా మధుపర్క - మారగించుము - వేగ ॥మా॥

## పంచామృతస్నానము

8 సంచితపుణ్యాలు - సార్థక్యమును జెంద
పంచోపచారాల - పరిచర్య సేయుదుము
పంచాస్యపీఠాన - వేంచేసి - దయతోడ
పంచామృతస్నాన - మాచరించుము - తండ్రి! ॥మా॥

## శుద్ధోదకస్నానము

9 ఘనహేమకలశాల - గంగోదకము దెచ్చి
పునుగు - జవ్వాజి - కర్పూ - రాదులను జేర్చి
మనసార - నమకాది - మంత్రాలు - పఠియించి -
ఆనందముగ నిన్ను - అభిషేకింతుము - స్వామి! ॥మా॥

## వస్త్రము

10 చనువున - దరిజేరి - కనులార - తిలకించి
తనువెల్ల తడియొత్తి - తగముంగురులు దువ్వి
వినయాన - నునుమేన - విరితైలమును రాచి
కనకాంబరాలిత్తు - కట్టుకో - నా స్వామి ॥మా॥

## ఉపవీతము

11 బ్రహ్మను గన్నయ్య - బ్రహ్మమె నీవయ్య
బ్రహ్మభావము నందు - భాసిల మముజేసి
బ్రహ్మత్వ సిద్ధికై - బ్రహ్మరూపమ్మైన
బ్రహ్మసూత్రము - సగుణ బ్రహ్మమా! ధరియించు ॥మా॥

## శ్రీచందనము

12 కమనీయ - శ్రీచందనము - ఫాలమున దీర్చి
కస్తూరి తిలకమ్ము -కడు వేడ్కతో దిద్ది
ఘుమఘుమలాడ - కుంకుమబొట్టు - సవరించి -
కమలాక్షముల చుట్టు - కాటుక నర్పింతు ॥మా॥

## అక్షతలు

13 దీక్షతో జగమెల్ల - రక్షించు దొరవైన
పక్షివాహన ! భక్త - పక్షపాతివి - దేవ!
అక్షయ సుఖమిమ్ము - అఖిలోపచారాల
అక్షతలర్పింతు - మయ్యా! యేమనుకోకు ॥మా॥

## ఆభరణాలు

14 బంగారు మొలనూలు - బర్హిపింఛపు దండ
చెంగు చెంగున మ్రోగు -సిరిసిరి - మువ్వలు
రంగైన కడియాలు - రతనాలహారాలు
సింగారింతుము నీకు - చిన్మయాభరణాలు ॥మా॥

## పుష్పము

15 మేలైన తులసీ దళాలతో - దివ్యవన -
మాల - నీగళమందు - కేలనర్పణజేసి
చాల - ప్రేమతో జెప్పి - సాహస్రనామాలు
పూలతో - పదనీర - జాల పూజింతుము ॥మా॥

## ధూపము - దీపము

16 గోపీజనావాస ! గోవింద ! సర్వేశ !
చూపింతు - సాంబ్రాణి - ధూపమాఘ్రాణించు
నీ పాదములముందు - దీపాలు - వెలిగింతు
గోపాల - కరుణించి - కొనుమయ్య ! దీవించి ॥మా॥

## నైవేద్యము

17 పాలు - మీగడ - వెన్న - పక్వాన్నమధురాలు -
శాల్యన్నపేయాలు - చవులూరు - శాఖాలు
చాలుగపచ్చళ్ళు - పలుఫలహారాలు
చనువున - వడ్డింతు - మనసార - భుజియించు ॥మా॥

## హస్త పాద ప్రక్షాళణము - పానీయము - తాంబూలదక్షిణలు

18 కరపాదములుగడిగి - కమ్మని - జలమిచ్చి
కర్పూరవిడియమ్ము - అర్పింతు కరమందు
కానుకలిడలేను - మానసమును గొమ్ము -
కమలాక్షముల జార - కరుణా - సముద్రాలు ॥మా॥

## నీరాజనము

19 కూరిమి నినుగోర - కోరికనెరవేర
భారము నీదేర - పరదేవతా - రార !
సారెసారెకు ప్రేమ - సంగీత మొప్పార -
నీరాజనముతోడ - ఆరాధింతుము - దేవ! ॥మా॥

## మంత్రపుష్పము

20 సరగున రావయ్య! మొరవిని - కృష్ణయ్య !
సరసకు వేంచేసి - వరముల నిడుమయ్య
మరువకుమా! నన్ను - చరణాల కర్పింతు
మురళీధరా ! మంత్ర - పుష్పాంజలిని - స్వామి! ॥మా॥

## ప్రదక్షిణ - నమస్కారము

21 కమ్మగ హరినామ - గానసుధన్ - గ్రోలి
కనులార - శ్రీపాద కమలాలు దర్శించి
ముమ్మారు నీచుట్టు - ముమ్మరముగ దిరిగి
సమ్మదమున జేతు - సాష్టాంగవందనము ॥మా॥

## పూజాఫలము

22 వినుమయ్య । గోవింద! విశ్వేశకృతపూజ
విని సంతసమునొంది - మనసార దీవించు
దినదినమీ - పూజ - లను - సల్పువారికి
కలుగగ సౌఖ్యాలు - తొలగగ - పాపాలు ॥మా॥

**పుండరీకవరద! హరి! విఠల!**

# ౬. మానసబోధ కీర్తన

**తిలక్ కామోద్ రాగం- ఆదితాళం**

ప॥ భజరే – మానస । గోవిందమ్ ॥భ॥
భజ – మమ–హృదయధనం–బ్రహ్మానందఘనమ్ ॥భ॥

చ॥ నందకిశోరం – నవనీత చోరం –
బృందావన భువి – కృత సంచారమ్ ।
బృందారకగణ – వందితపాదార –
విందం – మధురం – మధురాతి మధురమ్ ॥భ॥

మిత్ర॥ మందపవన – చలిత – లలిత – మోహన –
మదశిఖిపింఛా – లంకృత చికురమ్ ।
మందహాస చంద్రికా – సమన్విత –
మాధవం! శ్యామలం! నిరంతరమ్ ॥భ॥

2 భ్రమణే – తవ – సంసారో – భాతి
శమనేతవ సర్వం – బ్రహ్మేతి ।
భ్రమణేచ్ఛాయది – బలీయసీ చేత్ –
భ్రమ సతతం – శ్రీహరి – పదయుగళే ॥భ॥

మిత్ర॥ రామకృష్ణ – హరిహరాది – పావన
నామమణి గణైర్భూషిత – నిర్మల
శ్యామతేజ – మఖిల జగ ద్వ్యాప్తం
సచ్చిదానందమయం – నిరంతరమ్ ॥భ॥

3 మురళీలోలం - కరధృత శైలం
అరుణ - నీల - రాధాహరి యుగళమ్
కరుణాపూరిత - హృదయ విశాలం
కాంచనచేలం - గోపాలబాలమ్ ॥భ॥

మిశ్ర॥ శరణాగత జన - పాలన శీలం
నిరుపమాన సుందర - ముఖ కమలమ్
విరచిత పటుతర - మాయాజాలం
విశ్వనాథ - వత్సలం - నిరంతరమ్ ॥భ॥



# 7. శ్రీ పాండురంగ హారతి

## పంచరాగమాలిక - జంపెతాళం

### 1. భీంప్లాస్ రాగం

ప॥ అందుకొనుమో పాండురంగా!

హాయిగా - నీరాజనము - పాపభంగ ॥అందు॥

అ॥ ఇందుధరనుతపాద - యికనైన దయరాద ॥అందు॥

### 2. కాఫీ రాగం

చ॥ కందర్పశతకోటి - కమనీయ తమశ్యామ -

సుందరాకార ! గోవింద ! హరి ! రావేర !

అందముగ నా హృదయ - బృందావనములోన -

నందనందన! ప్రేమ - విందిడుదు మనసార ॥అందు॥

### 3. కళ్యాణి రాగం

2. అనయమ్ముయోచించి - తనువెల్ల పులకించి

కనుల జలములనించి - కలిబాధల దలంచి

మనములో ప్రేమించి - మాధవా ! యని పిలువ

కనికరింపవదేల ? - కలనైన ననుగాంచి ॥అందు॥


## 4. మోహన రాగం

3. మురళీరవానంద - మున నీవు సొక్కింప
పరవశత్వమునొంది - పసిడి చాయలు వెలయ
వర రుక్మిణీమాత - మురియుచును వీక్షింప
శరణాగతుడనాదు - కరము కరమున్సాచి ॥అందు॥

## 5. శివరంజని రాగం

4. ఎలనవ్వులలర - వెన్నెలరేయి - సైకత
స్థలమందు - వ్రజగోప లలనల్ గుముల్గూడి
కొలువ రాధాదేవి - నిలువ నీచెంతనే
పలురాగములదీటు - పాట విశ్వమునోట ॥అందు॥

**గమనిక: పైపాటలోప్రతి చరణమునకు 4వ పాదము చివరన పల్లవిని భీంప్లాస్ రాగమునే అందుకోవలెను.**



# 8. శ్రీపాండురంగ హారతి

(తెరేప్యార్కా అనుమాదిరి)

ప॥ దయాసాగరా! రుక్మిణీపాండురంగా!

అ.ప॥ దయంజూపి నను నీ! దరింజేర్చుకోరా! ॥దయా॥

చ॥ ప్రభూ! కాంచరమ్ము – శుభారార్తికమ్ము ।

ప్రసన్నుండవైన నదియే – ప్రసాదమ్ము – వరము॥దయా॥

2 మదాధారమీవే – సదా దీనబాంధవా !

మనోవీధిలోన నిలచి – మమ్ముబ్రోవు మాధవా! ॥దయా॥

3 హరీ! విశ్వనాథ ప్రేమా – దరా! శ్యామసుందరా!

మొరాలించుమయ్య! మురళీధరా! విఠ్ఠలేశ్వరా! ॥దయా॥



# 9. శ్రీపాండురంగ హారతి

**మాల్కోస్‌రాగం - ఆదితాళం**

**(ఉమాపార్థివా అనుమాదిరి)**

ప॥ నమో రుక్మిణీపాండురంగ ప్రభో! ॥నమో॥

అ॥ నతాధార ! నీరాజనం తే విభో! ॥నమో॥

చ॥ కరుణాశీలా! కాంచనచేలా!
మురళీలోలా ! మోహనబాలా!
శరదిందీవర - సుందరనీలా!
శరణాగతపాల! రాధాలోలా! ॥నమో॥

2 మధురం మధురం - నామస్మరణం
మధురం రూపం - మురళీగానమ్
మధురానాథస్య - సకలం మధురం
మధురం మధురం - మధురం మధురమ్ ॥నమో॥

3 అశరణ శరణం - కలిమల హరణం
ఆనంద కారణం - భవసంతరణమ్
అపహృతపటుతర - మాయావరణం
హరిచరణయుగం - శరణం శరణమ్ ॥నమో॥

4 ఏహి మురారే! కృపయాశీఘ్రం
దేహి కృష్ణతవ - దర్శన భాగ్యమ్
మోహమహార్ణవ - పతితం దీనం
పాహి పాహి మాం - విశ్వేశమనిశమ్ ॥నమో॥

# 10. శ్రీపాండురంగహారతి

**యమన్ కళ్యాణి రాగం - జుల్వతాళం**

**(రామచంద్రాయ - అనుమాదిరి)**

ప॥ **శ్రీ**పాండురంగాయ – శ్రీమనోవల్లభాయ ।
చిదానందసాగరాయ – సదా మంగళమ్ ॥భవతు శ్రీ॥

1 **భా**వబలసమన్వితాయ – భావభక్తసేవితాయ
భావానందయతివరాయ – భవ్యమంగళమ్ ॥భవతు శ్రీ॥

2 **వా**సుదేవాయ వేణు – వాదనప్రియాయ – కనక
వాసనే – సుఖాకరాయ – పరమమంగళమ్ ॥భవతు శ్రీ॥

3 **నం**దనందనాయ – మౌని – బృందవందితాయ – గోప
సుందరీ మనోహరాయ – శుభదమంగళమ్ ॥భవతు శ్రీ॥

4 **ద**యాపూర్ణమానసాయ – ధర్మమార్గ గోచరాయ
దాసవిశ్వనాథ సన్ను–తాయ మంగళమ్ ॥భవతు శ్రీ॥

5 పండిత – జన – మండిత – వెలదండ – మఠనివాస ।
పతిత–పావనాయ–ఘన నిభాయ మంగళమ్ ॥భవతు శ్రీ॥

# 11. శ్రీపాండురంగ హారతి

## పాటకాదు - నా మనసులోని మాట

### జుల్వతాళం

(ఐచ్ఛికము)

ప॥ నాకు సర్వస్వము సర్వదా – పాండురంగడే! ॥నా॥

అ॥ నామజపమొకటే జీవ జీవ – నాధారము ॥నా॥

చ॥ తల్లి తండ్రి గురు దైవము – ధనము జనము సంసారము
తత్పదలక్ష్యము బ్రహ్మము – పాండురంగడే! ॥నా॥

2 రాసకళాకోవిదుడు – రసికుడు రాధావరుడు!
వసియింపగ తోడునీడ – పాండురంగడే! ॥నా॥

3 అణువుకన్న చిన్నవాడు – అన్నిటికన్న మిన్నవాడు !
కణకణమున నున్నవాడు – పాండురంగడే! ॥నా॥

4 నీలినీలి కురులవాడు – నెమలికన్ను శిరమువాడు!
నీలనీరదశ్యాముడు – పాండురంగడే! ॥నా॥

5 వెన్నకన్న ప్రేమతోడ – మన్నుదిన్న వన్నెకాడు!
యెన్నరాని దయామయుడు – పాండురంగడే! ॥నా॥

6 యే పేరున బిలచిన – యేరూపున దలచిన!
కాపాడును మనల సదా – పాండురంగడే! ॥నా॥

7 వివిధ మంగళప్రదుడు – వేణుగాన విశారదుడు!
విశ్వనాథ వత్సలుడు – పాండురంగడే! ॥నా॥

*శ్రీ యువ సం॥ పుష్య. శు. దశమి, ఆదివారము*

# 12. శ్రీపాండురంగహారతి

(చక్కనయ్యా చందమామ అనుమాదిరి)

ప॥ దేవదేవా! పాండురంగా! దీనమందారా!
సేవయొసగి కావుమయ్య! జీవనాధారా! ॥దేవ॥

చ॥ మాటి మాటికి వేడుకొన్న - మౌనమెందుకు గిరిధరా!
మనసువిప్పి కరుణతోడ - మాటలాడుము శ్రీధరా!
నేటికైనా యేనాటికైనా - నేను నీవాడరా!
నీదె భారమురా! ॥దేవ॥

2 పరుగులిడును దేని కొరకో - తెరవు మనసుకు తెలియదు
ప్రతిపదమ్మున జగములన్నీ - బ్రహ్మమయమని యెరుగదు
భావమంతయు నీవు గానిది - బంధమే తొలగదు
భయము విడనాడదు! ॥దేవ॥

3 శ్యామసుందర నామజపమే - సకల జీవుల కర్తవ్యము
స్వామి! నీపై ప్రేమలేనిది - యేమియున్నా వ్యర్థము
శ్రీమనోహర! నీ విశ్వముపై - చిలుకు దయారసము
శ్రితహిత ! మంగళము! ॥దేవ॥

# 13. శ్రీ పాండురంగ హారతి

## సప్తరాగ తాళ మాలిక

(హిందుస్తాన్ భైరవిరాగం - ఆదితాళం - పల్లవి అనుపల్లవి)

ప॥ పాండురంగ! రుక్మిణీమనోహర !
పరమ దయాకర! వేణుధర ! శ్రీ ॥పాండు॥

అ॥ పుండరీక వరదా! పరాత్పర !
పురుషోత్తమ! శరణాగత వత్సల ! ॥పాండు॥

**1. మాల్కోస్‌రాగం–ధృవతాళం–చతురశ్రజాతి (14) అక్షరములు**

దీనులపాలిటి దొరవని
దిక్కులేని - వారల - బ్రోచెదవని
మనమున - నమ్మిన దీనుని
మనవిని - విను మనసార ప్రేమధుని!

**మిశ్ర– దీనుల పాలిటి... ... ప్రేమధుని** ॥పాండు॥

**2. చక్రవాకరాగం–మఠ్యతాళం–చతురశ్రజాతి (10) అక్షరములు**

గరుడ గమన! శేషశయన! కలిమల హరణా!
నిరవధి సుఖ! నిత్య–సత్య–నిర్వాణ–వితరణ!
కరివరదా! కావరావ? కళ్యాణ - సుగుణ!
అరమర–సేయక - మమ్ముల - ఆదరమ్మున

**మిశ్ర– గరుడ గమన! ... .... ఆదరమ్మున** ॥పాండు॥

**3. భీంప్లాస్ రాగం-రూపకతాళం-చతురశ్రజాతి (6) అక్షరములు**

దేవ దేవ! ప్రేమభావ! దీన బాంధవా!! కావరావ!
భావశూన్య పూర్ణతత్వ! భక్తిగమ్య! మాధవా!
పావన-యమునా విహార! భవ్యబాల! కేశవా!
సేవక-జనతా భీష్టద! శ్రీముకుంద! వాసుదేవ!

**మిశ్ర- కేవల నిష్కామభావ - సేవాప్రియ! సర్వజీవ**
**సేవిత చరణ - సరోరుహ! భావానందమయ! సాదర**

॥పాండు॥

**4. కళ్యాణి-జంపెతాళం-మిశ్రజాతి- (10) అక్షరములు**

శ్రీ రాధికాధార! శ్రితలోక మందార!
మారాధికాకార! మత్తశిఖి పింఛధర!
ఘోరాఘ సంహార! గోలోక సువిహార!
గోపీ హృదయచోర! గోపాల! శృతిసార!

**మిశ్ర- కరధృత గిరిభార! కౌస్తుభ మణిహార!**
**సురముని హృత్కైర-వర నవనీత హార!** ॥పాండు॥

**5. తిలక్ కామోద్‌రాగం-త్రిపుటతాళం -**
**త్రిశ్రజాతి- (7) అక్షరములు**

నంద నందన! హరి! గోవిందా! మందరోద్ధర! బాలముకుందా!
మంద హాస-విభాస ముఖాంబుజ! మదన మోహన! నీలతేజా

**మిత్ర– బృందావన–విహరణ! గోపీ!**

**బృందవలయ–వేష్టిత శ్యామల!**

**సుంద రాంగ! చిన్మయ! సనకస–**

**నందనాది–వందిత–పదయుగళ!** ॥పాండు॥

**6. శివరంజనిరాగం–ఆటతాళం–చతురశ్రజాతి–(12) అక్షరములు**

కమలాలయ–ప్రాణ–వల్లభా! కృష్ణ!

కామ–జనక! దురిత – దుర్లభా!

కమలలోచన! విమల –కమల– పాదాంబుజ!

కమల–కోమల! హృదయ–కమల–మందిర భాస!

**మిత్ర– రామకృష్ణ–శివాది–పావన**

**నామ! మంగళధామ! యదుకుల**

**సోమ! మేఘశ్యామ! జగదభి**

**రామ! భక్తసుధామ–కామద!** ॥పాండు॥

**7. భూపాలరాగం–ఏకతాళం–చతురశ్రజాతి–(4) అక్షరములు**

భూసమేత! సర్వరూప! కేసరీసుత స్తుత!

వాసవాది వంద్య! శ్రీనివాస! కృష్ణ! మంగళమ్ ॥పాండు॥

రాసలోల! సప్తతాళ–రాగమాలికా ప్రియా!

వాసుదేవ! విశ్వనాథ–దాస పోష! మంగళమ్ ॥పాండు॥

**పుండరీక వరద! హరి! విఠల!**

# 14. శ్రీకృష్ణహారతి

**మాల్కోస్‌రాగం - ఆదితాళం**

**(పడిసేయకేగాలి అనుమాదిరి)**

ప॥ జయ మంగళము కృష్ణ! శుభ మంగళమ్ము

అ॥ దయతోడ గైకొమ్ము - దర్శనమ్మిమ్ము । ॥జయ॥

చ॥ నీకు రాధమ్మకు - నీ వేణువునకు
నిరతమ్ము మమ్మేలు - నిర్వ్యాజకృపకు
నిఖిలగోపాళికి - నీలజలరాశికి
నిత్యపూజలదేలు-నీ పాదములకు ॥ ॥జయ॥

2. నందగోపకుమార! నవనీతచోర!
బృందావనవిహార ! సుందరాకార!
కుందరద! శృతిసార! కుటిలకుంతలభార!
మందరాధార! సుకుమార! యదువీర! ॥జయ॥

3. కనులార ప్రతిచోట - కనుపించుమయ్యా!
తనివిదీరగ మురళి - వినిపించుమయ్యా!
అనయమ్ము నాలోన - అలరారుమయ్యా!
మనసార విశ్వమును - మన్నించుమయ్యా! ॥జయ॥

# 15. శ్రీకృష్ణ హారతి

**(భువనమోహనా అనుమాదిరి)**

ప॥ పతితపావనా! కృష్ణా! భక్తజీవనా! ॥ప॥

అ॥ వసుదేవనందనా! వంశీ భూషణా! ॥ప॥

చ॥ మొరాలించుమయ్యా! హరీ! నల్లనయ్యా!
పరాత్పరా! చిన్మయా! పరమాత్మ నీదయా!
కరాలంబమీయా! కదలిరావయా! ॥ప॥

2 నిరాకార భాసురా! నిఖిల హృదయ(విశ్వ)మందిరా!
నిజానందసాగరా! నిరుపమ మహిమాకరా!
నిత్యసత్య వేదసారా! నీలసుందరా! ॥ప॥

3 ఘనాకార తేజమా! ఘనీభూత బ్రహ్మమా!
మనోవీధి నిల్వుమా! మంగళమ్ము గాంచుమా!
ప్రణామమ్మిదో విశ్వము - పాలి దైవమా! ॥ప॥



# 16. శ్రీకృష్ణహారతి

(గోరింకకెందుకో అనుమాదిరి)

పః    రావయ్య మాధవా! రాధమ్మ తోడ    ॥రా॥

అః    రాసకేళీప్రియ! నీ - రాజనమ్ము జూడ    ॥రా॥

చః    గోవర్ధనమ్మెత్తి - గోవులనుగాచి
గోపకాంతలకెల్ల - కొంగుబంగారమై
గోపాలకృష్ణుడవై - కాపాడు పరమాత్మ
కోటిజన్మలెత్తినా - కోరుకొందు నిన్నే!    ॥రా॥

2    నామనసే అందాల - బృందావనమ్ముగా
నాలోని ప్రేమయే - యమునాస్రవంతిగా
నా నోముపంటవై - నా భాగ్యసీమవై
నాకొరకై మలచుకో - నాలోన నిలచిపో!    ॥రా॥

3    వ్యత్యస్త పాదాలు - వంశీ వినోదాలు
నిత్యనూతనమైన - నీ నీలియందాలు
ప్రత్యక్షముగ జూపు - పరితాపమిక చాలు
పాలించు విశ్వమును - పదివేల దండాలు!    ॥రా॥

# 17. శ్రీకృష్ణ హారతి

**(నినుజూడక నేనుండలేను అనువాదిరి)**

ప॥ నినుజూడగలేనా? కృష్ణయ్యా! ॥నిను॥

అ॥ మనసారగా - నా - కనువిందుగా - యిక
యేనాటికైనా? యేనాడైనా! ॥నిను॥

చ॥ నీ కడగంట తిలకించినా - నా కడగండ్లు క్షణముండునా?
నీ కరుణామృతము సోకినా - నే - కనలేని సుఖముండునా?
ఓ కరుణామయా! నీవె గతి చిన్మయా! ॥నిను॥

2 పావనమైన నీ నామమే - జీవనమైన సాఫల్యము
భావనలోన నీ వాసమే - జీవుల నిత్య సౌభాగ్యము
దేవ! శుభదాయకా! దీనజనపోషకా! ॥నిను॥

3 రాధికానాథ! దయసేయుమా!
రాసరాజా! మొరాలించుమా!
మాధవా! విశ్వమును బ్రోవుమా!
మంగళము గాంచుమా - బ్రహ్మమా!
సాధుమందారమా! సచ్చిదానందమా! ॥నిను॥

# 18. శ్రీకృష్ణ హారతి

(చలిగాలివీచింది అనుమాదిరి)

పు॥ కనుపించకున్నావు - నిను నమ్ముకొన్నాను
ఇకనైన దయజూడవా? హరీ!

అ॥ యికనైన దయజూడవా! ఓ హరి!
యికనైన దయజూడవా! ॥క॥

చ॥ బరువైతినా స్వామి! కరుణించి రావేమి?
శరణమీవే నాకు - మరుగేల నీకు ॥యిక॥

2. భవసాగరములోన - బడిమునుగుచున్నాను
పరమపూరుష! నన్ను - దరిజేర్చు మాపన్ను ॥యిక॥

3. నీ విశ్వమునకిమ్ము - నీ పాదకమలమ్ము!
సేవింతు గైకొమ్ము - శ్రీమంగళమ్ము! ॥యిక॥



# 19. శ్రీకృష్ణహారతి

(రాధామనోమందిరా! అనుమాదిరి)

ప॥ నీరాజనమ్మోహరీ! శ్రీహరీ! ॥నీ॥

అ॥ కూరిమితో గైకొనుమయ్య! మముజేరి ॥నీ॥

చ॥ అనదులపై నీకు - అలుకేల? దేవా!
తనయుని వేవేగ - దరిజేర్చుకోవా?
మనవిని వినవా? మాటాడరావా?
మనమున వసియించు మా - రాధికాధవా! ॥నీ॥

2 ఎన్నడు నినుగాంతు - కన్నార - ముదమున
ఏమని వచియింతు - నా మనోవేదన!
కన్నయ్య! నీ పాద - కమలాలు జగమున
నన్నేలునని - నమ్మి - నానయ్య - లోలోన ॥నీ॥

3 నవమేఘనిభ! వేణు - నాదానుకూల
నవనీతహర! గోప - నారీవిలోల!
భవబాధలికపైన - భరియింపజాల
భవదీయ విశ్వమును - పాలించు - జాగేల ॥నీ॥

# ౨౦. శ్రీకృష్ణ హారతి

**(చౌదువీకచాంద్‌హో అనుమాదిరి)**

ప॥ నీలమేఘసుందరా! నిఖిలహృదయమందిరా!

నీరాజనసేవాధారా! నీవే దిక్కురా! కృష్ణా! ॥నీ॥

చ॥ దేవాదిదేవ! కావరావా! దీనబాంధవా!
భావానవేడి నిన్ను పిలువ - పలుకు మాధవా!
ఓ వాసుదేవ! ప్రేమభావా! దేవకీభవా! కృష్ణా! ॥నీ॥

2 కన్నార నేడు నిన్ను గనగా - కలదు కోరిక
కన్నయ్య! నన్ను నీవు గాక - కాతురెవరిక
మన్నించి కరుణజూపు రాధా - మనోనాయకా! ॥నీ॥

3 ఆలాపనమ్ము సేతు వినుమా! నాలోని వేదన
ఆలోకనమ్ము చేసి దయతో - ఆశ్రితావనా!
గోలోల! విశ్వనాథపాలనా! గోపీమోహనా! కృష్ణా! ॥నీ॥



# 21. శ్రీకృష్ణ హారతి

**(ఒకసారి కలలోకి రావయ్యా! అనుమాదిరి)**

ప॥ ఒకసారి కనుపించవేమయ్యా! కృష్ణ
ఇకనైన దయరాద? నీలకాయ! గోపాలరాయ! ॥ఒక॥

చ॥ సొగసులగనియైన - నగుమోముతో
సోగకనుదోయితో - సొంపురానడలతో!
నిగమసారా! మధుర - నినదమ్ముతో
నీలమోహనకాంతితో - శాంతితో
గగననిభ! రాధతో - గరుడగమనమ్ముతో
జగమున మమ్మేలు - జయ దీక్షతో ॥ఒక॥

2. వరదుడవై ప్రేమ - గురిపించుమా?
పరమసుఖ పుంజమా! భవజలధితీరమా!
మురళిని మ్రోగించి - మురిపించుమా
మరువకుమా నన్ను - పురుషోత్తమా!
శరణమీవేసుమా! సాధుమందారమా!
పరమాత్మ! గోలోక - పురతేజమా! ॥ఒక॥

3. మనమున వసియించు - మధురాపతీ!
కనికరముగోరితి - వినయమునమ్రొక్కితి
అనయము నీవే - దిక్కని నమ్మితి
చనువున దరిజేర్చు - కొనవేడితి
వినుము నా సన్నుతి - కొనుము శుభహారతి
కనుమయ్య! విశ్వేశు - కరుణామతి ॥ఒక॥

# 22. శ్రీకృష్ణ హారతి

**మాల్కోస్‌రాగం**

**(పగలే వెన్నెలా! జగమే ఊయలా అనుమాదిరి)**

ప॥ కరుణాసాగరా! రాధాసుందరా!
కరుణతోడ – మంగళమ్ము – కనుము గిరిధరా! ॥క॥

చ॥ వెన్నదిన్న నీమది – మొర – విన్న కరుగదా?
చిన్నికృష్ణ! భవబాధల – చింత వీడదా?
కన్నయ్య! రారాదా? కాలమె చాలదా?
నిన్ను గాంచు భాగ్యము – నా కున్నదా? లేదా? ॥క॥

2. రామకృష్ణ హరీ! పాండురంగ! చిన్మయా ।
నామరూపరహిత! వేణు – నాదతన్మయా ।
శ్యామలకాయ! స్వామీ! నీ దయా!
నామదిలో నివసింపగ – నడచి రావయా! ॥క॥

3. దేవ! నిన్ను విశ్వసించి – ప్రేమించితినీ!
సేవించి సదా స్మరించి – భావించితినీ!
భావానందమే – బ్రహ్మానందమై
నీ విశ్వమునిండ సతము – నిలచిపోనీ! ॥క॥

# 23. శ్రీకృష్ణ హారతి

(వానకాదు వానకాదు అనుమాదిరి)

ప॥ రారా! వేగ చిన్నికృష్ణ! రావేమయ్యా!
రాధికమ్మ జతగా చేర – రారా! కృష్ణయ్యా! ॥రా॥

చ॥ మదశిఖండి పింఛకాంతులు – కదలాడగా
మధురమైన మురళీగానము – మారుమ్రోగగా ।
మదనకోటి సుందరాంగ! మంగళమో పాండురంగ!
కదలిరమ్ము పదములగజ్జలు – ఘల్లు ఘల్లు ఘల్లుమనగా!
॥రా॥

2 అందమైన బృందావనిలో – ఆటలాడుతున్నావా?
మందలోని భామల జేరి – మాటలాడుతున్నావా?
ఎందుకయ్య? యింతతడవు – డెందమందు కానరావు
వందనాలు గొనుమా– బ్రహ్మానందమందిర! నందనందన!
॥రా॥

3 పాలు పెరుగు దోచుకున్న–పరమాత్మ రా! రా!
పాదపాన వలువలుదాచిన – పరమపురుష రా! రా!
నీలమోహనాకారా! నీవే నాకు ప్రాణమురా!
రాలుగరుగ విశ్వము నిన్నే–రమ్ము రమ్ము–రమ్మనిపిలువ॥రా॥

# 24. శ్రీకృష్ణ హారతి

**(ఆకాశవీధిలో అందాలజాబిలి అనుమాదిరి)**

ప॥ బృందావనమ్ములో – అందాలదేవుడు

అ॥ మందలోనిగోవులగాచే – మారమోహనాంగుడు
మా పాండురంగడు! ॥బృం॥

చ॥ పెదవులపై మురళీగానము – వినిపించినాడు
పదములతో బంగరుమువ్వలు – పలికించినాడు
ముదముమీర గొల్లభామలను – మురిపించినాడు
ముక్తినొసగినాడు! ॥బృం॥

2. దేవకమ్మ ముద్దులకొడుకు – దేవాదిదేవుడు!
భావమందు తలచిన మొలిచే – పరవాసుదేవుడు!
జీవులపై దయగలవాడు – శ్రీకృష్ణచంద్రుడు!
చిదానందరూపుడు! ॥బృం॥

3. నెమ్మదిలో నమ్మినవారల – సొమ్మైయున్నాడు
కమ్మగ హరినామము సల్పిన – కరుణించువాడు
నెమ్మి విశ్వనాథుడొసంగిన – నీరాజనవత్సలుడు
నీలమేఘసుందరుడు! ॥బృం॥

# 25. శ్రీకృష్ణ హారతి

(ఝుమ్మంది నాదం అనుమాదిరి)

పII పలికిందిమురళి - రాగాల రవళి!

అII పలికించె శిఖిపించమౌళి - మన
పరమాత్మకదియే - నివాళి! IIపII

చII ప్రతిసారి పలుకున - శతకోటి గమకాలు
ప్రణవ సునాదమై - ప్రవహించ సుధల
తతులు తతులు వ్రజ - సతులు సతమతులు
నతినుతులొనరించగా - రాస - నాట్యము వికసించగా!
వ్రతముల పుణ్యాలు - ఫలియించగా! IIపII

2 అందాల రాధమ్మ - సౌందర్యచరణాల
అందెలసందడి లయగా!
అనురాగతంత్రులు - శృతిమీటగా!
అందరి హృదయాలు - స్పందించగా! IIపII

3 గిరిభారమెత్తిన - కరిరాజవరదుని
కరభూషణముగా - స్థిరముగవెలసి!
మరి మరి సోకిన - మధురాధరముల
మధురిమలే ప్రాణమై - శ్రీ - హరియొక్కడే ధ్యానమై
చిరువిశ్వనాథుని శివభావమై! IIపII

# 26. శ్రీకృష్ణ హారతి

**కళ్యాణి రాగం - జంపెతాళం**

ప॥ అందుకోవయ్యా – అందముగ నివ్వాళి ॥అందు॥

అ॥ ఇందిరా రమణ ! యో – నందసుత! వేగమే ॥అందు॥

చ॥ వెలలేని మాణిక్య – ములలోన దీపాలు
వెలిగించి ముమ్మారు – వేడ్కగా త్రిప్పెదము ॥అందు॥

2 మా పాపముల దృంచి –మా నాథ ! కరుణించి
మమ్ము నీ దరిజేర్చి – మనసార దీవించి ॥అందు॥

3 రంగుగా – శ్రీపాండురంగాశ్రమము నందు
రంగ! నే నీ ముందు – మంగళము బాడెదను ॥అందు॥



# 27. శ్రీకృష్ణ హారతి

(తనివితీరలేదే అనుమాదిరి)

ప॥ శరణుదేవదేవా! కృష్ణా! సరసమధురభావా! శృతి
సార! కొనుము - మంగళసేవ! ॥మాధవా! రా..ధాధవా॥

చ॥ అనయము నాలో నిలువుమని – వినయముతో నిను వేడితిని ।
జనులకు నీవే సకలమని - మనమున రూఢిగ తలచితిని ।
విను మొరన్ ప్రేమధుని - కనుము నన్ కరుణఖని ।
తనయులే భారమని - తలపకుము దయమాని! ॥శ॥

2. గోకులమందున చేరితివి - గో నవనీతము దోచితివి ।
గోవర్ధనగిరి నెత్తితివి - గోవిందుడవై వెలసితివి ।
గోవులను మేపితివి - గోపికల వలచితివి ।
జీవులను బ్రోచితివి - చింతలను బాపితివి! ॥శ॥

3. భావాలయమే నీ నెలవు - భావానందమె నీ విందు ।
భావబలమ్మే నీ బలము - భావలయమ్మే స్వరూపము ।
భావమందుదయించి - కావుమా- విశ్వమును ।
భావ సుమ శోభితము - స్వాంతమున నీపదము! ॥శ॥

# 28. శ్రీకృష్ణ హారతి

(గోకులకృష్ణ గోపాలకృష్ణ అనుమాదిరి)

ప॥ మురళీకృష్ణా! మోహనకృష్ణా! బిర బిర రావయ్యా!
మరువకు మమ్ముల – మదిలో నిండుగ ప్రేమను తేవయ్యా!

అ॥ విరిసిన కన్నులతో – సరసన చేరుమయా ।
చిరు చిరు నవ్వులతో – మొర విను కన్నయ్యా!
జయ! కృష్ణ!కృష్ణ! పాండురంగ! కృష్ణ! హరీ!! ॥ముర॥

చ॥ కణ కణమందున – కలవందురకటా?
కలనైన మమ్ముల – కనరావదేల?
మనమందు నిన్నే – మరువక తలచే
తనయులపై సుంత – దయజూపవేల?
క్షణమొకయుగమై నిల్చెరా! కరుణాసాగరా!
తనువే బరువై తోచెరా! తాలిమి (తాపాలు) సైపరా!
చనువున దరిజేరి (నీ) చరణములంటెదరా!
ప్రణతులు చేకొనరా (శ్రీ) రాధాసుందరా!
జయ! కృష్ణ! కృష్ణ! పాండురంగ! కృష్ణ! హరీ!! ॥ముర॥

3. కరిరాజవరదా! కనుపించరాదా?

శరణాగతత్రాణ - బిరుదేదిరా!

హరి! వేదసారా! యమునావిహారా!

మురహర! మాయల - ముంచకురా!

నిరుపమ శ్యామలసుందరా! నీవే దిక్కురా!

సరగున విశ్వమునేలురా! స్వామీ! సాదరా!

అరమర సేయకురా! హారతి గైకొనరా!

గిరిధర గోపాల! వరమయకాసారా!

జయ! కృష్ణ!కృష్ణ! పాండురంగ! కృష్ణ! హరీ!! ॥మురః॥



# 29. శ్రీకృష్ణ హారతి

**శివరంజని రాగం - ఆదితాళం**

ప॥ రావా? గోపబాలా! మము - గావా గోపబాల! ॥రా॥

అ॥ నివాళులన్ గొనుమా - జాలమేలా! ॥రా॥

చ॥ దీనావనుడవని వేడితి - దిక్కు నీవని నమ్మితి
మా నాథ! వేగమే మమ్మాదుకొనగా ॥రా॥

2 కనులవెంబడి - నీరముల్ - కాల్వలాయె నపారముల్ ।
కఠినమేలా? రాధాలోలా! ॥రా॥

3 హీనుడని నన్నిలలో - దయ బూనవో నీమదిలో
అనుమానమా-విశ్వములో హాయిగా విహరింప కృపతో
॥రా॥



# ౩౦. శ్రీకృష్ణ హారతి

**(నినుజూచిన నా నయనాలు - అనుమూదిరి)**

ప॥ పరిపాలయమాం - గిరిధారిన్ ॥ప॥

అ॥ ప్రవిమల రాధా - భావవిహారిన్ - కృష్ణా! ॥ప॥

చ॥ సంసార మహా - సాగర పతితం
విషయవాసనా - పాశైర్నిబద్ధమ్ ।
అగతిం దీనం - ఆర్తమనాథం
కృత్వా పటుతర - మాయావిముక్తమ్ ॥ కృష్ణా! ॥ప॥

2 వసతు సదా హృదయే తవ రూపం
జపతు ముదా రసనా - హరి మంత్రమ్ ।
లసతు మనసి తావక భక్తి రనిశం
దయయా దత్వా - దర్శనభాగ్యమ్ ॥ కృష్ణా! ॥ప॥

3 మురళీ భూషణ - కరుణా భరణ
సురనుత మృదుచరణ ।
శరణాగతజన పరిపాలనచణ
వరద! విశ్వమయ మంగళకారణ ॥ కృష్ణా! ॥ప॥

# 31. శ్రీకృష్ణహారతి

**ఆనందభైరవి రాగం - జుల్వ తాళం**

**(పలుకే బంగారమాయెనా - అనుమాదిరి)**

ప॥ వినుమా నివ్వాళి పాటలా ! – శ్రీపాండురంగ !
కని మంగళ – దీపకాంతుల ॥వి॥

చ॥ వినయమ్మున కేలుమోడ్చి – నిను వేడెద – కొనియాడెద
మనమందు వసించి – సేవగొనుమా! ననుగన్నతండ్రి ॥వి॥

2 పరమశివుడే – మురళిగ – నీ కరయుగమున జేరి – మధుర
దరహాసపు – మోవిసోకి మురిపముతో పరవశించ ॥వి॥

3 ఆ సికతాతలమున – వ్రజవాసినులరుదెంచి – కొలువ
రాసకళారాధనకై – రాధికతో కొలువుదీరి ॥వి॥

4 నీల మోహనాంగ! ప్రేమ జాలువార – నీ విశ్వము
నేలుమయ్య! భవ్య సుగుణజాల ! కృష్ణ ! శైలభార ॥వి॥



# ౩౨. శ్రీరాధా కృష్ణ హారతి

**కానడ రాగం - ఆదితాళం**

**(దునియాకే రఖువాలె - అనుమాదిరి)**

ప॥ మరచితివా – గోపాలా! నను – మరచుట దగునా బాలా!
యిక – మరువకు – రాధాలోలా ॥మర॥

చ॥ దారిలేని సంసార వనమ్మున –
దూరితి నిన్నెడబాసి
దారసుతులె గతియని మోహమ్మున
దవిలియుంటి కనుమూసి – హా
ఘోర పాపములు జేసి – ఓ –
కారుణ్యామృత ఘనజలరాశి
భారమిదో కొనరావే – నా
భారమిదో కొనరావే
నా భారమిదో కొనరావే । ॥మర॥

2. నీ ముఖ చంద్రోదయము గోరుచున్
నిలిచె నయన కుముదమ్ముల్
నీ మంజుల రూపాదిత్యునకై
నిరీక్షించె హృదయమ్ము
సుమ – కోమలాంగ జాగేలా? నీ
ప్రేమను నాలో నించి బ్రోవవే
శ్యామల ! మురళీలోలా! ॥మర॥

3. అమ్మా రాధా - నీవైనను - శ్రీ
హరికి దెల్పు నా మొరలా
సమ్మతించు నమ్మా! నీ మాటలు
సర్వజ్ఞుడు వేయేల ? మా
యమ్మా! మ్రొక్కెద సుమ్మా - నా
కిమ్మహి మీ కన్నను వేరెవరే
యేలిన - మాలిన మీరే ॥మర॥

4. పావనమౌ నీ - పద నీరజములే
భావింతును యే పూట
కేవల రాధాకృష్ణ నామ - సం
కీర్తన బాడెద నోట - ఈ
భవసాగరమును దాట - ఓ
గోవర్ధన ధర ! హారతిగా - చే
కొను మీ విశ్వము పాట ॥మర॥



# 33. శ్రీకృష్ణ హారతి

**భాగేశ్వరి రాగం - రూపక తాళం**

**(అలిగితివా సఖి ప్రియా - అనుమాదిరి)**

ప॥ కలయహరే ! దయానిధే ! కలిత మంగళమ్ ॥క॥

అ॥ విలసతు మమ హృదయే తవ – లలిత పదయుగమ్ ॥క॥

చ॥ భావయామి – నిరంతరం – దేవ దేవ! త్వాం విభో!
భావానంద – రాధాకృష్ణ ! పతిత పావనా! ॥క॥

2 రామకృష్ణ హరిహరాది – నామ రూప చిన్మయ !
శ్యామలాంగ ! పాండురంగ ! సకల శుభకరా! ॥క॥

3 జలజనయన ! హే గోలోక (త్రిగుళ్ళ) నిలయ !
నీలమోహనా!
కలిమల హర ! విశ్వనాథ కలుషమోచనా! ॥క॥



# 34. గోపాల హారతి

**కాఫీరాగం - ఆటతాళం**

ప॥ నీరాజనము గొనుమా - గోపాలా !
నిత్యానంద సుధామా ! శుభ ॥నీ॥

చ॥ నీ ముఖ చంద్ర చకోరిక రాధిక
నీతో జేరి వెలుంగగా
శ్యామసుందరా ! నా మదిలోగల
ప్రేమను గనుగొనుమా ! గోపాలా ! నిత్య - శుభ ॥నీ॥

**- సాకి -**

ఓ శరణాగత వత్సలా ! కరుణామృత రసాలవాలా !
స్మరణానుకూల! నామమణిమాలా! గోపీలోలా! ॥నీ॥

**3**

శేష శయన - నీ దాసుల దాసుని
జేసి విశ్వమును దయగనుమా
రోసము జూపన్ - న్యాయమా ? భవ
రోగిని చేకొమ్మా - గోపాలా ! నిత్య - శుభ ॥నీ॥

# 35. శ్రీకృష్ణ హారతి

(చల్లనిరాజా ఓ చందమామా - అనుమాదిరి)

పll నల్లనివాడా ! రేపల్లెరేడా ! మ
న్ననతోడ నీరాజనము గొమ్ము వేడ – రేపల్లెరేడా! llనll

చll హృదయమ్మున నీరూపు ధ్యానింతురా !
యదువర ! వేణుధర ! ధీర ! రాధావరా !
పదములవీడరా – మదిదయజూడరా । నీ
వెన్నెల చిన్నెల జూపించురా – ఓ llనll

2. నినుబాసిన నిముసములను దూరితి ।
ఘన గోలోకమున జేర్చుమనివేడితి ।
పనులను మానితి – నిను గనగోరితి ।
నీకన్నను సున్నగదా మాగతి । ఓ llనll

3. పరిపాలిత శ్రీపాండురంగాశ్రమా !
పరిపరి నిన్ను బిలచుట యపరాధమా?
మొరవిన భారమా? శరణన చేరుమా ?
నా కన్నులకైనను కాన్పింపుమా – ఓ llనll

# 36. శ్రీకృష్ణ హారతి

**(కురిసిందివాన - అనుమాదిరి)**

ప॥ గోపాలదేవ! కాపాడరావ! గోవింద! రాధాధవా! ॥గో॥

అ॥ కరుణాంతరంగ! హరి! పాండురంగ! ॥గో॥

1 చల్లని చూపుల - యుల్లముదోచే - నల్లని నా స్వామీ!
యెల్లవేళల - చల్లగ మముల - యేలుము ఖగగామీ!
సౌందర్య లహరీ! బృందా విహారీ! ॥గో॥

2 వెన్నదొంగ! నీ - వన్నెచిన్నెలను - యెన్నడు జూతునురా?
కన్నయ్యా! నా కన్నులు నీకై - కాయలు గాసెనురా
పరమాత్మ! మురళీ - ధర పింఛ మౌళీ! ॥గో॥

3 విశ్వనాథుని - విమల మనమున
వెలుగుము వనమాలీ!
వేడుకతో - నీ - వినుతిని చేకొని
విడకు దయా శాలీ!
మధుసూదనా! నీ కిదియె నివాళీ ॥గో॥

# 37. శ్రీకృష్ణ హారతి

**కాంభోజి రాగం - చాపుతాళం**

ప॥ హారతిన్ గొనుమో శుభాకారా ! వర మేరు ధీర !
క్షీరసాగర శయన ! గంభీర ॥హార॥

1 ఓ రమావర ! మార సుకుమారా ! శరణాగత ప్రియ !
కోరితిని నీ చరణములజేర
ఘోరభయ సంహార ! భవకాంతారభేదకుఠార ! యమునా
తీరకుంజ విహార ! కరుణాపూర హృదయ ! చేర రారా!
॥హార॥

2 నీల సుందర యేల జాగేల ? సచ్ఛీల ! మురళీ
లోల ! రాధాలోల ! గోపాల !
బాల! నా కొల బాపవేల? దయాలవాల ! తమాల నీల ! సు
చేల ! నీదు పదాలే గతియని పాలబడితిని చాల కృపతో
॥హార॥

3 వందనము ఘన సుందరాకార ! రాకేందు ముఖ ! గో
విందా ! భక్తానంద మందార !
అందముగ విశ్వేశు భావానంద మందిరమందు బ్రహ్మా
నందముగ వెల్గొందు గోపీ బృందవందిత ! నందనందన!
॥హార॥

# 38. శ్రీకృష్ణ హారతి

**అఠాణా రాగం - ఆదితాళం**

**(మదనాసుందరనాదొర - అనుమాదిరి)**

ప॥ మురళీమోహన ! మాధవ ! ఓ
కరుణాభూషణ ! పాపహరణ ! పూజితచరణ ॥మురః॥

అ॥ రాధాభావవిహారి ! రసరూప ! హరి ! శౌరి !
రావయ్య మము జేరి - రంజిల్లు గిరిధారి ! ॥మురః॥

చ॥ అతిహీనుడను - నీవెగతి - శ్రీభావానంద
యతిరూపమున నిన్ను - సతతమ్ము నుతియింతు ॥మురః॥

2 సతితో శ్రీమద్భాగవతమందు వ్యాపించి -
ప్రతిచోట భాసించు - శృతిసార ! నతపాల! ॥మురః॥

3 పరమేశ ! గోలోక (వెలదండ) పురవాస ! విశ్వేశ
వరదా ! మంగళగీతి ! కరిపాల! వినుప్రీతి ॥మురః॥



# 39. శ్రీకృష్ణ హారతి

**కానడ రాగం - ఆదితాళం**

**(నమోభూతనాథ - అనుమాదిరి)**

ప॥ నమో గోపబాల ! నమో చారుశీలా !
నమో భక్తపాల ! నమో రాసలోల !

అ॥ నమో రుక్మిణీవల్లభ ! పాండురంగ ! ॥నమో ॥

1. చిదానందరూప ! హృదంభోజదీప !
పదోత్పూతగంగ ! పరబ్రహ్మలింగ!
సదా మంగళం – భవతు తే – సర్వరూప! ॥నమో॥

2. పరంధామ రాజ ! ప్రభో నీలతేజ !
హరే ! దీనబంధో ! దయాపూర్ణసింధో !
చిరం తే పదం – మానసే – చింతయామి ॥నమో॥

3. నిరాకార ! పావన ! స్థిరాద్వైతచిద్ఘన !
పరాభక్త్యధీన ! వంశీప్రవీణ !
కరీంద్రావన ! గోపికా బృందమోహన ! ॥నమో॥

4. లసత్పాండు రంగా శ్రమ క్షేత్రవాస !
రసాకారభాస ! రాధావిలాస !
ప్రసీద ప్రభో ! విశ్వనాథార్తినాశ ! ॥నమో॥

# 40. శ్రీకృష్ణ హారతి

**తోడి రాగం - ఆదితాళం**

**(నడిరేయి ఏ జాములో - అనుమాదిరి)**

ప॥ గోపాల ! దయసేయుమా ! కృష్ణ !
గోలోక పదరాజ ! మా – మంగళ దీపావళిన్ – గాంచుమా

1 గోలోల ! గోవింద ! గోపీహృదయలోల !
మాలోని – నేరాలు – మన్నించవేల ?
పాలించ రావేల ? లాలించి మముల –
పరమాత్మ ! పరిపూర్ణ – కరుణాలవాల ! ॥గో॥

2 యెన్నెన్నో జన్మాలు – యెత్తంగలేను –
యేనాడు – నినుజేరి – సుఖియించగలను ।
అన్నింట నిను దక్క – అన్యంబు – గనను – నేను
అభయమ్ము – నిడకున్న – హరి ! నిన్నువిడను ॥దేవా॥
కన్నయ్య ! నినుజూడ – గా లేన – స్వామీ !
కనులార ! దయతోడ – కనుపింపవేమి?
కనకున్న – నేనింక – మనలేను – సుమ్మీ ॥గో॥

3 కమలాక్ష ! విశ్వేశు – కాపాడరావా ?
సమయమ్మిదే – సర్వసమ ! ప్రేమభావ !
రమణీయ – శ్రీపాండురంగాశ్రమాన ॥రంగ॥
రాజిల్లు – శ్రీరుక్మిణీ ప్రాణలోల !
సమముగ– రాధమ్మ – సాయమ్ముతోడ –
సతతము – నా మానసములోన నిండ ॥గో॥

# 41. శ్రీకృష్ణ హారతి

## ఐచ్ఛికము

## హిందుస్థాన్ భైరవి రాగం - జుల్వతాళం

ప॥ వేణుగాన లోలుడు - వేంచేసియున్నాడు
మనలోన హాయిగా - కనుడీ మంగళమిడి ॥వేణు॥

అ॥ గోపాలకృష్ణుడు ! - గోలోక నిలయుడు !
శ్రీపాండురంగడు ! - శ్రీ రాధామాధవుడు ! ॥వేణు॥

చ॥ కన్నులతో చాలినంత - కరుణ గురియుచున్నాడు
వెన్న మీగడలు చనువున - ప్రేతలొసగ దిన్నాడు
అన్నియు తానై అంతట - అలరి వెలుగుచున్నాడు
కన్నులార క్షణమైనా - కనుడీ మంగళమిడి ॥వేణు॥

2 వరదా భయకరముల - మురళి మ్రోగ మధురిమల
సిరి పింఛము ముంగురుల - మురిపించగ మనముల
చిరినవ్వుల వెన్నెల - మరువజేయ తనువుల
కరిపాలుని - కళకళల - కనుడీ మంగళమిడి ॥వేణు॥

3 స్థిరముగాదు జీవితము - పరమాత్ముడె సత్యము
హరినామ సుధారసము - నరులకు తారకము
నిరతము దేవునిపై మది - నిల్పుటె పరమార్థము
కరము విశ్వనాథ విభుని - కనుడీ మంగళమిడి ॥వేణు॥

4 నల్లనయ్య! ప్రతిపదమున - నన్ను గాంచుచున్నాడు
చల్లని ప్రేమామృతమ్ము - జల్లి మనల గాపాడు
ఎల్లజగాలకు దేవుడు - అల్లరి గోపాలుడు
కల్లగావు నా మాటలు - కనుడీ మంగళమిడి ॥వేణు॥

# 42. శ్రీకృష్ణ హారతి

**(దరికి రాబోకు రాబోకు రాజా! - అనుమాదిరి)**

ప॥ కొనుము నివ్వాళి - గోలోక - రాజా ! ॥కొను॥

అ॥ ఓ శ్యామతేజా ! ప్రేమనైజా ॥కొను॥

చ॥ వినుమా - మొరలా - వేడుక దీర -

కనుమా - మమ్ముల - కాంచనచేల!

వేదాధారా! భేదవిదూరా!

బృందావిహారీ ! నందనందనా ! ॥కొను॥

2 భావానందా ! బాలముకుందా !

దేవా! విశ్వనాథు - బ్రోవగలేవా !

రావా ! స్వామి ! భావగృహాన (రామవరాన)

సేవింతుమయ్యా ! శ్రీమాధవా! ॥కొను॥



# 43. శ్రీకృష్ణ హారతి

**ఐచ్ఛికము - జేజేవంతి రాగం - అటతాళం**


ప॥ ఎందుకు దయరాదు నీకు - నందనందనా! ॥ఎం॥

అ॥ సుందరాంగ! హారతిదిగో - చూడు ముదమునా ॥ఎం॥

చ॥ డెందమందు నీ పదార - విందములను ప్రేమమీర
పొందుపరచి కన్నులార - కందు సతము - కాంక్షదీర

2 అలుకా? గోపాల దేవ ! పలుక వేమి? నేను బిలువ
కలుష రహిత - హృదయ కమల - నిలయ!
నీలమోహనా! ॥ఎం॥

3 లాలనమ్ము పాలనమ్ము - శీలనమ్ము నీదేరా
జాలమేల? విశ్వనాథ - పాల! రాధికావరా! ॥ఎం॥



# 44. శ్రీకృష్ణ హారతి

**శివరంజని రాగం - త్రిపుటతాళం**

ప॥ మాధవా! హరి ! గోవర్ధన ధర!
మంగళం - తవ - భవతు - మంజుల మురళీధర!

అ॥ రాధికాప్రియ! బృందావన చర!
రాసకేళి కళా - రాధక ! - నటశేఖర! ॥మాధవా॥


**చ॥ శ్రీధర! కౌస్తుభ మణి ధరణ!**
**చిదానంద! పావన చరణ!**
**సాధక సంసృతి భయ హరణ!**
**సరస మధుర భాషణ! యదు - భూషణ! ॥మాధవా॥**

2 చికుర విలసిత - పింఛలాంఛిత
మకుటయుత - సుందర ముఖాంబుజ
సకల నిగమ పురాణ నిగదిత
సార రూప సునీల తేజ! ॥మాధవా॥

**చ॥ ప్రకటిత నిజ - మాయాజాలా!**
**భక్తపరాధీన! సుచేల!**
**శుక ముఖ నుత ! గోపరిపాలా!**
**శుభదాయక! గోపీజన లోలా! ॥మాధవా॥**

3 దేవ! తవ మృదుచరణ నీరజ
సేవకం-విశ్వేశ నామకమ్
తావకం-పరిపాలయ-ప్రభో!
భావుకం-నిర్వ్యాజ కృపయా! ॥మాధవా॥

**మి॥ భావానురూప ఫలప్రద !**
**భవ్య భావమయ (రామవర) శుభ మందిర !**
**భావభక్తిసులభ ! పరాత్పర !**
**పాండురంగ ! రుక్మిణీ మనోహర ! ॥మాధవా॥**



## 45. అనంతపద్మనాభస్వామి హారతి

**భాగేశ్వరిరాగం - రూపకతాళం - చతురశ్రజాతి**

**(అలిగితివా సఖీ ప్రియా - అనుమాదిరి)**

ప॥ పరసుఖదా! శ్రీఅనంత - పద్మనాభ! మంగళమ్!
వరదాయక! వాసుదేవ! వారిజాక్ష! వందనమ్ ॥ప॥

చ॥ ఘోరమైన - భవాటవిన్ -దారితెలియ - లేమయా ।
యేరీతిగ - యేలెదవో - యాదీనుల - నీ దయ ॥ప॥

2 నీవే - నాకు దైవమని - నీ స్మరణమే పావనమని ।
భావించితి - త్రికరణముల - భక్తితోడ - మాధవా ॥ప॥

3 పదునాలుగు-సంఖ్యలతో-పరికరముల-గూర్చి-నిన్ను-
ముదమారగ పూజించిన - ముక్తి - సిద్ధఫలమురా ॥ప॥

4 పద్మసరోభాసమాన! వర సప్తఫణాకృతీ!
పాండురంగ! విశ్వనాథ - వత్సలా! దయామయా ॥ప॥



# 46. శ్రీకృష్ణ హారతి

**మోహన రాగం - ఆదితాళం**

**(తిరుమల మందిర సుందరా - అనుమాదిరి)**

ప॥ రసమయ! శ్యామల సుందరా!
రసభర మురళీ - రవకరా! ॥రస॥

అ॥ శ్రీరాధా - మానస మందిరా!
నీరాజన సేవ - యిదో - దొరా! ॥రస॥

చ॥ అందమలర మా - యంతరంగములు
బృందావనమై - వెలుగగా
అందలి - భావానంద వీచికల
చిందులు యమునా - సరితగా
నందతనయ! నీ - సుందర పదములు
నాలో నిడుమా - నందముగా ॥రస॥

2 విశ్వనాథుని - ప్రేమామృతమును
వేడుకతో చవి - చూడుమయా
శాశ్వతముగ మా - సాధుజనులపై (మా-సాయిపేటలో)
చల్లని కృప వెద - జల్లుమయా
విశ్వమంత నీ - వేణుగానమే
వినబడ మోహన ! రాగమయా ॥రస॥

# 47. శ్రీకృష్ణ హారతి

**కాఫి రాగం - ఆదితాళం**

**(పిలచిన బిగువటరా - అనుమాదిరి)**

ప॥ పిలచితి - రావయ్యా ! కృష్ణయ్యా ! ॥పిల॥

అ॥ అలుగకుమా ! మంగళమిడి నిను నే ॥పిల॥

సా॥ రాధా ........ నాథా ............!

చ॥ నీవే గతియని - నిన్నే - నమ్మితి
సేవ నొసగ వేం - చేయుము - మరి మరి ॥పిల॥

2 నా మదిలో ఘన శ్యామానందము
ప్రేమోన్మాదము - పెంపున బొరలుచు
నామామృతమై - నాలుక వెంబడి
రామ - కృష్ణ - హరి నామము వెలువడ ॥పిల॥

3 పిల్లన గ్రోవిని - మెల్లన నూదుచు
నల్లని స్వామీ ! (నల్లగుట్టలో) - నాట్యము సల్పుము
అల్లన విశ్వేశు - యుల్లమునందున
చల్లని నీ కృప - జల్లులు గురియగ ॥పిల॥

# 48. శ్రీకృష్ణ హారతి

**తిలక్ కామోద్ రాగం - రూపకతాళం**

**(వేణుగాన లోలునిగన - అనుమాదిరి)**

ప॥ ఆలపించుమా మురళిని - హారతిగొని - మాధవా ! ॥ఆ॥

అ॥ అఖిలలోక జీవనమై - అమృతము ప్రవహించగా ॥ఆ॥

చ॥ యెన్నినాళ్ళు యెదిరి చూతు - నిన్నుగాంచు కోరికతో
కన్నతండ్రి ! నాకు నీవు - కలవను పేరాసతో
వెన్నవంటి నీమది - మొర - విన్న కరుగదా ? దయతో
విమల చరిత ! కమలనయన ! సుమధుర నవరాగముతో
॥ఆల॥

2 అలకలతో నెమలి కన్ను - అటునిటు కదలాడగా
వలచి కొలుచు - గోపికలకు - పులకలు చిగురించగా
లలిత నాట్య భంగిమలో - రాధికమ్మ నిలువగా
సలలితముగ రాసకేళి - సలుప పిలచు-పిలుపనగా ॥ఆ॥

3 కణకణమున - వరదుడవై - కలవు విశ్వమందున
గరుడ గమన ! సంతసమున - నిరతము రాధా మోహన
కనుమరుగున నుండనేల ? కదలిరమ్ము ప్రేమఘన !
మనమలరగ - సవినయముగ (మలకపేట) జనము గనగ-
కనికరమున ॥ఆ॥

## 49. శ్రీకృష్ణ హారతి

**తిలక్ కామోద్ రాగం - ఆదితాళం**

**(అలిగినవేళనే చూడాలి - అనుమాదిరి)**

ప॥ మురళీ మోహన! కృష్ణయ్యా! ॥ము॥
మురదమున హారతి – గొనుమయ్యా ॥ము॥

అ॥ పరమదయాకర! నీవేగతియని –
చరణములంటితి కన్నయ్యా! ॥ము॥

చ॥ కరివరదుడవై – పరువిడలేదా?
కురుసభ ద్రౌపతి – మొర వినలేదా?
సరగున మము గను – తరుణము రాదా?
హరి! హరి! మాపై – కరుణ గలుగదా? ॥ము॥

2 రాముడ వీవే – రంగడ వీవే
స్వామీ! శివుడవు – సకలము నీవే
యేమర బోకుము – విశ్వేశుని
శ్యామల! పాండురంగాశ్రమ మందిర ॥ము॥
(శ్యామల రూప! కు – శాయిపురాలయ) ॥ము॥

# 50. శ్రీ రాధాకృష్ణ హారతి

**మోహనరాగం - జుల్వతాళం**

**(వెవేలగోపెమ్మల మువ్వగోపాలుడె - అనుమాదిరి)**

ప॥ రా!రా! కృష్ణా! రాధాకృష్ణా!
చేరా - రావయ్యా! మా - చెంతకు రావయ్యా ॥రారా॥

అ॥ కూరిమి దీర - ధరాధర! కర్పూర -
హారతి - గనుమయ్యా! మా - భారము నీదయ్యా!
॥గిరిధర॥ రారా ॥

చ॥ సిరిసిరి మువ్వలతో - సరి సరి నడకలతో -
చారడేసి కన్నులతో - వోరవోరచూపులతో
మారులేని వేణువూదె - మారమోహనాకృతితో
సారమైచిన్మయమౌ - చారు నీలకాంతులతో
సిరి పింఛపు తళుకు లొలుకు - కురుల కుటిల నటనలతో
చేరా - రావయ్యా!
మా - చెంతకు రావయ్యా ॥గిరిధర॥ రారా ॥

2 గోలోకధాముడవై - గోకులాన వెలసితివి
గోవులను గాచితివీ - జీవులను బ్రోచితివి
గోలచేసి గోపికల - పాలువెన్న దోచితివి
గోవర్ధనగిరిని జేరి - గోవిందుడవైతివి!
గోపాలసుందరా! కోపమేలరా! బిరబిర
చేరా - రావయ్యా!
మా - చెంతకు రావయ్యా ॥గిరిధర॥ రారా ॥

3 పాండురంగ! హరి!విఠలా! పాహి రుక్మిణీవరా!
పంఢరిపురేశ్వరా! పరమదయాసాగరా!
పుండరీక హితకరా! మురహర! మురళీధరా!
నిండు మనసు నీదిరా! నీవెమాకు దిక్కురా!
కొండంత కరుణ తోడ - కొనుము విశ్వనాథు మొరల
చేరా - రావయ్యా!
మా - చెంతకు రావయ్యా ॥గిరిధర॥ రారా ॥



# 51. శ్రీకృష్ణ హారతి

**మాల్కోస్ రాగం - ఆదితాళం**

**(పిలువకురా - అనుమాదిరి)**

ప॥ కరి వరదా ! కలవు సదా !
కరుణతో హారతి – గనరాదా ?
హరి ! హరి ! నా మొర – వినరాదా ? ॥కరి॥

చ॥ శిరమున పింఛపు – సరము వెలుగగా
కరముల వేణువు – కమ్మగ మ్రోగ
సరసన రాధా – సతి భాసిలగా
మురహర ! నీ రూపము – పూజింతుము వేగ ॥కరి॥

2 పరగోలోక (మరుకూకు) పుర మందారా !
నిరుపమ సుందర ! నిఖిలాధారా !
గరుడ గమన ! శ్రీ – ధర ! శృతిసారా !
మరువకు విశ్వేశుని – మన్నించు ముదారా ! ॥కరి॥

# 52. శ్రీకృష్ణ హారతి

**కానడరాగం - త్రిపుటతాళం**

**(దారి చూపిన దేవతా - అనుమాదిరి)**

ప॥ కదలిరా హరి ! నిండుగా నా - మదికికాంతులు నిండగా ॥క॥

అ॥ వదల - నీదుపదమ్ముల కను - ము దయ - హారతి వెలుగులా ॥క॥

చ॥ దేహమనియెడు - దేవళమ్మున - దివ్య హృన్నీరజమున
శ్రీహరీ! మురళీ మనోహర! చిన్మయా! వేం - చేయుమా
మోహబంధము వీడగా కడు - ముదముతో సేవించెదా ॥క॥

2. కణకణమ్మున - కలవుకద! నా - మనవియే వినిపించదా?
కనులనీరు - చూచి నీమది - కరుగదా? కృపగలుగదా?
తనుధనమ్ములతోడ నీకై - మనసు కానుక - చేసెదా ॥క॥

3. నేల నింగి - నిప్పు నీరు - గాలితో నిర్మించినా
తోలుబొమ్మల - పాత్రపోషణ - చాలు విశ్వమునేలుమా!
నీలసుందర! రాధికాగో(భాగ్యనగరీ) పాల! శుభకర! గిరిధరా! ॥క॥

# 53. శ్రీకృష్ణ హారతి

**మోహనరాగం- ఆదితాళం**

**(నవ్వవే నా చెలి - అనుమాదిరి)**

ప॥ గిరిధరా ! మాధవా! ॥గిరి॥

అ॥ అరయుము దేవా! మంగళరూపసేవ
సరగున దయతోడ సర్వేశ్వరా ! ॥గిరి॥

చ॥ పరమాత్మ! గోలోక – పురమందిరా!
పరిపూర్ణతమ! చక్ర – కర! భాసురా!
మురళీధరా! శ్యా–మల సుందరా!
రారా! బ్రహ్మానంద – రససాగరా ! ॥గిరి॥

2 కాపాడుమా – దీన చింతామణీ!
మాపాలి గోపాల – చూడామణీ!
చూపించు నీ – దివ్య – బృందావనీ!
ఆపన్న జనశీల – రక్షామణీ! ॥గిరి॥

3 శ్రీ పాండురంగ ప్ర–భూ! పావనా!
శ్రీపాద! సమ్మోద! శిఖిలోచనా!
గోపీధనా! ప్రేమ – దీపా! ఘనా!
గోవింద ! విశ్వేశ – కృతవందనా ॥గిరి॥

# 54. శ్రీకృష్ణ హారతి

**భీంప్లాస్ రాగం - ఆదితాళం**

**(శుభమంగళమే రమే - అనువాదిరి)**

ప॥ కొను మంగళమో హరీ ! ॥కొ॥

అ॥ కనలేమిల నీ సరీ ॥కొ॥

చ॥ వినతా సుత వాహనా! వనితా మనో మోహనా!
ఘన తాపస పాలనా! జనతాప-నివారణా ! ॥కొ॥

2 కరుణా-వరుణాలయా! కరుణించుము చిన్మయా!
మురళీధర! రావయా! శరణంటిని-నీదయా ॥కొ॥

3. నవ నీరద భాసురా! నవనీత పరాదరా!
నవ సప్తక -వత్సరా! నతపాలన తత్పరా ! ॥కొ॥

4. మురసూదన! సంసృతిన్-దరిగోరెడు విశ్వమున్
పరికింపుము-దీనుడన్-మరుకూకు-పురావనిన్ ॥కొ॥

# 55. శ్రీకృష్ణ హారతి

**భీంప్లాస్‌రాగం - ఆదితాళం**

**(నీలి మేఘాలలో - అనుమాదిరి)**

పు॥ అంతరంగాలలో –అలరారు – పాండురంగా!
ఆరార్తికమ్ము గొనుమా – ఆనందవారిధి పొంగా ॥అం॥

చ॥ కనులార యెన్నడైనా – నినుగాంతునా? లేదా?
కన్నయ్య! యీనాడైనా – ననుజూడ రా – రాదా? ॥అం॥

2. సంసార – జలనిధిలోన – సాగు – మా – జీవననౌకా
సర్వేశ ! నీ చరణాలా – సన్నిధికి – జేర్చుకొనుమా ॥అం॥

3. నీ మురళి పాటవినగా – నీ దివ్యతేజము – గనగా!
నీవే – నేనై – వెలుగ – దేవ! కరుణించుమ – వేగా ॥అం॥

4. ప్రతియణువులోన నీవే – భాసిలుము విశ్వమునిండ!
పరమాత్మ! హరి! గోవిందా! పాలించు బాలముకుంద! ॥అం॥

(వరమలకపేట)

# 56. శ్రీకృష్ణ హారతి

**భీంప్లాస్ రాగం - ఆదితాళం**

**(నరవరా! ఓ కురువరా! - అనుమాదిరి)**

ప॥ మురహరా! ఓ! గిరిధరా ! ॥ము॥

అ॥ హారతి సేవలను - చేకొని - వరదుడవై - కరుణగని

వెరపార - సిరులూర -వెలుగుమురా ॥ఓ-ము॥

చ॥ మురళిని - ధరియించి - కరానా

సురముని - వినుతించ - బిరానా

రారా! రాధా మోహన! శౌరీ! రాసవిహారీ!

సురవర! శ్రీధర! సుందర చరణా! శరణు గోపరమణా !

॥ఓ-ము॥

2. మనమున - అలరారుము - స్వామీ!

మనవిని - వినుమా ఖగగామీ!

మారులేని - దేవుడవన్న! మనసే వెన్న

అనయము - కణ కణ - మున గల-వుగదా! కనికరించవేమీ?

॥ఓ-ము॥

3. కలువల - నిరసించే - కనులు

చెలువల - అలరించు - కరాలు

నీలకాంతులు - నీ ముంగురులు - నీ అందాలు

సలలిత - పదములు - కలిమల -హారములు

కొలుతు - విశ్వవినుతా ॥ఓ-ము॥

సలలిత భాగవతాలయ! నిరతము

కొలుతు - విశ్వవినుతా ॥ఓ-ము॥

# 57. శ్రీకృష్ణ హారతి

**కాంభోజ రాగం - ఆదితాళం**

ప॥ మదన - జనక! హరి - మంగళ - మిదెరా ॥మ॥

అ॥ సదమల హృదయా! ముదమున - గొనరా ॥మ॥

చ॥ భృంగ చికుర! మా - తంగ గమన! జగన్
మంగళకర! శ్రీ - రంగ! దయామయ! ॥మ॥

2. వాయు తనూజుడు - వైన తేయుడును
పాయక - ముందర - ప్రస్తుతించగను
తోయజదళనయనా! శ్రీరుక్మిణి
తోడనలర - యీనాడే - దయనుగని ॥మ॥

3. పాండురంగాశ్రమ - పాలన శీలా!
పాహి - విశ్వవినుత - వరగుణజాలా!
పుండరీక వరదా! శ్రితలోల!
పురుషోత్తమ! జయ - కరుణాలవాలా ! ॥మ॥



# 58. శ్రీకృష్ణ హారతి

**కళ్యాణి రాగం - ఆదితాళం**

**(విన్నవించుకోనా చిన్నకోరిక - అనుమాదిరి)**


ప॥ నీల తేజ! రాధా - లోల! మంగళమ్ ॥నీ॥

అ॥ నీ నామ - సంస్మరణే - నిత్య మంగళమ్ ॥నీ॥

చ॥ ఏమని - వినిపింతునో - ప్రభు! నా మనోగత వేదన
స్వామివే - ఖగగామివే - నీ సన్నిధిన్ - కృపాళూ! ॥నీ॥

2. మురళియే - వినిపించిన - సిరి - మువ్వలే - రవళించిన
పరుగున - హరి! సరగున - నీ - పదములందుకోనా॥నీ॥

3. ఇమ్మహి - నా నెమ్మదిన్ (తిమ్మాపురిన్)మో - దమ్ముగా
విలసిల్లు నిన్
నమ్మిన - విశ్వేశుని - సర్వమ్ము నీవె కృష్ణా! ॥నీ॥



## 59. శ్రీకృష్ణ హారతి


**ఆదితాళం - (యాదారహీహై - అనుమాదిరి)**

ప॥ శ్రీ పాండురంగా! తుల - సీ భూషితాంగా! ॥శ్రీ॥

అ॥ శ్రీసదపాంగ! శ్రితజన సంగ! ప్రేమాంతరంగ! ॥శ్రీ॥

చ॥ మంగళమయ్యా- కృష్ణమురారీ! మా జీవిత పరమావధీ!
చెంగట రాధా - సతి భాసిలగా - చేకొనుమయ్యా- సుధానిధీ!
ఓ గిరిధారీ! కుంజ విహారీ! ఓహో! పార్థసారథీ! ॥శ్రీ॥

2\. సంతజన ప్రియ! కరుణాభూషణ! సకల సౌఖ్యవారాన్నిధీ!
సంతతమొసగుము నీ విశ్వానికి - చల్లని నీ పద సన్నిధీ
సంతరింప జేయుము భవజలధి స్వామీ-మోహవారిధీ! ॥శ్రీ॥


# ౬౦. శ్రీకృష్ణ హారతి

(ప్రభుగిరిధారి శౌరీ - అనుమాదిరి)

ప॥ కృష్ణ! పరమాత్మ! వేగ – రావయా!
నన్ను – కరుణించి – హారతి గొనుమా – నీదయ ॥కృష్ణ॥

చ॥ నిలకడ లేని – మా జీవితమున –
నీవే – గతియై – నిలువుము స్వామి!
కలిమలహరణా! కమనీయచరణా!
సలలిత శ్యామ శ–రీరా! ॥కృష్ణ॥

2. అందీ అందక – వుందువదేలా?
సుందర రూపము – చూపించరాదా?
వందనమయ్యా! వంశీలోలా!
బృందావన పరి–పాలా! ॥కృష్ణ॥

3. వేణువు నూదుచు – విశ్వములోన
విహరించుమురా! విహగేశయానా!
విమల – భక్తజన (వాజిపురి) విజయాధానా!
సుమధుర – ప్రేమా – ధీనా! ॥కృష్ణ॥

# 61. శ్రీకృష్ణ హారతి

**కళ్యాణిరాగం - ఆదితాళం**

**(నల్లనివాడా! నే గొల్లకన్నెనోయ్ - అనుమాదిరి)**

ప॥ అల్లరివాడా! ఓ! శ్యామసుందరా!
హారతి వీక్షించుమా! నా -
ఆశలు ఫలియించగా! ॥అ॥

చ॥ నీ దరిశన - భాగ్యముతో - మమ్ముల
ధన్యుల గావించుమా!
నీ - దయరా! రాధా మాధవా! హా! నా! ॥అ॥

2. నీవే నాకు - సకలమనే
భావనలో - జీ - వించితినీ
నీ మనసు - కరుగదేలా? హా! నా!! ॥అ॥

3. మురళీధర! విశ్వములో - నీ మృదు
చరణములే -నిలుపుమా!
కరివరదా! సురదా! గిరిధరా! హా! నా!! ॥అ॥

# 62. శ్రీకృష్ణ హారతి

**యమన్‌కళ్యాణిరాగం - ఆదితాళం**

**(యహసానోతెరా - అనుమాదిరి)**

ప॥ నీ – రాజనమిదుగో – ప్రేమమయా! హరి!
నిరుపమ సుందర! కొనుమయ్యా ॥నీ॥

అ॥ శ్రీరాధాప్రియ! చిన్మయా!
శ్రిత జనావన! నీ దయ ॥నీ॥

చ॥ అంతట వెలుగుదు – వన్నియు నీ వై
సుంతయు – కన్నుల – చూడగ నైతి!
యెంతని, వెదకుదు – స్వాంతమున –
పతితపావన! పరమాత్మా! ॥నీ॥

2. ఎన్నో రూపుల – యిలనలరారీ
యెన్నో నామము – లున్న మురారీ!
యే రూపముతో – కొలుతురా!
యే పేరున నిను – పిలుతురా! ॥నీ॥

3. భావనిలయమున – పాయక నిలచి
నీ విశ్వానికి – సేవ యొసగుమా
భవభయహరణా! పావనా!
వంశీవాదన! ఖేలనా! ॥నీ॥

# 63. శ్రీకృష్ణ హారతి

**ఆదితాళం - (అల్లనేరేడు చెట్టుకాడ - అనువాదిరి)**

ప॥ అందుకోవయ్య! మంగళము - నందబాలా!
నందగోపాల! సందియము నొందనేలా?
గోపాల! సందియము నొందనేలా? ॥అం॥

అ॥ రావయ్య! గోవింద! రాసలోలా! వేగ -
రావయ్య! గోవింద! రాసలోలా!
భావింతు - నిన్ను సేవింతు - నీకు -
కావింతు - సాష్టాంగ - వందనాలా ॥అం॥

చ॥ నేను కనులార కనలేను - నిన్ను కనకున్న మనలేను
కనులార కనలేను - కనకున్న మనలేను!
కన్న - కనుపించవేమయ్య! నందబాలా!
నన్ను - కరుణించ రావయ్యా! నందబాలా! ॥అం॥

2. కృష్ణ! గోపీమానసచోర -కృష్ణ! గోలోల - శృతిసార!
గోపీమానసచోర! గోలోల! - శృతిసార!
కృష్ణ! నాపాలి దైవమా! నందబాలా!
కృష్ణ! నా పూర్వ - భాగ్యమా! నందబాలా! ॥అం॥

3. నీవు నావాడవనుకొంటి - నిన్నే భావాన విడకుంటి!
నావాడవనుకొంటి - భావానవిడకుంటి!
కావుమా! విశ్వనాథుని నందబాలా!
దేవ! దీవించి - దాసుని - నందబాలా! ॥అం॥
(దేవ! దీవించి కుశాయిగుడెము నందు జనుల) ॥అం॥

# 64. శ్రీకృష్ణ హారతి

**హిందుస్తాన్ భైరవిరాగం - ఆదితాళం**

**(ఛంఛం బాజే పాయలియామోరి - అనుమాదిరి)**

ప॥ రాధాలోలా! మంగళమో హరి! ॥రా॥
రాధాలోలా! మంగళము

అ॥ రాసవిహారీ! కన - రావయ్యా! ॥రా॥

చ॥ ఘోరమైనట్టి - సంసార - కూపమ్మున -
కూలిపడియుంటి - కొరగాని - తాపమ్మున !
చేర రావెంతకు - చేర్చుకో చెంతకు - హరి!
భారము - నీదే - కదా! మరువకు ॥రా॥

2. నందగోపాల! నాభావ - నవనీతము -
విందుగా - చూరగొనవేమి? విపరీతము?
అందములకందము - చిందు - నీరూపము - హరి!
అందిన - అదియే - బ్రహ్మానందము ॥రా॥

3. సారసారా! శ్రీగోలోక (రిమ్మనగోడు) - పురమందిరా!
మారసుకుమార! విశ్వేశు - కరుణించురా!
ధీర! బింబాధరా! దారి - జూపించురా! హరి!
సారసనేత్రా! శ్యామలసుందరా! ॥రా॥

# 65. శ్రీకృష్ణ హారతి

**జుల్వతాళం - అందమైనలోకమని - అనుమాదిరి**

ప॥ అందమైనడెందమని – అందుడాగియుందువని –
ఎందరో అన్నారయ్య–దేవదేవా! మా
ముందుకేల రానేరావు? కృష్ణయ్యా! కృష్ణయ్యా!
అందుకొమ్ము నీరాజనము కృష్ణయ్యా! ॥అం॥

అ॥ మన్నుదిన్నవాడవని – నిన్ను వెన్నదొంగవని
అన్నులేమొ? అన్నారని – దేవదేవా!
చిన్నబోకుమయ్యా! చిన్నికృష్ణయ్యా! కృష్ణయ్యా!
ఉన్నదిక్కు నీవేనయ్యా! కృష్ణయ్యా! ॥అం॥

చ॥ నిన్నుగాంచు వేళ – రానేరాదా?
నీకటాక్షమైన – లేనేలేదా?
ఎన్నడు నినుజూతును? – యెన్నడు దయగల్గును!
నన్ను మరవ – బోకుమయ్యా! కృష్ణయ్యా! కృష్ణయ్యా!
నిన్నువిడచి – నిలవలేను కృష్ణయ్యా! ॥అం॥

2\. ప్రేమతోడ నిన్ను – సేవిస్తాను – ఆ
ప్రేమలోన మునిగి – ధ్యానిస్తాను ।
ప్రేమించే విధము – యేమాత్రము తెలియదు!
రామరామ! రావేమయ్యా! కృష్ణయ్యా! కృష్ణయ్యా!
స్వామి విశ్వనాథు జేర కృష్ణయ్యా!
(రామలింగపుర విహార! కృష్ణయ్యా!) ॥అం॥

## 66. శ్రీకృష్ణ హారతి

**తోడిరాగం - ఆదితాళం**

**(ఓహో బస్తీ దొరసానీ! - అనుమాదిరి)**

ప॥ రాధామాధవ! గిరిధారీ! రారా! మురళీధర! శౌరీ!

అ॥ అందుకోరా!మురారీ! మంగళ - హారతి - మముజేరి॥రా॥

చ॥ నీల నీల - కాంతులవెలయ - నెమలికన్ను బెట్టుకొని
మీలనేలు చూపులు వరల - కేల మురళి - బట్టుకొని। ఆహా!
మేలిమి- పుట్టముగట్టుకొని-మిలమిల-నామము-దీర్చుకొని-
అందుకోరా - మురారీ! మంగళహారతి మముజేరి ॥రా॥

2. చిన్నికృష్ణ! కనిపించుమురా! వెన్నలంచమిత్తునురా!
కన్నతండ్రి! తులసీదళముల - కానుకనర్పింతునురా! హా! ఆ
పన్నుడ - చక్రధరా! యెన్నో - కన్నులజూడుమురా!
అందుకోరా - మురారీ! మంగళహారతి మముజేరి ॥రా॥

3. రామకృష్ణ! హరి! గోవింద! ప్రేమసుధాసాగరా!
కోమలాంగ! నీవిశ్వేశుని - కోరికలీడేర్చుమురా! ఓ!
స్వామీ! సాధకమందారా! మాకిల - సర్వమునీవేరా!
అందుకోరా - మురారీ! మంగళహారతి మముజేరి ॥రా॥

# 67. శ్రీకృష్ణ హారతి

**హిందుస్తాన్ భైరవి రాగం - ఆదితాళం**

**(నిజగా దసాయదునందనే - అనుమాదిరి)**

ప॥ మురళీధరా! తిలకించురా

అ॥ విరిసిన - హారతి - వెలుగులా ॥ము॥

చ॥ వదన కమలమున - మధురాధరమును -
వదలని - మంజుల హాసము!
మెదలగ మాపై - నీ కటాక్షములు -
సుధల ఝరులు - కురిపించగా ॥ము॥

2. తల్లివి నీవే - తండ్రివి నీవే
దైవము నీవె - దయామయా!
యెల్లజగాలకు - యేలికనీవే
యీవే - సకలము - చిన్మయా! ॥ము॥

3. అనయము నిన్నే - మనమున నమ్మిన
తనయుల కోరిక - దీర్చగా!
కనికరమూని - భవార్ణవమందున
మునుగు - విశ్వమును బ్రోవగా ॥ము॥

# 68. శ్రీకృష్ణ హారతి

**భీంప్లాస్ రాగం - ఆదితాళం**

**(గోవిందభజో - అనువాదిరి)**

ప॥ హారతి – గిరిధారీ! గోవిందహరి! ॥హా॥

అ॥ కరుణాసాగర! కాంచుము – శౌరీ!
సరగున – మముజేరి – గోవిందహరి! ॥హా॥

చ॥ మాధవ! రమ్మని – మరి మరి – పిలచిన!
మనసు – కరుగదేమి? గోవిందహరి! ॥హా॥

2. రాధాలోలా! రసమయలీలా!
రా!రా! గోపాలా! గోవిందహరి! ॥హా॥

3. నీ విశ్వానికి – నేత్రోత్సవమై –
నిలువుము – ప్రేమధుని! గోవిందహరి! ॥హా॥

4. మోహన మురళిని – ముదమున నూదుచు
(మూడ్చింతలపురి – ముదమునజేరి)
పూజలు గొనుము హరి! గోవిందహరి! ॥హా॥

# 69. శ్రీకృష్ణ స్వరూప హారతి

**భీంప్లాస్ రాగం - ఆదితాళం**

**(రుమక చలత రామచంద్ర - అనుమాదిరి)**

ప॥ హారతి గొనుము - రాధాలోల! ॥హా॥

అ॥ గిరిధర! గోపాలా! ॥హా॥

చ॥ సుందర - యమునానుకూల - బృందావన సంచారీ!
మంద మంద - మధుర - మధుర మురళీ రవకారీ!
॥హా॥

2. కుటిల కుంతలాలంకృత - కోటిమదన - ముఖవికాస!
పటుతర మాయానాటక - నటన సూత్రధారీ! ॥హా॥

3. శ్రీకర! కౌస్తుభ భూషణ! కేకి పింఛమకుట! సకల
లోకేశ్వర! నీల నీల - రూప సుధారసఝరీ! ॥హా॥

4. నటన మనోహర! చిన్మయ! నవ్యరాస కేళికళా -
చటుల గోపికా సహస్ర - పటహృత - విటమౌళీ! ॥హా॥

5. విమల నయన! విశ్వనాథ! వినుత చరణ! పీతవసన!
సుమకోమల! వాసుదేవ! (కరకపట్ల) సుఖకర! వనమాలీ!
॥హా॥

# 70. శ్రీకృష్ణ హారతి

**కళ్యాణ వసంతరాగం - ఆదితాళం**

**(ఐచ్ఛికం)**

ప॥ గోకుల బృందావిహారీ! - శ్రీహరి! ॥గో॥

అ॥ గోవర్ధన గిరిధారీ! శ్రీహరి! ॥గో॥

చ॥ శ్రీరాధా ప్రేమామృత లహరీ!
కారుణ్యాలయ! శౌరీ!
ఘోర భవార్ణవ పతితోద్ధారీ!
నీరాజనము మురారీ! ॥గో॥

2. నీలాలక! శిఖి పింఛమౌళీ!
బాలా! జయ వనమాలీ!
గోలోకాధిప! మోహన మురళీ
లోల! గొనుము నివాళీ ॥గో॥

3. సేవా ప్రియ! యాదాద్రి మఠాశ్రయ!
భావానంద! హరీ! చిన్మయ!
దేవ! విశ్వవందిత పాదద్వయ!
భావాతీత సుఖాలయా! ॥గో॥

# 71. శ్రీకృష్ణ హారతి

**భీంప్లాస్‌రాగం - ప్రతి మధ్యమ సంకరం - ఆదితాళం**

**(ఎందు డాగియున్నాడో - అనువాదిరి)**

ప॥ అందుకోర కృష్ణయ్యా! - అందాల హారతీ!
ఆపన్న సన్నుతి ॥అం॥

చ॥ శిరమున పింఛము - చిందులు వేయగ
కరములు మురళీ - స్వరములు మీటగ
కరుణామృతమును - కన్నులు గురియగ
చిరునగు - మోమున - వరలగా ॥అం॥

2. బృందావనిలో - యమునా తటమున
అందెలు పదముల - సందడి సేయగ
మందల గాచే - మాధవ! హరి! నా
డెందములో విహ - రించుమురా!

3. నిను గనలేని - కనులెందులకు?
నీ దయలేని - బ్రతుకెందులకు?
కణకణమందున - కనిపించుమురా!
క్షణమై - నను విడ - నాడకురా! ॥అం॥

4. అరమర సేయక - నీ విశ్వేశుని
మొర వినుమయ్యా! కరివరదాయక!
కరుణాసాగర! కౌస్తుభ భూషణ!
మురహర! శ్యామల! గిరిధరా! ॥అం॥

# 72. శ్రీకృష్ణ హారతి

**మాల్కోస్ రాగం - ఆదితాళం**

**(ఓం హరా శంకరా! - అనుమాదిరి)**

ప॥ రాధికా సుందరా! గిరిధర! ॥రా॥

అ॥ మాధవా! మహాప్రభో! మహిత వైభవా! విభో!
మంగళాంగ! పాండురంగ! మంగళం గృహాణ భో! ॥రా॥

చ॥ మదశిఖిపింఛ విభూష – మదన మనోహర వేష!
మధుర – మృదుల దరహాస! మామక హృదయనివాస!
విధు సహస్రకోటి సదృశవదన కమల భాసురా! ॥రా॥

2. బృందావన సువిహారా! వందితజన మందారా!
మందర ధర! శృతిసారా! మంజుల శ్యామ శరీరా!
నంద గోప నందనా! సనందనాదివందితా! ॥రా॥

3. దేవ! భక్తగృహ (త్రిమందిర) వాసా! దినకరకోటిప్రకాశా!
పావన – విశ్వహృదీశా! సేవకజన సంతోషా!
భవ్య వేణుగాన – శీల! పాహి–పాహి–పాహిమామ్ ॥రా॥

# 73. శ్రీకృష్ణ హారతి

**చక్రవాకరాగం - జుల్వతాళం**

**(నీకొండకు నీవేరప్పించుకో - అనుమాదిరి)**

ప॥ నీవాడనుగానా? శ్యామసుందరా!
నీవే - నన్నెటులైన - దరికిజేర్చుకోరా ॥నీ॥

అ॥ ఓ స్వామీ! పాండురంగ! ఓ రుక్మిణీశ!
ఓపికతో హారతిగొని కాపాడుమురా ప్రభూ! ॥నీ॥

చ॥ నిన్ను నమ్మియున్న - నీవే - నా దిక్కనుకొన్న
కన్న తండ్రి! యీ దీనుని - యెన్నడు కృపజూతువో?
అన్నియు నీవై యున్న - కన్నులకగుపించవు
మన్నించుము - నావేదన - విన్నవింతునో ప్రభూ! ॥నీ॥

2. నీవు నన్ను - కరుణిస్తే - కలకాలం పండగే
నీవె నన్ను - కాదంటే - బ్రతుకంతా దండగే
దేవ దేవ! రావయ్యా! దీనలోక బాంధవా!
ఈ విధి నన్నుడికించుట-యేమి న్యాయమో ప్రభూ! ॥నీ॥

3. కన్న కడుపు గాదా? యికనన్నను - దయరాదా?
ఇన్నినాళ్ళు విశ్వేశుని - సన్నుతి - వినలేదా?
యెన్నడైన - భక్తులయెడ - యింత జాగుగలదా?
కన్నయ్యా! చేసికొన్న - పున్నెము సరిపోదా! ॥నీ॥

# 74. శ్రీకృష్ణ హారతి

**భీంప్లాస్ రాగం - ఆదితాళం**

**(నిన్న కనిపించింది - అనుమాదిరి)**

ప॥ వెల్గు వికసించింది – ప్రేమ ప్రవహించింది
వేణుగోపాల! నేడు – నీ హారతి ॥వె॥

చ॥ కనుము – నాలో కాపురముండి – కనులారగా
మనసులో దివ్యభావాలు – చెలరేగగా
వేణుగానమ్ము – వినిపించు – వినసొంపుగా
తనువు పులకించగా – మునులు వినుతించగా
జనము – నీ నీలియందాలు – తిలకించగా ॥వె॥

2. ఘోర సంసార – నరకాన – కుమిలించకు
సారమేలేని – భోగాల – చవి జూపకు
దారి జూపించి దీవించు – మారాడకు
చేర రా చెంతకు – వేరుగా – చూడకు
చేరి – లాలించి పాలించు – విడనాడకు ॥వె॥

3. వాసుదేవా! భావాతీత (బదనకంటి) వరమందిరా!
భావనానంద! గోవింద! వ్రజసుందరా!
రాసలోలా! దయాశీల! రాధావరా!
ఆస లీడేర్చురా! హాయి చేకూర్చురా!
అద్వయానందమున – విశ్వమును – ముంచురా ॥వె॥

# 75. శ్రీకృష్ణ హారతి

**శ్రీ రాగం - జుల్వతాళం**

**(యేమివ్వను - అనువాదిరి)**

ప॥ కనిపించురా! కరుణాసాగరా! హరీ!
కనిమంగళ – నీరాజన (దీప) కాంతులా ॥క॥

చ॥ నీ శ్యామల దివ్యాకృతి – చందము – బ్రహ్మానందము
నీ పావన – నామ సుధా – పానము – యెంతో మధురము
నీ సేవయె – ముక్తికి – సోపానము – హరీ!
నీవే మా – జీవన సర్వస్వము ॥క॥

2. అడుగడుగున – అందెలు రవళించగా – అందముమించగా
పుడమి తల్లి నిన్గని – పులకించగా – మది వికసించగా
పడతులంత –నివ్వాళులు । పాడగా! హరీ!
పాండురంగ! రమ్ము – మమ్ము – జేరగా ॥క॥

3. మురళీధర – బృందావన (వాజిపురీ) మందిరా!
రాధాసుందరా!
విరజాప్రియ! గోవర్ధన – గిరిధరా! గోకుల పరిసరా!
పరిపూర్ణ తమావతార! పలుకురా! హరీ!
చిరు విశ్వము పైన – ప్రేమ – చిలుకురా ॥క॥

# 76. శ్రీకృష్ణ హారతి

**తిలక్‌కామోద్ రాగం - ఆదితాళం**

ప॥ వేదాటవిలో - వెదకెదరేలా?

అ॥ వెదకి వెదకి - వేసారు - బుధులార! ॥వే॥

చ॥ ఏది మీకు కావలసియున్నదో?
యేది సకల - వేదాంతసారమో?
యేది సత్యమో? నిత్య సుఖమ్మో?
అది వచియుంతును హాయిగ - కనుడీ ॥వే॥

2. వినుడీ - వ్రేతల యిండ్లకు జనుడీ!
వెదికిన - నచ్చటి - వీధులె వెదకుడి!
ఘన యశోద - శ్రీకృష్ణరూపమున
కట్టివైచె - రోటన్ - బ్రహ్మమును ॥వే॥

3. పేరు - రూపు లేకున్నను - దీనుల (హారతి)
పిలుపు వినగ - నా విశ్వ వరదుడే
నీరు ముద్దగా - మారు చందమున
పేరుకొనియె - బృందావనమందున
పేరు గొనియె - రేపల్లె వాడలో ॥వే॥

**గమనిక :** ఈ హారతి గీతము శ్రీశ్రీశ్రీ భావానందస్వామివారి ఆజ్ఞచే శ్రీకృష్ణకర్ణామృతములోని - **"వరమిమ ముపదేశ మాద్రియధ్వమ్......"** అను శ్లోక భావముననుసరించి శ్రీ విశ్వనాథ గురుదేవులచే రచింపబడినది.

# 77. శ్రీకృష్ణ మంగళ గేయము

**హిందుస్తాన్ భైరవిరాగం - ఆదితాళం**

ప॥ గిరిధర! గోపాల! శ్రీ రాధాలోల!
సరగున మమ్మేల - సరసకు రావేల ॥గిరి॥

చ॥ మురళీధర నా - జీవితము - హరి
చరణయుగళికే - అంకితము
కరుణ జూతువో - మరి యేమి సేతువో?
నిరుపమ సుఖసార! నీ యిష్టము ॥గిరి॥

2. ప్రతిరేణువులో - భాసిలు దేవా!
సతతము జీవుల - గతినీవె కావ।
బ్రతుకంత నీ నామ - భజనతో నడువ
సతము దీవించు - సర్వేశ! ప్రేమభావ! ॥గిరి॥

3. ఏమని పిలచిన - పలుకుదువయ్యా
ఏమేమి చేసిన - కనుపింతువయ్యా
ఏమియు తెలియని - యీ విశ్వమును
ఎటులబ్రోతువో - యిక నీకె తెలియును ॥గిరి॥

# 78. శ్రీకృష్ణ హారతి

**ఆదితాళం**

**(పారిజాతాపసె అచ్ఛా అనుమాదిరి)**

ప॥ రావయ్యా! రాసరాజా! రసరూప! ప్రేమనైజా ॥రా॥

అ॥ గోవింద! నీలతేజా! కావింతు పాదపూజ – దయాళూ ॥రా॥

చ॥ ఆవాహనము చేసి – అఖిలోపచారములతో –
దేవాదిదేవ! నిన్ను – సేవింతు – సుప్రసన్ను – దయాళూ!
॥రా॥

2. ఆపన్నభక్తపాల! చూపించు రాసలీల!
కాపాడుమయ్య! మమ్ములా–గోపాల! వే–ణుగోపాల! దయాళూ!
॥రా॥

3. నిత్యాత్మ దీప్తిగలుగా – విశ్వనాథుగనగా!
నీరాజనం – నీరాజనమ్
నీరాజనమ్ము గొనగా – చిరకాల తమముదొలుగ – దయాళూ
(నీరేజనగరివెలుగ) ॥రా॥

# 79. శ్రీకృష్ణ హారతి

**యమునా కళ్యాణిరాగం - ఆదితాళం**

**(ప్రావిరహే తవ దీనా అనువాది)**

ప॥ మంగళమో–గిరిధారీ! శౌరీ!
మంగళమో - గిరిధారీ! శౌరీ! ॥మం॥

అ॥ మురళీ ధృతకర! కరుణాసాగర ।
మోహన - కృష్ణ! మురారీ శౌరీ! ॥మం॥

చ॥ కణ కణమున - హరి! కలవుగదా? మా
మనమున తావేలేదా!
క్షణమొక యుగము - నిను బ్రతిమాలిన -
విననైనను - వినరాదా! ॥మం॥

2. పిలుపున కందక - తలపున దోచక -
నిలచుట న్యాయమా? నీకు
జలధర సుందర! చక్రాయుధ ధర!
వెలుగుము - వలదు పరాకు ॥మం॥

3. కావుము యమునా - కల్యాణీ ప్రియ!
నీ విశ్వేశుని త్వరలో!
సేవకులము గద (చేవర్తీశ్వర) - యేవిధినైనను -
చేర్చుకొనుము మము నీలో! ॥మం॥

# ౮౦. శ్రీకృష్ణ మంగళ కీర్తన

**ఆదితాళం**

ప॥ ఏహి మాధవా! రాధికాధవా! ॥ఏహి॥

అ॥ మాయ హి మాయాహి - మాం విహాయ ॥ఏహి॥

చ॥ సంసారార్ణవ - భయ సంత్రస్తం
మోహరూప - దుర్గ్రహేణ గ్రస్తమ్ ।
పదయుగళార్పిత - భర సర్వస్వం
మామవ కృత్వా - మాయా విముక్తమ్॥ ॥ఏహి॥

2. కాయోనిత్యో మరణం తథ్యం
పాపమనల్పం - కఠినః కాలః ।
కిం కర్తవ్య విమూఢం - కథ మపి
మామవ - న హి - న హి - అన్యోపాయః ॥ ॥ఏహి॥

3. శృత్వా విశ్వస్య - కరుణాక్రందం
దృష్ట్వా సతతం - దీనావస్థామ్ ।
ద్రవతి న కిం తవ - నవనీత హృదయం
మామవ - కృపయా - శీఘ్రాతి శీఘ్రమ్ ॥ ॥ఏహి॥

# 81. శ్రీకృష్ణ మంగళ కీర్తన

**భీంప్లాస్ రాగం - జంపెతాళం**

**(కనరానిదేవుడే కనిపించినాడే - అను మాదిరి)**

ప॥ కనులార ఒకసారి కనుపించుమయ్యా ।

అ॥ప॥ కనిపించి నీ మురళి వినిపించుమయ్యా ॥ ॥కను॥

చ.1 నీ పాదకమలాల – నీడలో జేరి
నివసింతు – హాయిగా నిరతమ్ము శౌరి!
గోపాల! నీ సేవ కోరితిని – కొసరి
నా పాలి కన్నయ్య! నవనీతహారి!! ॥కను॥

చ.2 అనయమ్ము – భవబాధలనుభవించితిని
అనుమానమును వీడి – ఆదుకో సుతుని ।
నినుబాసి – నిముసమ్ము – నిలువజాలనని
ఘన నీలతేజ! నన్–కరుణించు పూని ॥ ॥కను॥


చ.3 శ్రీరాధికామాత! చిరునగవుతోడ
నీరేజదళనయన! నీ చెంత నుండ ।
మారాధికాంగ! నా మదిలోన నిండ
వేరమ్ము ప్రేమతో – విశ్వమును జూడ ॥ ॥కను॥

భావానంద

మంగళ మంజరి

రాధాకృష్ణ

# శ్రీరామ హారతులు



రచయిత :

మహాత్మ **శ్రీ అప్పాల విశ్వనాథశర్మ**

# 82. శ్రీరామ హారతి

## యమన్ కళ్యాణిరాగం - ఆదితాళం

(సఖియా వివరింపవె - అనుమాదిరి)

ప॥ మనసా దిగులెందుకే

అ॥ విను మనయము - రాముడు - నీవాడే ॥మన॥

1. ఆలసింపక - హరిని డాసి
పూలదోసిలి - ముందు బోసి
నీలో వెలిగే - జ్ఞానరాశి
నివ్వాళిగా జేసి - పులకించవే ॥మన॥

2. అన్ని విధముల - అరసి చూడు
అణువు అణువున - అలరు - దేవుడు!
విన్నపాల - వినెడువాడు -
విడనాడి - తడవైన - నిలువడు ॥మన॥

3. ప్రేమతోడ - విశ్వనాథుని -
కామితముల - తీర్చువాడు
శ్యామలాంగుడు! జానకీశుడు!
జగమేలు - సాకేత (మరుకూకు) - నిలయుడు! ॥మన॥

# 83. శ్రీరామ హారతి

**కళ్యాణిరాగం - ఆదితాళం**

**(కుడియెడమైతే పొరపాటులేదోయ్ - అనుమాదిరి)**

ప॥ శ్రీరఘునందన! సీతారామ!
హారతిదో - గొనుమా! రామా! ॥శ్రీరఘు॥

అ॥ కరుణామేఘమా! కురుపించుమా!
కరుణాసారము రామా! ॥శ్రీరఘు॥

1. కోసలేశ! కోదండరామ!
కోపమా? మాపైనా!
ఆసతో దరి - జేరితి - సుమ్మా -
ఆవలకున్ - ద్రోయకుమా! రామా! ॥శ్రీరఘు॥

2. వేడి వేడి - విలపించు దీనుల -
విన్నపమే వినరాదా?
తోడునీడై - కాపాడ - నీలో -
తొందరయే లేదా? రామా! ॥శ్రీరఘు॥

3. కన్నతండ్రీ! విశ్వేశుమదిలో
కాపుర - ముండుమయా!
మన్నించుము - సాకేత (జగదేక) పురాలయ!
మాగతి - నీవేనయా! రామా! ॥శ్రీరఘు॥

# 84. శ్రీరామ హారతి

(నీపదములె చాలురామా - అనుమాదిరి)

పll ఓ పరమదయాకర! రామా! నీ
పదములు నాలో - నిలుపుమా llఓపll

అll ఓపికతో మనవిని వినుమా! మా
దాపుజేరి - హారతి గొనుమా llఓపll

చll నీ దరి జేరగ - గోరితినీ - నే
నిన్నే - మదిలో - నమ్మితినీ!
నీ దరిశనమిమ్మా - మమ్ముల
నాదుకొనుము సుమ్మా! llఓపll

2. నీ సరి దైవము - లేరయ్యా! మా
దోసములెంచక రావయ్యా!
కోసలపుర నిలయా! దశరథ
కౌసల్యా తనయా! llఓపll

3. నీ లీలలు గన జాలమయా! మా
పాలిటి సీతారామయ్యా!
జాలిగ విశ్వము నేలుమయా! నీ
పాలబడితి - రావేమయ్యా! llఓపll
(వాసాలమర్రి - మందిరసదయా)

# 85. శ్రీరామ హారతి

**భీంప్లాస్ రాగం - ఆదితాళం**

**(అందమె ఆనందం - అనుమాదిరి)**

ప॥ మంగళమిదె గొనుమా! రామా! ॥మం॥

అ॥ మాతంగ గమన! కవిపుంగవనుత! శుభ- ॥మం॥

చ॥ యెడబాయని జానకితోడ – కుడియెడమల తమ్ములువేడ!
తడవా నీ తనయుని జూడ – తారకనామ తరంగముబాడ
॥మం॥

2. మామక హృదయములోన – నవహేమరచిత పీఠాన
శ్యామలాంగ! బరువౌనా – చాల దయతో పాయక నిలచిన
॥మం॥

3. శరచాప ధరణ శ్రీరామ! శరణాగతవత్సల రామ!
కరుణతో విశ్వేశుని గనుమా – కరుణాసాగర సీతారామ!
॥మం॥



# 86. శ్రీరామ హారతి

**శివరంజని రాగం - ఆదితాళం**

**(ఓ జాబిలీ - అనుమాదిరి)**

ప॥ మన్నించుమా! మమ్ములన్ – శ్రీరామా! మంగళంగొనరమ్మా ॥మ॥

అ॥ మదన శతకోటి – మంగళాకార! మాకు నీవేసుమ్మా ॥మ॥

చ॥ అందమంత – రూపుదాల్చి – అవతరించిన బ్రహ్మమా!
యెందుకొరకు – అందరాక – వుందువయ్యా! దైవమా!
అందుకోవయ్య – సాకేతరాజా! విందుగా మా ప్రేమ!
వందనముచేకొనుమా – నందనుల మరువకుమా! ॥మ॥

2. తమ్ములంత – కొల్వగా! మా – యమ్మజానకి తోడుగా
సమ్ముదమున – విశ్వనాథుని – నెమ్మనమున – నిల్వగా!
రమ్ము దయతోడ – భద్రాద్రివాసా! రాఘవా! వే వేగ!
ఇమ్ము సకల శుభాల – యిహపరమ్ముల వెలుగ ॥మ॥

# 87. శ్రీరామ హారతి

**కళ్యాణిరాగం - ఆదితాళం**

**(ఆకలిమంటలు బాబూ - అనుమాదిరి)**

ప॥ నా గతి నీవే రామా! విడ–నాడకు–నీ దయసుమ్మా ॥నా॥

అ॥ నవ – నీరదశ్యామల! మంగళకాంతుల –
నాలో – చూడగరమ్మా! ॥నా॥

చ॥ తెలిసి తెలియక – చేసిన నేరము – తలచిన –
కలుగును దిగులు –
యిల దిలకించిన – నేడో రేపో – కలలే – భవ సౌఖ్యాలూ!
అలుగకు నాపై – సీతావల్లభ!కొలచెద – నీ పాదాలూ
॥నా॥

2. పోయిన గడియలు – రానే రావు – నా యను – వారలు –
యెవరు?
కాయము నేనని–కాలము వృథగా–గడిపిన – బ్రోవగలేరూ!
సాయముచేసిన – మాయల ద్రోసిన – స్వామీ! నీదే నెనరూ
॥నా॥

3. హరిహరరూప! ఆశ్రమదీప! అసదృశ సాయక చాపా!
మరువకుమయ్యా! నీ విశ్వేశుని – మాయామానుషరూపా!
శరణాగత జనవత్సల! శ్రీ–దాశరథీ! కోసలభూపా! ॥నా॥
(హరిహర! సీతారాంనగరాధిప!)

# ౮౮. శ్రీరామ హారతి

## ముల్తాన్ రాగం - ఆదితాళం

ప॥ శ్రీరామ! జయరామ! జయ! జయ! రామ!! ॥శ్రీ॥

అ॥ నీరాజనము - ధారుణీ - సార్వభౌమా! ॥శ్రీ॥

చ॥ సీతాసమేత! శ్రితపారిజాత!
వాతాత్మజ నుత! వైకుంఠ నేత! హరి! ॥వా॥
సంతోషకలిత! సకలార్థదాతా! ॥శ్రీ॥

2. ఓ కన్నతండ్రి! నీ కన్నహితులు -
నాకెవ్వరున్నారు - నా నోము ఫలమా!
యేకారణములేక - లోకాల కరుణించు -
సాకేతరామా! సౌందర్యధామా! ॥శ్రీ॥

3. వేదాంతవేద్య! విశ్వేశవంద్య!
భూదేవతాసేవ్య! భువనైకపూజ్య!
నాదండ - నీవుండ - నాకేల భయము -
నా దేవ! దేవా! (చల్లూరు) కోదండరామా!! ॥శ్రీ॥

# 89. శ్రీరామ హారతి

**మోహనరాగం - ఆదితాళం**

**(శివ శివ శంకర! - అనువాదిరి)**

పః దశరథనందన! దశముఖభంజన!
దయయా – స్వీకురు – నీరాజనమ్ ॥ద॥

చః జలధర సుందర! జనకసుతావర!
కరధృత – కోదండ – శర – భాసురా!
కలికలుషహరా! కరుణాసాగరా!
కరినుత! సాకేత – పురమందిరా! ॥ద॥

2. వైనతేయ యుత – వాతాత్మజ నుత!
సనక – సనందన – ముని వందితా!
ఘన – గుణభూషిత! జనగణపూజిత!
వనచరసేవిత! వరదా! హితా! ॥ద॥

3. ఏకవచన శర! ఏక వధూవ్రత!
సాకారధర! భూ – మాకార మామ్!
ఆకలయ – సుతం – ఆశ్రమనిలయం! (అల్లివాదవిభో!)
అనిశం – విశ్వేశ – మవనీ ప్రభో! ॥ద॥

# 90. ఆంజనేయ హారతి


## హిందుస్తాన్ తోడిరాగం - ఆదితాళం

ప॥ నీరాజనము గొనుమా – కపివీర! దయగనుమా ॥నీ॥

చ॥ శ్రీరామపదసేవా ధురంధర!
శ్రితజనావనా! రావా?
కారుణ్యమున మము గావగా – దరి
జేరుటే బరువా ॥నీ॥

2. రామ నామమున తనవిదీరక
రాముని దయతో నమరుడవై!
ప్రేమతోడ గంధ మాదనమ్మున
వెలసిన మహానుభావా! ॥నీ॥

3. బాలవీర మారుతీ! విశ్వము
నేలుమయ్య – నీవే గతి!
ఆలసింపకుము చాలా
ఆశ్రమ క్షేత్రపాలా!! ॥నీ॥



# 91. ఆంజనేయ హారతి

**కాఫిరాగం - ఆదితాళం**

**(మహేశాపాపవినాశ - అనుమాదిరి)**

ప॥ కపీశా! హారతి గొనుమా - గంధమాదనాద్రివాస!
కాంచనాభ! రామాదూత! కాంచు మా దెస! దేవా! ॥క॥

అ॥ దేవ దేవ! దివ్యభావ! దీనబాంధవా!
కావరావ! మమ్ము చలువ - కలుషవనదవ! దేవా! ॥క॥


చ॥ నిన్ను వేడుకొన్న తొలగు - నిఖిల బాధలు
నీ కటాక్షమున్న కలుగు - నిత్య సుఖములు
సన్నుతింతురయ్య నిన్ను - సకలజీవులు
విన్నవించుకొందు వినుము - విన్నపమ్ములు! స్వామీ! ॥క॥

చలీ॥ గ్రామగ్రామమున - రామదాసులను -
కాపాడుదువో - హనుమంతా!
ప్రేమతోడ నమ్మిన - విశ్వానికి -
పెన్నిధి వీవే - హనుమంతా!
(ప్రేమతోడ జగదేకపురమ్మున -
వెలసిన హరి విశ్వేశనుత)
హనుమంతా! జయ - హనుమంతా! శ్రీ
హనుమంతా! అతి - బలవంతా!! ॥క॥

నీకు ఉన్నదంతయును ఈశ్వరునిదే అని భావించి, రేపటికై ఉంచుకొనక లేనివారికి ఇమ్ము. నీకొరకై చింతించకుము.

అన్ని బలములకన్న భావబలమే మిన్న.

సృష్టిలోగల ప్రతి వస్తువు విలువైనదే. ఎంత చిన్న వస్తువైనా సరే, అవసరం వచ్చినప్పుడే దాని విలువ తెలుస్తుంది.



శ్లో॥ మురహర రంధన సమయే మా కురు మురళీరవం మధురమ్ ।
నీరసమేధో రసతాం కృశానురప్యేతి కృశతనుతామ్ ॥

ఓ మురారీ! నేను వంట చేసేటప్పుడు నీవు నీ మురళిపై మధురమైన రాగాల రవళిని పలికించకయ్యా! ఎందుకంటావా? విశ్వమోహనమైన నీ మురళీస్వరాలకు పొయ్యిలోని ఎండిన ఈ కట్టెపుల్లలు కూడా పచ్చిగా మారి చిగురించుచున్నవి. అందువలన మంట చల్లారిపోయి వంటకు తంటా వచ్చిపడింది ప్రభూ!

# మంగళ మంజరి



# శ్రీ శివ హారతులు



రచయిత :

మహాత్మ శ్రీ అప్పాల విశ్వనాథశర్మ

# 92. మానసబోధ కీర్తన

**జోగిరాగం - ఆదితాళం**

ప॥ శివ! శివ! యనవే మనసా – నీ
భవభయమంతయు – తొలగును – తెలుసా ॥శివ॥

అ॥ శివ! శివ! భవ! యని – శివుని భజించిన –
చిత్తము –చిత్తై – సత్తే – మిగులును ॥శివ॥

చ॥ కలవంటివి – సంసార – భోగములు
నిలువదు కాయము – తృటిలో మాయము!
కలకాలము – భగవానుని నమ్మిన
కలుగదు – నరకము – కలుగును – సౌఖ్యము ॥శివ॥

2. తలచినవారల – దాపు వీడడు
పిలచినవారల – పెన్నిధి – దేవుడు!
కలతలు విడనాడి – కొలచిన – తోడనే
కాపాడగలడు – కరుణామయుడు! ॥శివ॥

3. నాది నాది యని – వేదన జెందకు –
యేదియు వెంబడి – రాదు – యథార్థము!
వేదసారమిది – నీది నీవె సుమ –
విశ్వనాథు – మంగళరూపమ్మది ॥శివ॥

# 93. శివ హారతి

**భీంప్లాస్ రాగం - ఆదితాళం**

**(రారా కౌగిలిజేర రారాదొరా - అనుమాదిరి)**

ప॥ రా!రా! – మంగళమందుకోరా! హరా! నా
భారమ్ము నీదే – భవానీవరా! ॥రారా॥

చ॥ కనులార – నినుజూడ – మనసున్నది – జీ
వనమేమొ – పరికింప – క్షణమైనది!
కనవేమయా! ఓ కరుణామయా! నీ
కనికార – మునకాని – మనలేనయా ॥రారా॥

2\. యెడబాసి – గడియైన – విడనాడకు! నీ
యొడిలో – నన్నిడుకొమ్ము – పడనీయకు!
తడవెందుకు? కన్నెడనేయకు! నీ
యడుగంటి – పడియుందు – జడిపించకు ॥రారా॥

3\. పరమాత్మ – విశ్వేశ! వరదా! శివ! భా
సుర పాండురంగాశ్రమా! శ్రీకరా!
పరమేశ్వరా! ఓ గిరిజాప్రియా! శం
కర! దీనమందార! శశిశేఖరా!! ॥రారా॥

# 94. శివ హారతి

**కాంభోజరాగం - ఆటతాళం**

ప॥ మంగళం – గిరిజాంబికాసంగ! కరుణాంతరంగ!
మదన మదహర! సాంబ! శివలింగ! ॥మం॥

అ॥ మంగళాంగ! సుశృంగవృషభతురంగ! జితమాతంగ!
సంగర–రంగ నిర్జితదనుజ! భవభయభంగ! ధృతగంగాతరంగ!
॥మం॥

చ॥ నీలలోహిత! భస్మమయఫాల! హర! కాలకాల!
ఫాలలోచన! కలిత ఫణిజాలా!
పాలితాఖిల! లలిత లలితాలోల! సద్గుణజాల! కరతల –
శూల! నతపరిపాల! దేవ! దయాలవాల! సుశీల! జయజయ
॥మం॥

2. చండికాప్రియ! చండభుజదండా! రాకేందుమండల
మండితాభ్రకిరీట! ధృతరుండ!
ఢంఢ డిండిమ – డమరునాద మజాండభాండము
నిండ నిండగ చండతర – శంఖమ్ము మ్రోగ –
నఖండతాండవ లీలసల్పుమ ॥మం॥

3. యక్షరక్షితకక్ష! శ్రితపక్షా! దక్షాధ్వరక్షర
రూక్ష! దుష్టవిపక్ష! నిటలాక్షా!
దక్ష! రాక్షసశిక్ష! తక్షణమోక్షద! విరూపాక్ష! సుందర
వక్ష! ధృతరుద్రాక్ష! దేవాధ్యక్ష! విషభక్షణ క్షమ! శుభ॥మం॥

4. మల్లికార్జున! శర్వ! సర్వేశా! కైలాసవాసా!
మహితవైభవ! పాపచయనాశ!
యెల్లవేళల–యుల్లమున విలసిల్లి (మూడుచింతలపల్లె)
భక్తుల– ప్రేమపూజల చల్లగా గొనుమయ్య
మది – రంజిల్లగా–విశ్వేశనుత! శివ! ॥మం॥



# 95. శివ హారతి

## యమన్‌కళ్యాణిరాగం - ఏకతాళం

(రామచంద్రాయ జనకజామనోహరాయ - అనుమోదిరి)

ప॥ **ఓం** మంగళం నమశ్శివాయ! మంగళప్రదాయ – సర్వ
మంగళా మనోభిరామాయ! మంగళమ్ ॥మం॥

చ॥ **నం** దివాహనాయ! దివ్య – నాగభూషణాయ! – మౌని
బృందవందితాయ! పరశివాయ! మంగళమ్ ॥మం॥

2. **మ** హన్యాససహిత – భవ్య మహా రుద్రపూజితాయ!
మహితవైభవాయ – సాంబాయ! మంగళమ్ ॥మం॥

3. **శి** వకరాయ! శంకరాయ! సేవకజన పోషకాయ!
భవహరాయ! భవానీధవాయ! మంగళమ్ ॥మం॥

4. **వా** మదేవాయ! భక్త – కామిత ప్రదాయకాయ!
కామకోటిసుందరాంగాయ! మంగళమ్ ॥మం॥

5. **య** క్షరాజ – సేవితాయ! దక్షయాగసంహరాయ!
రాక్షసాంతకాయ! శశిధరాయ! మంగళమ్ ॥మం॥

6. తత్పదార్థ లక్ష్యాయ! సచ్చిదానందాయ!
(దామరకుంటప్రియాయ–రామనామసన్ముఖాయ)
దాసవిశ్వనాథ సన్నుతాయ! మంగళమ్ ॥మం॥

# 96. శివ హారతి

**హిందుస్తాన్ తోడిరాగం - జుల్వతాళం**

**(సువ్వీ సువ్వీ - అనుమాదిరి)**

ప॥ శంభో! శివ! సాంబ! శివ! కొనుము - మంగళమ్
స్వామీ! అభివందనం! శివ! శివ! శివ!! ॥శంభో॥

చ॥ కదిలే - ప్రాణుల్లోన నీవె - ఎఎఎఎఏ
కదలని - స్థాణువనగ - నీవే!........
సదయ! లింగమయుడ వీవే - అణువణువులోన - నీవే!
జగమున అంతట నీవే! శివ! శివ! శివ!! ॥శంభో॥

2. వెండికొండపైన వెలుగురేడా! ఆఆఆఆఆ....
చండికమ్మ - వలచిన మొనగాడా!......
దండి మహిమలు గలవాడ! మెండు - బూచుల - యెకిమీడా!
దండము - శంభుదేవుడా! శివ! శివ! శివ!! ॥శంభో॥

3. నొసట దిద్దుకొని - బూడిదపూత!....
మెసవితి జగమేల - విసపుమేత
పొసగ - పసరముపై వసతా! భళి - నీకు తోడు లలిత!
మసలక-చూపుము-మమత శివ! శివ! శివ!! ॥శంభో॥

4. రామలింగ - గిరిమందిర! దిక్పట!
ప్రేమ - విశ్వనాథునేల వకట?
రామ రామ! చట చట! రావయ్య! జటామకుట!
నామది కొను - బాసట! శివ! శివ! శివ!! ॥శంభో॥

# 97. శివ హారతి

**మోహనరాగం - ఆదితాళం**

**(జయకృష్ణా ముకుందా మురారీ - అనుమాదిరి)**

ప॥ శివ! నీరాజనమ్మో పురారీ ॥ శివ! నీ॥
భవదూర! హర! శూలధారీ! ॥శివ॥

చ॥ ఓ శితికంఠ! నీపాదమంట!
చేసిన పాపాలు - కలియును మంట
దాసుల యింట - గౌరమ్మ జంటా!
వసియించు మా - నోముపంటా ॥శివ॥

2. ఓ పరమేశ్వర! పరమదయాకర!
ఓప సుమా - మూడు - తాపాల మంట!
కాపురముండి - రేపులు మాపులు
కాపాడు మా - వెంట వెంట ॥శివ॥

చ॥సా॥ స్వామీ! గుండెలు - ఝల్లుమనేను - ఘో
రమ్మీ - భవసాగరమ్ము - దలపగా!
రమ్మాయని నను బిలువ వదేమి? చే
కొమ్మాయని, యింతవేడు కొనగా!

కం॥ దోసములన్ జేసితినని
రోసముతో నన్నుగనక - రోయుట మేలా?
దాసుని తప్పులు - దండము
జేసిన - సరిపోవుగాదె - చిన్మయ సాంబా! ॥శివ॥

4. తాధిమ్మి – డమరు నినాదాల ఝుణ ఝుణ
తాండవ మాడిన – తండు వాహనా!
తద్వాక్యలక్ష్యార్థ – తత్వస్వరూప!
ధవళ శరీరా! భావవిహారా! ॥నీరా॥

శ్లో॥ భస్మోద్ధూళిత విగ్రహం – శశిధరం – వ్యాఘ్రాజినాలంకృతం
గంగా తుంగ తరంగ భూషిత – జటాజూట ప్రభాశోభితమ్
కైలాసాచల వాసినం – త్రినయనం – కర్పూరగౌరం – శివా
లోలం – శూలధరం దయాజలనిధిం – శ్రీశంకరం –
సౌమ్యహమ్ ॥

5. అమిత దయా పరిపూర్ణ జలధీ
ఆత్మానంద నిధీ! ధూర్జటీ! ఆత్మానంద నిధీ!
అంకిరెడ్డిపల్లీ విహారీ!
అరుదెంచుము – విశ్వానుసారీ!! ॥నీరా॥



# 98. శివ హారతి

**అఠాణారాగం - ఆదితాళం**


**(మదనా సుందర నా దొర - అనుమాదిరి)**

పు॥ నిటలాక్ష! నీరాజనమ్ ॥ఓ॥
నటరాజ! గొనుమా సంకట మోచనా! జటాధర! ॥నిట॥

చ॥ ఆవాహనము జేసి – అభిషేక మొనరించి ॥ఆవా॥
ఆనందముగ నిన్ను – ఆరాధింతును స్వామి! ॥నిట॥

2. బంగారమును గేరు – సింగారింపుల మీరు ॥బంగా॥
గంగా పార్వతులీరు –గల నీకు జోహారు! ॥నిట॥

3. లెమ్మా మక్కువదీర – సుమ్మా మా దరి(తిమ్మాపురము)జేర ॥లెమ్మా॥
రమ్మా! విశ్వము నోట – కొమ్మా కమ్మని పాట ॥నిట॥



## 99. శివ హారతి

(మదనా సుందర నాదొర - అనుమాదిరి)

ప॥ పరమాత్మ! దయజూడరా ॥ ఓ ॥ పర ॥ శం
కర! దీన మందార! గిరిజాంబికా మనోహర! ॥పర॥

చ॥ ఆరార్తికముతోడ – ఆనంద మొనగూడ!
ఆరాధింతును – వీడ – హర! నిన్ను – నీవాడ ॥పర॥

2. గంగమ్మ సిగలోన – గౌరమ్మ సగమేన
సింగారమున మేల్మి – బంగారు కళలీన ॥పర॥

3. శతరుద్ర సేవా – సు – వ్రత భక్త జనలోల!
నతపాల! విశ్వేశ – నుత–రూప–గుణ–శీల! ॥పర॥



# 100. శివ హారతి

**త్రిపుట తాళం**

**(రాయినైనా కాకపోతిని - అనుమాదిరి)**

ప॥ ఎందుకయ్యా? జాగుసేతువు - నందివాహన! శంకరా!
అందుకొన రావయ్య! మంగళ - హారతిదిగో పురహరా!॥ఎం॥

అ॥ మందమతితో - నిన్ను మరచిన - మాకు గతి - నీవే హరా!
సుందరేశ్వర! నీ పదాలకు - వందనము - గంగాధరా!
॥ఎందు॥

చ॥ ఫాలలోచన! పాపమోచన! బాలచంద్ర కళాధరా!
నీల లోహిత! భక్త సేవిత! నిత్య మంగళ విగ్రహా!
కేల శూలము బట్టి - లోకా - లేలు దొర వీవేనయా!
లీలగా - మమ్మేలగా - రాజాలవా? కరుణామయా!
॥ఎందు॥

2. ఎన్ని జన్మలు యెత్తినాననో - నిన్ను జేరక దైవమా!
కన్న తండ్రీ! దర్శనమ్మిడి - కనుల పండువు సేయుమా!
ఎన్నటికి? నీవాడ! నో గిరిజేశ (గజవల్లీశ)! శ్రితమందారమా!
విన్నపము లాలించి వేగమె విశ్వనాథుని బ్రోవుమా!
॥ఎందు॥

# 101. శివ హారతి

**కళ్యాణిరాగం - ఆదితాళం**

**(పరిలేరు నీకెవ్వరు - అనుమాదిరి)**

ప॥ నగజా మనోమందిరా! నటరాజ! దయాకర! (సుందరా)
నగజా మనోమందిరా! ॥నగ॥

అ॥ నిగమాంతసార! పన్నగ దివ్యహారా! ॥నగ॥

చ॥ సొగసులు గురిపించు - సగమేన - గౌరమ్మ!
నగుమోముతో వెల్గు -సిగలోన గంగమ్మ!
నాగుల నగలుంచి -నందిపై వేంచేసి
నగపాల! దయయుంచి - నను గాంచు మించి ॥నగ॥

చర్తి॥ **కాల కాల! చలమేల యేల? కరుణాలవాల! సాంబా!**
**కావరావ? శివభావ! భావ భవదావ! దేవ! సాంబా!**
**కైలాసవాస! సాంబా! కమనీయ వేష! సాంబా!**
**సాంబా! సాంబా! సాంబా! సాంబా!!** ॥నగ॥

2. చల్లగ మమ్మేల - యుల్లమ్మునను (నల్లగుట్టను) జేరి -
అలరార - గొనుమయ్య! హారతి - శశిధారి!
పలుకుము - విశ్వేశు -పాటను వినగోరి
పడియుందు - నీ ముందు - భావానుసారీ! ॥నగ॥

# 102. శివ హారతి

**ఐచ్ఛికరీతి - చతురశ్రజాతి పది అక్షరములు**

**భీంప్లాస్ రాగం - మఠ్యతాళం**

ప॥ ఓ!... ... శివ! గౌరీధవా!

ఓ! యని పిలచిన - ప్రేమతో - పలుకవేమయా! ॥ఓ॥

అ॥ ఓ! కరుణా వరుణాలయ! నీరాజన మిదొ

చేకొని - మమ్ముల - బ్రోవు - పినాక ధనుర్ధర! ॥ఓ॥

చ॥ హర! హర! భవహర! పురహర! స్మరహర! శంకర!
శరణు శరణు - పరమేశ్వర! చంద్ర కళాధర!
కరి చర్మాంబర! కావరార! - దురిత దూర!
వరముని మానస సుందర మందిర! శుభకర! ॥ఓ॥

2. యెన్నడు గలుగునో - నీదయ - యీ దీనులపై
కన్నతండ్రి! నిన్నెన్నడు - కన్నుల జూతుమో
అన్నిట మాగతి - నీ వయి - అభయదానమిడి
ఆదరించుమయ్యా - శరణాగత వత్సల! ॥ఓ॥

3. సోమసూర్య వైశ్వానర - నేత్ర! నిరామయ!
కామిత మంగళ దాయక! కైలాస నిలయ!
దామరకుంట జన ప్రియ! సాంబ! లింగమయ!
స్వామీ! విశ్వనాథు బ్రోవగ - రా!రాదయ ॥ఓ॥

# 103. శివ హారతి

**మాండు రాగం - ఆదితాళం**

**(హావిరహేతవ దీనా - అనుమాదిరి)**

ప॥ మంగళమయ్య - మహేశా! ఈశా!

మంగళమయ్య - మహేశా! ॥మం॥

అ॥ మంగళదాయక! సర్వమంగళా-
మానస ప్రేమ విలాసా! ఈశా! ॥మం॥

చ॥ అనయము - నిను మది - ఆరాధింతుము
తనయుల - బ్రోవగ లేవా? దేవా! తన (2) ॥
చనువు జూపుమా - జాగుసేయగా -
సమయము గాదు శివా! ॥దేవా॥ ॥మం॥

2. చింతక వరదాఽనంత సుఖప్రద!
స్వాంత సమాశ్రితపాదా! దేవా! స్వాం (2) ॥
సంతత - బ్రహ్మానంద వినోదా!
సాంబ! శివార్పిత మోదా! దేవా! ॥మం॥

3. మాటికి - విశ్వముపాట - జమీలా
పేట నిలయ! వినరావా? జమీ (2) ॥
నీట ముంచినా - పాలను ముంచిన
నీవే గతి - యభవా! ॥దేవా॥ ॥మం॥

# 104. శివ హారతి

**ఖరహరప్రియ రాగం - ఆదితాళం**

**(కురిసింది వాన - అనుమాదిరి)**

ప॥ నటసార్వభౌమ! నాలో వెలుగుమా!

నిటలాక్ష! నీరాజనం – ఓ! ॥నట॥

అ॥ జటలోని గంగ – ఝురులై యుప్పొంగ ॥నట॥

1. శంభో శంకర! భక్త వశంకర! సాంబ! దయాసాగరా!
చంద్ర చూడ! హర! శూలాయుధధర!
శతకోటి స్మర సుందరా!
శరణమ్ము నిమ్మా – కరుణింప రమ్మా ॥నట॥

2. గజ చర్మాంబర! గజరిపు సంహర!
గజముఖ కలితాదర!
భుజగ భూషధర! రజిత గిరీశ్వర!
భజనీయ! శశిశేఖరా!
నిజ భక్తాధారా! కుజనౌఘ దూరా! ॥నట॥

3. ప్రేమతో బొమ్మల – రామవరమ్మున
ప్రియమును గూర్పుమయా
నమ్మిన విశ్వము – నెమ్మనమందున
నాట్యము – సల్పుమయా ॥
హిమశైల తనయా! హిత – రుద్ర! సదయా! ॥నట॥

# 105. శివ హారతి

**హిందుస్తాన్ - భైరవిరాగం - జుల్వతాళం**

**(అబ్ తేరెశివా కెానుమెరా - అనుమాదిరి)**

ప॥ పరమాత్మ! హరా! హారతి గొనుమయ్య శంకరా!
వరదా! కరుణజూడుమయ్య! పార్వతీవరా! ॥పర॥

1. శరణాగతార్తి హరణా! శివ! చంద్రశేఖరా!
నిరతమ్ము నీవె దిక్కు మాకు – నీలకంధరా! ॥నిర॥
వరనాగహార! గంగాధర! శరణుపురహరా!
వరదా! వరదా! వరదా! కరుణజూడుమయ్య – పార్వతీవరా!
॥పర॥

2. భవదూర! పాండురంగాశ్రమ (రామలింగపురీ) భవ్యమందిరా!
భవపాశనాశ! దేవ దేవ! భక్త హితకరా! దేవ ॥భవ॥
స్తవనీయపాద! విశ్వనుత! సత్యసుందరా!
వరదా! వరదా! వరదా! కరుణజూడుమయ్య – పార్వతీవరా!
॥పర॥



# 106. శివ హారతి

**ఐచ్ఛికరీతి - కళ్యాణిరాగం - రూపకతాళం**

ప॥ శంభోగిరిజాసమేత! చంద్రశేఖరా! హర!హర!హర! ॥శం॥

అ॥ సాంబ! సదాశివ! నీరాజనమిదె గొనుమోగంగాధర! ॥శం॥

**మిశ్ర॥ ఆశ్రితపావనచరణ! అవ్యయ! నాగాభరణ!**
**నిశ్రేయస పదవితరణ! నిరుపమగుణ! భవశోషణ! ॥శం॥**

1. వామదేవ! మహాదేవ! రామచంద్రపూజిత భవ!
శ్రీమహేశ! కామనాశ! శివ! మంగళవేష! ఈశ! ॥శం॥

**మిశ్ర॥ ఓ! పరమేశ్వర! నీదయజూపుము నాచాద్రినిలయ!**
**శ్రీపతి విఠలనిర్మితగోపురస్థ! విశ్వనుత ॥శం॥**



# 107. శివ హారతి

**ఆదితాళం - నీరాజనార్చనా - అనుమాదిరి**

ప॥ రావయ్య! శంకరా! రసాకార! సుందరా!
సేవింతు నీచరణాల - శివా! దీపకాంతులా ॥రా॥

చ॥ భవా! భావనావిహారా! భవాతీతవైభవా!
భవాధార! వేదసారా! భవానీమనోహరా! ॥రా॥

2. మదీయాంతరంగమైన - హృదాకాశవీధిలోన!
చిదానంద మందిరాన - సదా వెల్గు నందియానా ॥రా॥

3. ప్రభో! విశ్వనాథ ప్రేమా - స్పదా! శంభుదేవా!
నభో భాసురా! వరగంటి - నగాధీశ్వరా! హరా! ॥రా॥



# 108. శివ హారతి

**కళ్యాణ వసంతరాగం - జంపెతాళం**

ప॥ నీరాజనము - భవా - నీ శంకరా! ॥నీ॥

అ॥ శ్రీరాజశేఖరా! సిద్ధేశ్వరా! ॥నీ॥

చ॥ ఓ! పన్నగాభరణ! - ఆపన్న జనశరణ!
కాపాడు మాదరణ - కైవల్య వితరణ!
చూపుమా నీ కరుణ - మాపైన భయహరణ!
శ్రీపార్వతీ రమణ! - సిద్ధగిరి - శ్రీచరణ! ॥నీ॥

2. శ్రీకంఠ! శతరుద్ర - సేవకుల్ పూజింప
లోకేశ! నీ భక్త - లోకమ్ము సేవింప
యే కారణములేని - నీ కరుణలో ముంప
రాకాధిపాననా! రావయ్య! తిలకింప ॥నీ॥

3. కొడువటూరన్ జేరి - గుహలోన నలరారి
విడనాడ బోకుమా - విశ్వేశు వేసారి
అడుగులకు సాష్టాంగ - పడుదు మంగళకారి!
తడవు సేయక రమ్ము - దైవమా! మదనారి! ॥నీ॥

# 109. శివ హారతి

**కానడరాగం - ఆదితాళం**

**(ఉపవీతము శ్రీరామచంద్ర - అనుమాదిరి)**

ప॥ నీలకంధరా! నీరాజనమ్మో ॥నీ॥

అ॥ బాలచంద్రమౌళీ! నాపై - ప్రేమతోడ గొనుము ॥నీ॥

చ॥ కాలకాల! జాలమేల యేల? ద
యాలవాల! శివ! సర్వమంగళా-
లోల! నాగమయ మాలికాభరణ-
జాల కలిత - ధవళగాత్ర! త్రినేత్ర! ॥నీ॥

2. దారిలేని సంసార వనమ్మున
దారి తెలియకున్న నన్ను కూరిమి
చేర బిలచి బ్రోవకున్న నెవ్వరు-
లేరు వేరు - పురహర! పరాత్పర! ॥నీ॥

3. చనువుమీర - జగదేక పురమ్మున
హనుమద్రూపముతోడ వెలసితివి
అనయము హర! విశ్వనాథు మొరలను
కనికరమున - మన మలరగ వినుము ॥నీ॥

# 110. శివ హారతి

**చక్రవాక రాగం - జంపెతాళం**

**(ఏడుకొండలవాడ వెంకటారమణ - అనుమాదిరి)**

ప॥ మేలు నీకగు దీప - మాల గైకొనుమా ॥మే॥

అ॥ ఫాలలోచన! మాపై - చాల కృపతోడ

చ॥ కరివేల్పుడా కన్ను గలకొప్పునిండ
బరగు నామినువాక - ప్రవహించుచుండ
అరమేను గైకొన్న - గిరితనయ తోడ
అరుదెంచుమా జూడ - హర! నిన్ను బొగడ ॥మే॥

2. గౌరుమోము గలాడు - గణముతో గొలువ
ఆరుమోముల సామి - అరసి దరి నిలువ
కారు నాగులె సొమ్ము - గా మేన మలువ
చేరి మము బ్రోవుమా - కోరి నిను బిలువ ॥మే॥

3. హేయమౌ సంసార - మాయలో జనుల
నేల ముంచెదవయ్య - యిల? కాల కాల!
డాయుమా విశ్వేశు! దయజూపి చాల
సాయమ్ముగా శివ! సాధుజన (కు-శాయిపుర) పాల ॥మే॥

# 111. శివ హారతి

**జంపెతాళం**

**(కహోc!జారహోహై - అనుమూదిరి)**


ప॥ శివా! మంగళమ్ము - శివాలోల! కొనుము ॥శివ॥

అ॥ భవా! సర్వదా మమ్ము - పాలింపరమ్ము ॥శి॥

చ॥ అహో! నీదు మాయా - భవాంభోధి మునిగి
అహో రాత్రముల్ పాపి - నై అర్చుచుంటి
సహాయమ్ము నీవే - మహాదేవ! శంభో! ॥శి॥

2. ప్రభో! నిర్వికార! పరానంద పూర!
విభో! ప్రేమకాసార! వేదాంతసార!
శుభాసార! కర్పూర - శోభాశరీర! ॥శి॥

3. నమో వ్యోమకేశా! నమో నాగభూషా!
నమో యీశ్వరా! విశ్వ-నాథార్తి నాశ!
నభో రూప! కైలాస - (శ్రీబౌద్ధ) నగరజన పోషా!! ॥శి॥



# 112. శివ హారతి

**సామరాగం - రూపకతాళం**

**(సామగానలోలా - అనుమాదిరి)**

ప॥ తే - దదామి - మంగళమ్ -
సాదరం - గృహాణ - శంభో! శివ! ॥తే॥

అ॥ హే! దయామయా! భ్రమరాం - బాధవా! భవా - శ్రీగిరీశ!
॥తే॥

చ॥ అంగజమదహర! సుందర!
భృంగి వినుత! రససాగర!
గంగావర! హర! శశిధర!
మంగళదాయక! శంకర! ॥తే॥

2. అగణిత ఫణిమణి భూషణ!
నిగమరూప - సంభాషణ!
సగుణభక్త గణ పోషణ!
సగణ! సుగుణగణ! నిర్గుణ!! ॥తే॥

3. తావక - దర్శన హీనం -
కేవల కర్మాధీనమ్ ।
సేవక మితి విశ్వేశం -
భావయ - పాలయ - పాలయ!! ॥తే॥

# 113. శివ హారతి

**మళయమారుతరాగం - జుల్వతాళం**

**(కొండగాలివీచింది - అనువాదిరి)**

ప॥ వెండికొండ దేవరా! చండికా మనోహరా!

అ॥ నిండుప్రేమతోడ గొనుము – నీరాజనమో హరా! ॥వెం॥

చ॥ దిక్కులేని మాకు నీవె – దిక్కు నీలకంధరా!
ఒక్కసారి నీదరిశెన – మొసగుము గంగాధరా! ॥వెం॥

2. మారెడాకులొసగిన – మై – మరతువయ్య! పురహరా!
మాయలవిడనాడి మమ్ము–మరువకు–పరమేశ్వరా! ॥వెం॥

3. ఎవరినేమి చేసెదవో? యేమో? ధవళసుందరా!
శివ!శివ! నీ లీలలన్ని – చిత్రము జగదీశ్వరా! ॥వెం॥

4. తూపురాణి పురవిహార! కోపమేల? శశిధరా!
దాపుజేరి – విశ్వముపై – చూపుము దయ – శంకరా!
॥వెం॥

# 114. శివ హారతి

**ఆదితాళం**

**(కాకమ్మ పాడింది - అనుమాదిరి)**


ప॥ గంగాధరా! హరా! మంగళమ్మురా!
గౌరీమనోహరా! చేకొమ్మురా ॥గం॥

అ॥ ఎక్కడున్నావయ్యా! ముక్కంటిదేవరా!
చక్కగా - మమ్ముజేర - మక్కువతో రావయ్యా! ॥గం॥

చ॥ ఆ వెండికొండపైన - హాయిగా యున్నావా!
అంతట - నిండియుండి - అలరారుచున్నావా! ॥గం॥

2. తోలు పుట్టముగట్టి - కేల శూలముబట్టి
లీలగా లోకాలన్ని - యేలుదువు కనిపెట్టి ॥గం॥

3. ఎంత వేడినగాని - సుంతైన దయరాద?
పంతమా? నీ విశ్వేశుని - బాధమాన్పుము తండ్రి! ॥గం॥



# 115. శివ హారతి

(ఆదితాళం )

(కృష్ణంకలయసఖి - అనువాదిరి)

ప॥ సమాకలయ - శుభ - మంగళం - శివ!

అ॥ ఉమాసహిత! తవ - నమోஉస్తు శంకర! ॥స॥

చ॥ భవా! సకల - వైభవా! స్వనుతి - శృతి
రవా! భవానీ - ధవా! సదాశివ! ॥స॥

2. జటా మకుట! దిక్‌పటా! ప్రమథగణ
భటా! లసిత కటి - తటా! నటా! శివ! ॥స॥

3. హరా! త్రిపుర - సంహరా! రజితగిరి
వరాలయా! శశికళాధరా! శివ! ॥స॥

4. సదా భజే తవ - పదాబ్జయుగళమ్
ముదా - విశ్వనుత పదే పదే శివ! ॥స॥



# 116. శివ హారతి

## ఐచ్ఛికము

ప॥ మంగళమో శంకరా! మా గతి నీవే హరా! ॥మం॥

అ॥ శివ!శివ! నీ లీలలన్ని - చిత్రము జగదీశ్వరా! ॥మం॥

చ॥ ఎద్దుపైన నీ సవారి - గద్దపైననేమో హరి!
ఇద్దరిద్దరిద్దరైన - యిద్దరు వకటేనయా! ॥మం॥

2. చిట్టెడన్ని నీళ్లుబోసి - చిమ్మెడు బూడిదబూసి
పట్టెడంత మారెడాకు - బెట్టిన సంతోషింతువు ॥మం॥

3. నీ వేషమ మంగళము - నిను గాంచిన మంగళము
నిరతము నీ నామస్మరణ - నిఖిల జగన్మంగళము ॥మం॥

4. కనులకు గనిపించవు -మానసమున కందవు
కనులుమూసిపరికించిన - కణకణమున వెలుగుదువు
॥మం॥

5 పాండురంగ రూపముతో -భాసిలుమా-విశ్వమందు!
చండికమ్మ రుక్మిణిగా - సకలజనులకౌ పసందు ॥మం।

# 117. కీర్తన

**ఉమాభరణం రాగం - ఆదితాళం**

ప॥ ఉమాభరణం! శరణం ప్రజామి! ॥ఉమా॥

అ॥ కుమార జనకం! – నాగభూషణమ్ ॥ఉమా॥

చ॥ సామవేద గానామృత లోలం!
సచ్చిదానంద రూపం – పరశివమ్! ॥ఉమా॥

**మి॥ పాశుపత భక్త – రక్షణ దక్షం**
**పంచాక్షర – మంత్రాధి దైవతమ్!**
**పార్థివ లింగార్చన సంతోషం**
**పంచముఖం – పరమేశ్వరం! – హరమ్!** ॥ఉమా॥

2. ఖండేందు ధరం – చండికేశ్వరమ్!
ధుంఢి వినాయక – తాండవ ప్రియమ్! ॥ఉమా॥

**మి॥ పుండరీక వరద ప్రతిరూపం**
**చండ దీప్తి ప్రజ్వలిత త్రిశూలమ్!**
**ఢం ఢం ఢమరు నినాద వినోదం**
**పాండురంగ దివ్యాశ్రమ నిలయమ్!** ॥ఉమా॥

3. భస్మోద్ధూళిత భవ్య శరీరమ్!
పావన గంగాలయ కచభారమ్! ॥ఉమా॥

**మి॥ సుస్మిత సురుచిర సుందర వదనం**
**భస్మీకృత మదన త్రిలోచనమ్!**
**విస్మయకర బహు విశ్వ విలాసం**
**విశ్వనాథ – రాజేశ్వర వినుతమ్!** ॥ఉమా॥

సృష్టిలోగల ప్రతి వస్తువు విలువైనదే.

ఎంత చిన్న వస్తువైనా సరే, అవసరం వచ్చినప్పుడే

దాని విలువ తెలుస్తుంది.

వహీ హోతాహై, జో భగవాన్ చాహ్‌తా హై.

ఆచరణలేని గ్రంథజ్ఞానం వ్యర్థం.

సంసారసాగరమును దాటి శ్రీస్వామివారిని చేరుటకు

నామస్మరణయే నావ.

సంసారములో నరుడు ఉండవలయును. కాని, నరునిలో

సంసారము ఉండరాదు. హరి ఉండవలయును.


దేహపోషణకై ఎక్కువ ఆశపడకుడు, రుచికై తినకుడు,

ఆకలికై భుజింపుడు.

భావానంద                                                    రాధాకృష్ణ

# మంగళ మంజరి

# శ్రీ దేవి హారతులు



రచయిత :

మహాత్మ శ్రీ అప్పాల విశ్వనాథశర్మ

# 118. శ్రీ సరస్వతీ దేవి హారతి

**(ఐచ్ఛికము )**

**సరస్వతిరాగం - ఆదితాళం**

ప॥ నీరాజనము గొనుము వాణీ! వీణాపాణీ! ॥నీ॥

అ॥ తీరికతో కనికరాన - బిరాన - వరాల జననీ! ॥నీ॥

చ॥ నీరేజదళనేత్రి! నిత్య మంగళదాత్రి!
నిరుపమ సౌందర్య - నిర్మల శుభగాత్రి!
భారము నీదే సుమ్మా! శ్రితభక్త జనయిత్రి!
సారె సారెకు నిన్ను - సన్నుతింతు - నమ్మ! భారతి! ॥నీ॥

2. జలజ సంభవురాణి! చదువుల పూబోణి!
సలలిత పదసరణి! సైకత సుశ్రోణి!
విలసిత నీలవేణీ! విమల సంభాషిణి!
కలిమల హారిణి! కావ-రమ్ము (రాజ) హంసవాహిని ॥నీ॥

3. కాటుకకనుదోయి - కరుణామృతము గురియ
పాటలాధరమందు - పసిడి నవ్వులు మెరయ
నీటైన నీ రూపు - నేత్రోత్సవము సేయ
మాటలు - విశ్వేశు - పాటలై జగాన వెలయ ॥నీ॥

# 119. శ్రీరాజరాజేశ్వరి హారతి


**హిందుస్తాన్ భైరవిరాగం - జుల్వతాళం**

**(అబ్‌తేరెశివా - అనుమాదిరి)**

ప॥ ఆనందమయీ! శ్రీలలితా! హారతి గొనుమా!
అమ్మా! నీ తనయుల - మమ్మాదరించుమా! ॥ఆ॥

చ॥ శ్రీచక్రనగర సామ్రాజ్ఞీ - త్రిపురసుందరీ!
శ్రీపంచదశీ సౌభాగ్య - రాజేశ్వరీ! రాజరాజేశ్వరీ!
నీ చరణములే గతియని మది నమ్మితిమమ్మా!
అమ్మా! అమ్మా! అమ్మా!
నీ తనయుల మమ్మాదరించుమా! ॥ఆ॥

2. సుమ సాయ కేక్షు పాశాంకుశ - శోభాకలితా!
రమణీయ రూప గుణ-సుశీల-రత్నభూషితా! శీల! రత్నభూషితా!
హిమశైలరాజ దుహితా - విశ్వేశ వందితా!
అమ్మా! అమ్మా! అమ్మా! నీతనయుల మమ్మాదరించుమా!॥ఆ॥



# 120. శ్రీరాజరాజేశ్వరి హారతి

**మాల్కోస్ రాగం - ఆదితాళం**

**(మనసే అందాల బృందావనం - అనుమాదిరి)**

ప॥ జననీ! శ్రీరాజరాజేశ్వరీ!
కొనుము - నీరాజనము - సర్వ - లోకేశ్వరీ! ॥జ॥

అ॥ మనవిని - వినుమమ్మ - మదిదయ - గనుమమ్మ!
కనరమ్మ! మాయమ్మ! కరుణామయీ! ॥జ॥

చ॥ ఒకచేత - పుండ్రేక్షు - ధనువలరగా - వే
రొకచేత - సుమబాణ - ములు మెరయగా
సకలేశి! పాశాంకు - శములీడుగా - మాన-
సములోన - నివసించు - మము బ్రోవగా! ॥జ॥

2. పంచదశీ మంత్ర - పరమేశ్వరీ! దేవి
పరలోక - సాంరాజ్ఞి! భువనేశ్వరీ!
వేంచేయుమమ్మా! త్రి - పురసుందరీ! నిన్ను
వినుతింతు - సౌభాగ్య - విద్యేశ్వరీ! ॥జ॥

3. దరిజేర్చి - నీవారి - కరుణించగా - దొంతి-
పురిలోన - నెలకొన్న - వరదాయినీ!
మరువకు మమ్మా! మాయాధీశ్వరీ! నీ
మదిలోన -విశ్వేశు - లలితాంబికా! ॥జ॥

# 121. శ్రీ లలితాంబా హారతి

(ఉపకార గుణాలయవైరీ - అనుమాదిరి)

ప॥ కరుణామయి! శ్రీలలితా!
వర మంగళమో – మాతా! ॥క॥

అ॥ శరణాగత భరణా! నీ – చరణములకిదే జోత ॥క॥

చ॥ భరముగా నీ – జలధిన్ –
బడి మునుంగ నీ సుతులన్
దరికిజేర్చు భారము నీ –
దగు గదమ్మ వేరెవరే ॥క॥

2. నాదు హృదయ పంకజమున –
నంద నందనా కృతితో
ఊదుచు మురళిన్ పాయక –
నుండుము దేవీ దయతో ॥క॥

3. నీవే మా గతివి సుమా –
ఈ విశ్వము మొరవినుమా!
భావము నీవైనిలు – మా –
పాలిటి కల్పద్రుమమా! ॥క॥

# 122. సంతోషిమాతృ హారతి

**కానడరాగం - ఆదితాళం**

**(జననీ శివకామినీ - అనువాదిరి)**

ప॥ జననీ! నీరాజనమ్ ॥జ॥

అ॥ గణపతి మానస - తనయా దేవీ! ॥జ॥

చ॥ అనయము నిన్నే - ఆరాధించిన
మనుజులు హాయిగ - మనగలరమ్మా!
తనయులమమ్మా - దయగనరమ్మా!
మనవిని వినుమా - మాతా! సంతోషీ!! ॥జ॥

2. కొలచిన వారికి - కోటి వరాలు -
తలచిన వారికి- కలుగు సుఖాలు
పిలచిన వారల - పెన్నిధివమ్మా -
మలయజధారిణి - మాతా! సంతోషీ!! ॥జ॥

3. కేలన్ ఖడ్గము శూ -లముదాల్చి -
లీలగ విశ్వము - నేలెడు తల్లీ!
జాలమువీడి - జాలిని గూడి -
మాలో వెలుగుము - మాతా ! సంతోషీ!! ॥జ॥

# 123. శ్రీ యశోదామాతృ హారతి

**తోడిరాగం - ఆదితాళం**

**(నీరాజనమిదె గొనుమోదేవా - అనుమాదిరి)**

ప॥ నీరాజనము - యశోదామాతా!

నీకిడుదుము జోతా -నీవే మాయూత! శుభ ॥నీ॥

చ॥ తారగోళమున - స్వామిగ - హరినే -

ధ్యానించెడు హృదయోపేతా

శౌరి మహాలీలావేశమ్మున -

మీరెడు మంగళమయ మాతా! ॥నీ॥

2\. అమ్మా! యని పిల్చెడు వాని -

ఆత్మ పదమ్మున - జేర్తునని

ముమ్మరముగ - శపథమ్మును బూని -

ముదమొన గూర్చితివో జనని! ॥నీ॥

3\. భూత ప్రేమోల్లాసినీ ।

పుణ్యఖనీ ! సువాసినీ !

స్వాతంత్ర్యమ్మే - లేని మముగని

స్వపదమ్మున - జేర్చుము జనని! ॥నీ॥

## 124. శ్రీ యశోదామాతృ హారతి

**రచయిత : గౌరీభట్ల రఘురామశాస్త్రి**

**మాండురాగం - ఆదితాళం**

**(సావిరహే తవదీనా - అనుమాదిరి)**

ప॥ మంగళమమ్మ యశోదాదేవీ! మంగళమమ్మ యశోదా॥మం॥

అ॥ చెంగట జేరగ –చింతిలు సూనుల –
చేర్చుకొనుము – జయదేవీ! ॥మం॥

చ॥ ప్రణవ – వలయమున – స్వామియె – శ్యాముడై –
భవ్యవేణు – శుభపాణీ!
త్రిణవ భంగ – సుశరీరుడు నీయెడ –
దీపించు నమృతవాణీ! ॥మం॥

2. నిత్యము – స్వామ్యనపాయము గోరగ
నీకిడెనట – పదయుగళి ।
ప్రత్యక్షముగ – ప్రభువని – నిలచితి –
స్వాశ్రమమున – నీ సరళి ॥మం॥

3. రఘురామున్ నను – గన బ్రతిమాలగ
రమ్మ భయమ్మిడ వమ్మా!
అఘముల బాపుచు – ఆశ్రమవాసిని –
ఆత్మీయుల గను గొమ్మా! ॥మం॥

# 125. శ్రీ దేవి హారతి

**రచయిత : విశాల చంద్రమౌళి శాస్త్రిగారు**

**బింప్లాస్ రాగం - ఆదితాళం**

ప॥ శుభ మంగళమే రమే! ॥శు॥

అ॥ అభయేంబ దిశామ్యుమే!

చ॥ అభిదే తవకా ఇమే
నభిధే వయ మప్రమే ।
సభవేహి శివే ప్రమే
యభయే కలితోపమే ॥ ॥శు॥

2. సదయే సుదృగాస్పదం
హృదయే కలయే పదమ్ ।
సదయే దళితా పదం
ముదయే దిశమే ముదమ్ ॥ ॥శు॥

3. ఇంద్రితేనకి మున్వహం
త్వాం ధృవం సదయాగృహమ్ ।
చంద్రమౌళి మనో న్వహం
సాంద్రమోహ తమోపహమ్ ॥ ॥శు॥

4. చండికే రమసేఽశ్రమే
పాండురంగ మహాశ్రమే ।
దండితా సుర తాక్రమే
పండితాఽవన విక్రమే ॥ ॥శు॥

# 126. శ్రీ దేవి హారతి

**రచయిత : గౌరీభట్ల రఘురామశాస్త్రి**

**బిలహరి రాగం - ఆదితాళం**

ప॥ పంచదశీ మను రాజ శోభితే!
పంచశక్తి మయీ! శ్రీలలితే! ॥పంచ॥

అ॥ అంచిత మంగళ తేజోవళితే!
అఖిలాత్మక శ్రీచక్రమండితే! ॥పంచ॥

1. బిందు మీశ్వరం కోణత్రితయం
ఇందు కిరీటా మితి మత్వానయమ్ ।
బిందు తర్పణ పరాణాం హృదయం
విందసి దిశసి సదా పదమభయమ్ ॥ ॥పంచ॥

2. శ్రీచక్రం భువనం తవ భవనం
యాచక కళ్యాణ వితరణ సదయమ్ ।
హే చిన్మయీ! తదానంది నయనం
యాచే పాతయమయి పూర్ణ కరుణమ్ ॥ ॥పంచ॥

3. ఆశ్రమ విరచిత పద్మాలయ గతె
ఆశ్రయేంబ! విశ్వేశ్వర సంశ్రితె ।
నిఃశ్రేయ సదే రఘురామ వినుతే
స్వాశ్రిత విశ్రాంతి దాతృ పదయుతే ॥ ॥పంచ॥

భావానంద రాధాకృష్ణ

# మంగళ మంజరి

# వివిధములు



రచయిత :

**మహాత్మ శ్రీ అప్పాల విశ్వనాథశర్మ**

# 127. శ్రీ సత్యనారాయణ హారతి

**రచయిత : రాళ్ళబండి రాఘవశాస్త్రిగారు**

**హిందుస్తాన్ రాగం - జుల్వతాళం**

**(అబ్‌తేరెశివా - అనుమాదిరి)**

ప॥ జయహారతి సత్యవ్రత నారాయణ దేవా!
వరదా! రమానాయక! కృపతో గైకోవా! ॥జ॥

చ॥ కడుపేదయైన బాపని పాలించినావయా!
ఖగగామీ! కట్టెలమ్మువాని గాచినావయా!
ఓ శ్యామ! శుభాకార! మాకు సంపదలీవా!
వరదా! వరదా! వరదా! రమానాయక! కృపతోగైకోవా!॥జ॥

2. సంతాన మొసగి మొకవర్తకు దనపితివంటా
అజ్ఞానముచే నిను మరచిన నలపితి వంటా
నిను మానక సేవింపగల్గు భాగ్యము నీవా!
వరదా! వరదా! వరదా! రమానాయక! కృపతోగైకోవా!॥జ॥

3. నీ ప్రసాద మహిమ తుంగధ్వజు జనపతి ఎరుగన్
నీ యాదరమున నఖిల జనులు హాయిని బరుగున్
నీ పాద సేవ విశ్వములో భక్తుల కీవా!
వరదా! వరదా! వరదా! రమానాయక! కృపతోగైకోవా!॥జ॥

# 128. శ్రీ వివేకానంద స్వామి హారతి

(ప్రభూ! నాస్వామి శ్రీకృష్ణ - అనుమాదిరి)

ప॥ వివేకా - నంద యతివర్యా!

వినుము - నీరాజనము - సదయా! ॥వి॥

అ॥ భవాంబుధి - దాటలేమయ్యా!

భవ్య సం - దేశ మిడుమయ్యా! ॥వి॥

చ॥ పరమ సంతోషమున బిలచి -

తరింపన్ - దారిజూపించి

పరానందా మృతము నించి -

నరుల ప్రేమింతు వలరించి ॥వి॥

2. నరేంద్రా! నీదుబోధనలే -

వరాలై - దేశమున వెలసే

స్థిరముగా - ముందు నిల్చుటకు

బరాబరి లేరు నీకెవరు ॥వి॥


3. చెలిమితో - రామకృష్ణ కృపా -

జలధిలో - విశ్వమును ముంచి

నిలుపుమా - పూర్ణుగావించి -

తలపుమా - బ్రోవ - దయయుంచి ॥వి॥

# 129. శ్రీసాయిబాబా హారతి



(సీతారామచంద్రాయ - అనుమాదిరి)

ప॥ శ్రీ సాయినాథాయ – చింతకాభీష్టదాయ
చిదానంద రూపాయ! సదా మంగళమ్
॥భవతు॥శ్రీసాయి॥

2 సాధుమార్గ దర్శకాయ – సత్య తత్త్వ బోధకాయ
సాధకజన పోషకాయ! సకల మంగళమ్
॥భవతు॥శ్రీసాయి॥

3 ఇహపర సుఖదాయకాయ! మహితజ్ఞాన వైభవాయ!
సహజ కాంతి రూప ప్రేమ! సహిత మంగళమ్
॥భవతు॥శ్రీసాయి॥

4 నామరూప రహిత పరంధామ నిత్యవాసాయ!
కామశూన్య దివ్య భావ కలిత మంగళమ్
॥భవతు॥శ్రీసాయి॥

5 ధర్మ రక్షకాయ! సౌఖ్యదాయ! భక్త శరణ్యాయ!
దాసవిశ్వనాథ సన్నుతాయ! మంగళమ్
॥భవతు॥శ్రీసాయి॥

# 130. కీర్తన

**భీంప్లాస్ రాగం - ఆదితాళం**

**(ఓనా - అనుమాదిరి)**

పll నరుడా! హరిని భజించుమురా! llనll

చll హరి నామమె – నీ – కాధారమురా
నరకపు బాధల – గురి గాకుమురా
సారము లేనిది – సంసారమురా –
మరణము తప్పదు – మరువకురా! llనll

2. నమ్మినవారికి – నాశములేదుర
నమ్మకపోతివా – చెడిపోదువురా!
నెమ్మదిలో శ్రీ – రాధానాథుని –
నిరతము – కాంచుము – మరువకురా! llనll

3. నేనని – నాదని భ్రమనొందకురా –
నీవారెవ్వరు – నీతో రారురా ।
నీ వాడొకడే – యీ విశ్వములో
దేవుడు – కలడని – మరువకురా! llనll

# 131. నాచాద్రి శ్రీ నరసింహస్వామి కీర్తన

(గోవింద! హరి! - అనుమోదిరి)

ప॥ వందనమో నృహరీ! నాచాద్రి హరీ! ॥వంద॥

అ.ప. సుందరపద! గిరి - మందిర శౌరీ!
ఉందుము నినుజేరి - నాచాద్రిహరీ! ॥వంద॥

చ. 1. మాధవ! నిన్నే - మాటికి బిలచిన
మౌనము విడవేమి? - నాచాద్రిహరీ! ॥వంద॥

2. నీవే గతియని - నిను నమ్మితిమి
నిరతము లక్ష్మీపతి! - నాచాద్రిహరీ! ॥వంద॥

3. నీ విశ్వేశుని - భావాలయమున
నిలుము దయాజలధి - నాచాద్రిహరీ! ॥వంద॥



# 132. నాచగిరి నృసింహస్వామి కీర్తన

(యహసానుతేరా... అనుమాదిరి)

ప॥ శ్రీనాచశైల - లక్ష్మీనృహరీ! నిను
సేవింతుము సం-తతము హరీ! ॥శ్రీ॥

అ.ప. శ్రితజనపాలక - చింతామణీ!
చిరముండుము - మా - లో నలరి ॥శ్రీ॥

1. అంతటనుందువు - అగుపడవేమి?
యెంతో యెంతో - వెదకితిమి ।
సుంతయు దయ రాదేలనయా!
చింతకవరదా! శ్రీనిలయా! ॥శ్రీ॥

2. కనకకశ్యపుని - కడతేర్చితివి
కరుణతోడ - ప్రహ్లాదు గాచితివి ।
మనవిని వినుమా! మము గనుమా!
తనయుల కన్నెడ - సేయకుమా! ॥శ్రీ॥

3. నీవు రచించిన - యీ విశ్వములో
నీవే గతియని - నమ్మితిమి ।
జీవుల చెంతకు - చేకొనుమా!
నీ విశ్వేశుని - మొర వినుమా! ॥శ్రీ॥

# 133. లాలిపాట

**కాఫీరాగం - ఆదితాళం**

ప॥ లాలీ వనమాలీ! మదాళీ – విలోలాలక ॥లా॥

అ॥ లీలా కలితా జాండ – సమాలోకన ఖేలా! జయ! ॥లా॥

చ॥ చిన్ని కొడుకన్నా ప్రియ – మెన్నుకొని నిన్నెప్పుడు
చెన్నార యశోదా – గనుగొన్న పున్నె మెన్నందగు ॥లా॥

2. బూటకపు బూచియని – బోటులను మాటమది
నాటెనని యాటాడవో – మాటాడవో దీటుగను ॥లా॥

3. పలుకులను దివ్యామృత – మొలుకురా చిలుకనుడి
కులికెదవో తలకెదవో – కలకమొయి పులకరించు ॥లా॥

4. వాదా? నిద్ర రాదాయన – మోదమ్మున నల్దిక్కుల
బోదారుదు రాధాయిదె – నీ దాపున రాధాప్రియ! ॥లా॥

5. శ్రీపాండురంగాశ్రమ – శ్రీపాద సుఖాపాదక!
తాపాపహ! మా పాలిటి – గోపాలక! గోపీప్రియ! ॥లా॥



# 134. లాలిపాట

**మోహనరాగం - ఆదితాళం**

ప॥ లాలీ గోప బాలా! లీలా మాత్ర శీలా!
లాలీ భక్తలోలా! నీలాకార బాలా! ॥లాలీ॥

చ॥ హ్లాదిని దివ్యకళలో - హర్షము బొరల నీలో
నీ దరహాస ముఖము - నిరతము జూపు మెదలో ॥లా॥

2. మానస గోకులమున - మానిని వృత్తి కలన
ఆనందింపు మెద నా - ప్రేమానంద భాన! ॥లా॥

3. కమ్మని వెన్న గోరి - కన్మొరగన్ దలపరా?
నమ్మిన హృదయ ప్రేమ - నవనీతము గొనవా? ॥లా॥

4. యమునా కూల మహిమ - ఆశ్రమ పుణ్య సీమ
అమరన్ జేసికొనుమా - ఆర్తుల నేలుకొనుమా ॥లా॥

5. భావానంద పదము - భక్తుల పాలి ధనము
సేవక కోటికిడుము - శ్రిత రఘురాము గనుము ॥లా॥

# 135. జోలపాట

## శ్రీరాగం - దీప్తతాళం

పII జో! జో! దయాపాంగ! జో! పాండురంగా!
జో! జో! జితానంద! సుమ కోమలాంగా! జో! జో! IIజోII

చII పదినూర్ల పడగల - పాప నీ సెజ్జ
పద్మావతీదేవి - పాదముల పజ్జ
సదసచ్చరాచర - జగము నీ బొజ్జ
నొదిగి యిందుండుమా! యొజ్జలకు నొజ్జ! జో! జో! IIజోII

2. పూల డోలిక నీకు - పొత్తిగావించి
బాల భావమున నీ - ప్రకృతి నందుంచి
జోల బాడుచు కేల - డోలగదలించి
నాలోన నేన - యానందింతు మించి! జో! జో! IIజోII

3. అమరు నీ నెలవు - భావానందదమ్ము
రమణీయ శ్రీపాండు - రంగాశ్రమమ్ము
తమము బోద్రోలి - విశ్రాంతి మోదమ్ము
కమలాక్ష! రుక్మిణీ - కాంత! మాకిమ్ము! జో!జో! IIజోII

# 136. జోలపాట

**పూరి కళ్యాణి రాగం - జంపెతాళం**

ప॥ జో! జో! చిదానంద సుందర శరీరా!
జో! జో! యశోదా కిశోర యదువీరా! ॥జోజో॥

అ॥ స్వామీ! మహాభావ సరస శుభ డోల
ప్రేమమై పవళించు ప్రియ కళలు దేల ॥జోజో॥

చ॥ నీ పరమ వృత్తులే నిజము గన్గొనగా
గోప గోపికలు చిద్రూపు నిను గనగా
నీ పాద నఖరుచుల నెమ్మినే నడుగా
ఓపి దాస్యమ్మొసగ నుల్లసిలు వడిగా ॥జోజో॥

2. కామ గంధములేక కమనీయమైన
శ్యామ చిత్ప్రేమ రాసక్రీడలోన
ఏమి యలసితివొ శ్రీకృష్ణ! యిపుడైన
ఈ మనోడోల నిదురింపు మాలోన ॥జోజో॥

3. ఆశ్రమోల్లసిత భావానంద లీలా!
విశ్రమింపుము భావ విమలకుంజముల
ఆశ్రయమీ్మవ నన్యాశ్రితుల నేల
ఆశ్రితుని రఘురాము నాదుకొను శ్రీలా! ॥జోజో॥

# 137. మేలుకొలుపు

**రేగుప్తి రాగం - ఏకతాళం**

ప॥ శ్రీనివాస! ముకుంద!
మురళీ గానలోల! భవాబ్ధితారక!
దీనబంధో! దివ్యవైభవ!
మాననీయహరే! కృష్ణా! మేలుకో! ॥శ్రీ॥


చ॥ సొమ్మసిల్లిన జీవకోటుల -
గ్రమ్ముకొన్నది - చిమ్మచీకటి
మిమ్ము దలచిన విచ్చుచున్నది -
మేలుకొనవయ్యా! కృష్ణా! మేలుకో! ॥శ్రీ॥

2. అంతరంగ విలాసములలో
ఆరితేరి సుఖింతు వెల్లపు
డాంతరంగిక దాసదాసుల
నాదుకొనుమయ్యా! కృష్ణా! మేలుకో! ॥శ్రీ॥

3. మల్లెతావుల తోడ చల్లని -
పిల్లగాడుపులుల్లసిల్లుచు
ఎల్లెడల నీ తేజమగుపడ -
కొల్లగొనునయ్యా! కృష్ణా! మేలుకో! ॥శ్రీ॥

4 జాలిగల్గిన ఏలికవు నీ -
పాలబడి మను జీవజాలము!
మేలమాడక జోలివీడక -
యేలుకొనుమయ్యా! కృష్ణా! మేలుకో! ॥శ్రీ॥

5 పాండురంగాశ్రమ నిశాంతము-
భక్తహృదయతమోనిశాంతము
మెండుకొనగా నిండు కొలువున -
మేలుకొనుమయ్యా! కృష్ణా! మేలుకో! ॥శ్రీ॥



# 138. మేలుకొలుపు

**భూపాలరాగం - జంపెతాళం**

ప॥ మేలుకో గోపాల! మేలుకో యదుబాల!
లీలా సుధన్‌జిల్క లెమ్ము మమ్మేలుకో! ॥మేలు॥

అ॥ వాసనా శృంఖలా బద్ధ గో జీవులము–
నీ సమాగతిగోరి నిలచితిమి తొలిజాము ॥మేలు॥

చ॥ లీనమై యమృతమున లేచె బుధ హృదయాలు
ఆనంద సుధ గ్రోల నరసె నీ జాడలు
కాన చిన్మయ నీల కమనీయ! నీ కళలు
ఆదుకొన కరుణించు మంతె ఆత్మకు మేలు ॥మేలు॥

2. బృందావనమ్ము నీ కానంద నిలయమ్ము
అందు నీ రాక పోకలుగదా నిత్యమ్ము
ఐందవీ దరహాస! అట్టి బృందావనము
డెందమే యయ్యె క్రీడింపరా లే! లెమ్ము! ॥మేలు॥

3. భావమ్ము లేదేని బ్రహ్మపదమున్ గనవు
భావమున నానంద పదము గనుమని నీవు
దేవ! భావానంద దివ్యావతారుడవు
నీ విభవమును సాట నీవే ప్రవీణుడవు! ॥మేలు॥

# 139. మేలుకొలుపు

**కాఫీరాగం - ఆదితాళం**

ప॥ లేవయ్యా! కృష్ణయ్యా! ॥లే॥

అ॥ ఓ! వాసుదేవా! లేవయ్యా! తెల్లెలవారే ॥లే॥

చ॥ నను నేను నిను నీవు - మననే మరచి పోవ!
నను గాంచి నిను గాంచి - జనులేమియనుకొందురొ ॥లే॥

2 తులలేని తలపూని - యలపేమి? సొలపేమి?
పలు గోర్వంకలు మేలు - కొలుపుచున్నవి చాలు ॥లే॥

3 రాధా ప్రియోద్బోధ రమణీయ సరణి - ప్ర
బోధాగేయముబాడు - సాధుల గాపాడు! ॥లే॥



# 140. నాచగిరి నరసింహస్వామి మేలుకొలుపు

ప॥ మేలుకో! నరసింహదేవ! మేలుకో! కరుణాస్వభావ!
మేలుకొని భక్తాళిబిలువ - మేలుకోవయ్యా!
స్వామీ! మేలుకోవయ్యా!! ॥మే॥

1. నిన్ను దలచినదే ప్రభాతము -
నిజముగా నది సుప్రభాతము
కన్నతండ్రీ! నిన్నుగాంతుము -
కదలిరావయ్యా! స్వామీ! మేలుకోవయ్యా! ॥మే॥

2. అందముగ నాచాద్రిగుహలో -
ఆదిశేషుని పాన్పుపైన
హాయిగా సిరిపదములొత్తగ -
అలరు పరమాత్మా!
స్వామీ! మేలుకోవయ్యా! ॥మే॥

3. తెల్లవారెను తూర్పుదిక్కున -
అల్లనల్లన వెలుగుదోచెను
చల్లగా శృతిరవము ద్విజతతి -
సలిపె వినుమయ్యా! స్వామీ! మేలుకోవయ్యా! ॥మే॥

4. ముదము గొలిపే విశ్వనాథుని -
ముద్దుమాటలు - తేనెమూటలు
సదయహృదయా! ప్రేమతో విని -
నిదుర విడుమయ్యా! స్వామీ! మేలుకోవయ్యా! ॥మే॥

# 141. మంగళమ్

**భూపాలరాగం - ఏకతాళం**

మంగళం తవాస్తు మేస్తు - మాస్త్వ మంగళం సదా
మంగళాంగ! సర్వదాస్తు - మర్త్యలోక మంగళమ్ ।
మంగళాధిదేవతా! - సమక్ష వక్ష! చిద్ఘన!
మంగళం గృహాణ - దేహి - మంగళాతిమంగళమ్ ॥

❖ ❖ ❖


1. మంగళం కృష్ణచంద్రాయ - పూర్ణబ్రహ్మ స్వరూపిణే ।
రాసలీలా విలాసాయ - రాధాకృష్ణాయ మంగళమ్ ॥

2. మంగళం భక్తిసామ్రాజ్య - చక్రవర్తి మహాత్మనే ।
భావానందస్వరూపాయ - రాధాకృష్ణాయ మంగళమ్ ॥

3. బృందావన ప్రతీకాశ - పాండురంగాశ్రమాధిప ।
యశోదానందబాలాయ - రాధాకృష్ణాయ మంగళమ్ ॥

**॥ సర్వం శ్రీరుక్మిణీ పాండురంగ స్వామి**
**చరణారవిందార్పణమస్తు॥**
**॥మంగళం మహత్॥**

# 142. శ్రీపాండురంగాష్టకమ్



మహాయోగపీఠే తటే భీమరథ్యా
వరం పుండరీకాయ దాతుం మునీంద్రైః ।
సమాగత్య తిష్ఠం త మానందకందం
పరబ్రహ్మ లింగం భజే పాండురంగమ్ ॥ 1

తటిద్వాససం నీలమేఘావభాసం
రమామందిరం సుందరం చిత్ప్రకాశమ్ ।
పరం త్విష్టకాయాం సమన్యస్తపాదం
పరబ్రహ్మలింగం భజే పాండురంగమ్ ॥ 2

ప్రమాణం భవాబ్ధేరిదం మామకానాం
నితంబః కరాభ్యాం ధృతో యేన తస్మాత్ ।
విధాతుర్వసత్యై ధృతో నాభికోశః
పరబ్రహ్మలింగం భజే పాండురంగమ్ ॥ 3

స్ఫురత్కౌస్తుభాలంకృతం కంఠదేశే
శ్రియా జుష్టకేయూరకం శ్రీనివాసమ్ ।
శివం శాంతమీడ్యం వరం లోకపాలం
పరబ్రహ్మలింగం భజే పాండురంగమ్ ॥ 4

శరచ్చంద్రబింబాననం చారుహాసం
లసత్కుండలాక్రాంత గండస్థలాంగమ్ ।
జపారాగబింబాధరం కంజనేత్రం
పరబ్రహ్మలింగం భజే పాండురంగమ్ ॥ 5

కిరీటోజ్జ్వలత్సర్వదిక్ప్రాంత భాగం
సురైరర్చితం దివ్యరత్నైరనర్ఘైః ।
త్రిభంగాకృతిం బర్హమాల్యావతంసం
పరబ్రహ్మలింగం భజే పాండురంగమ్ ॥ 6

విభుం వేణునాదం చరంతం దురంతం
స్వయం లీలయాగోపవేషం దధానమ్ ।
గవాం బృందకానందదం చారుహాసం
పరబ్రహ్మలింగం భజే పాండురంగమ్ ॥ 7

అజం రుక్మిణీప్రాణసంజీవనం తం
పరం ధామ కైవల్యమేకం తురీయమ్ ।
ప్రసన్నం ప్రపన్నార్తిహం దేవదేవం
పరబ్రహ్మలింగం భజే పాండురంగమ్ ॥ 8

స్తవం పాండురంగస్య వై పుణ్యదం యే
పఠంత్యేకచిత్తేన భక్త్యా చ నిత్యమ్ ।
భవాంభోనిధిం తేపి తీర్త్వాంతకాలే
హరేరాలయం శాశ్వతం ప్రాప్నువంతి ॥ 9

**॥ఇతి శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య**
**శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యవిరచితం శ్రీపాండురంగాష్టకమ్॥**

# 143. శ్రీ భావానందాష్టకమ్

శ్రీవత్సాంకిత వామాంగం మృదునీలాంగం కరుణాపాంగం
భక్త్యాలాప కలాపసముల్ల సదానందం భజనానందమ్ ।
శాంతాకార ముదార మధీర జనోద్ధారం సుజనాధారం
భావానంద యతీంద్రం మనసి భజే తంద్రం కరుణాసాంద్రమ్ ॥ 1

కాషాయాంబర దండకమండలు మండిత వేషం మృదుభాషం
మందస్మేరకళావిలసిత సన్ముఖ బింబం నిర్గతదంభమ్ ।
గ్రామే గ్రామే గేహే గేహేఽభ్యం చిత రూపం చిద్రూపం
భావానంద యతీంద్రం మనసి భజే తంద్రం కరుణాసాంద్రమ్ ॥ 2

భక్తిర్దైవ మహత్త్వాజ్ఞానయుతా ముక్తేర్మాతేతి సదా
భక్తానాం బోద్ధారం కృతపతితోద్ధారం స్మరయోద్ధారమ్ ।
మాయాతీత నిరావరణాత్మ పదారూఢం యమినాం ప్రౌఢం
భావానంద యతీంద్రం మనసి భజే తంద్రం కరుణాసాంద్రమ్ ॥ 3

ఈక్షణమాత్ర నివారిత సంశ్రిత తాపౌఘం మహిమామోఘం
దావానలసమసంసృతి దుఃస్థితి వారణ వాగమృతాసారమ్ ।
జీవోద్ధారకృతే స్వీకృత విష్ణ్వవతారం శుభదాతారం
భావానంద యతీంద్రం మనసి భజే తంద్రం కరుణాసాంద్రమ్ ॥ 4

సర్వవ్యాపక శర్మ ప్రాపక ధర్మ స్థాపక సత్త్వాకం
శ్రుత్యాపాదిత చిన్మూర్తిం కరుణాస్ఫూర్తిం పావనకీర్తిమ్ ।
భూతప్రేమ పరిప్లుతనేత్రం సుమగాత్రం చిత్సుఖమాత్రం
భావానంద యతీంద్రం మనసి భజే తంద్రం కరుణాసాంద్రమ్ ॥ 5

సంకల్పాభిముఖాఖిలసిద్ధిం సుకృతర్ధిం ప్రేమసమృద్ధిం
స్వాభావిక శాంతిమయాత్మానం హ్యసమానం సన్మహిమానమ్ ।
సత్యానంద చిదాకారం చ నిరాకారం నిరహంకారం
భావానంద యతీంద్రం మనసి భజే తంద్రం కరుణాసాంద్రమ్ ॥ 6

శ్రీకృష్ణ ప్రభు లీలాభావ విహారం భక్తి సుధాహారం
రాగద్వేషసుఖాది ద్వంద్వ గణాతీతం త్రిగుణాతీతమ్ ।
తాపత్రయహర తత్త్వామృతమయ వాగ్జాలం మృదువాచాలం
భావానంద యతీంద్రం మనసి భజే తంద్రం కరుణాసాంద్రమ్ ॥ 7

ఆదర్శాత్మక పుణ్య చరిత్రం కృతరంగాశ్రమ సత్ క్షేత్రం
విశ్వానందకర ప్రతిభావం సమభావం హనుమద్భావమ్ ।
ఈశ్వరమాత్ర సునిక్షిప్తాఖిల భారం సేవనసంభారం
భావానంద యతీంద్రం మనసి భజే తంద్రం కరుణాసాంద్రమ్ ॥ 8

భావానందస్వామిన్ భజదనుగామిన్ సంశ్రిత శుభకామిన్
భావే మమ విహరస్వ విభో! మమ భావవినోదం కుర్వాణః ।
భావానందాష్టక లక్ష్య ప్రభు భావానంద కృపాలోకాత్
భావానందాష్టక పఠితారో భవితారో భవతర్తారః ॥ 9

*॥ఇతి శ్రీ గౌరీభట్ల రఘురామశాస్త్రిణా విరచితం శ్రీభావానందాష్టకమ్॥*

శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య శమాది షడ్గుణసంపన్న
ధర్మసంస్థాపక ముముక్షు జనోద్ధారక కరుణాసముద్ర
జీవన్ముక్త సామ్రాజ్య పట్టాభిషిక్త
యతివర భావానంద భారతీ సద్గురు భగవాన్ కీ జై

# 144. శ్రీ విశ్వనాథాష్టకమ్

సదా పాండురంగాశ్రమక్షేత్రవాసం
వరం భావనానంద భావానురూపమ్ ।
హరే రామ మంత్రైక నిష్ఠాగరిష్ఠం
గురుం దేవదేవం భజే విశ్వనాథమ్ ॥ 1

సదా కృష్ణప్రేమామృతాస్వాదనాఢ్యం
ముదా రుద్రపూజాభిషేకైః ప్రసన్నమ్ ।
దయాపూర్ణసింధుం సదా విశ్వబంధుం
గురుం దేవదేవం భజే విశ్వనాథమ్ ॥ 2

శివౌ శ్రీకరౌ నాగ చక్రాఖ్యచిహ్నౌ
కరే దక్షిణే పాదపద్మే దధానమ్ ।
మహామేరుశైలాభ ధీరం గభీరం
గురుం దేవదేవం భజే విశ్వనాథమ్ ॥ 3

సదా ధర్మ కర్తవ్య నిష్ఠాగరిష్ఠం
గృహస్థాశ్రమాదర్శ వైదేహమూర్తిమ్ ।
శ్రితాభీష్టపూర్తిం సదా శాంతమూర్తిం
గురుం దేవదేవం భజే విశ్వనాథమ్ ॥ 4

పరాన్ భావనానంద సందేశవాక్యాన్
వచో భిర్మనోజ్ఞైర్జనానాం దిశంతమ్ ।
ప్రసన్నాననం చారుహాసం దయాళుం
గురుం దేవదేవం భజే విశ్వనాథమ్ ॥ 5

పరాత్మైక్యసంధాన సమ్యగ్విలాసం
సదా నిర్వికారం ఘనం సంయమీంద్రమ్ ।
అఘఘ్నం చ వ్యత్యస్త పాదాంబుజాఢ్యం
గురుం దేవదేవం భజే విశ్వనాథమ్ ॥ 6

గుణాతీతమద్వైతమానందకందం
శివం చిన్మయం నిర్వికల్పం నిరీహమ్ ।
జగద్వ్యాపకం సర్వలోకైకవంద్యం
గురుం దేవదేవం భజే విశ్వనాథమ్ ॥ 7

హృది శ్యామలాంగం హరిం భావయంతం
సదా స్వీయభారం హరౌచార్పయంతమ్ ।
ముదా రామకృష్ణేతి చిత్తే స్మరంతం
గురుం దేవదేవం భజే విశ్వనాథమ్ ॥ 8

ఇదం వేంకటాఖ్యేన గీతం సభక్త్యా
గురోర్విశ్వనాథాష్టకం యే పఠంతి ।
సదా సర్వసౌఖ్యైస్సుఖిత్వాంతకాలే
తురీయం పదం శాశ్వతం ప్రాప్నువంతి ॥ 9

*॥ఇతి శ్రీ మదునూరి వెంకటరామశర్మణా విరచితం*
*శ్రీవిశ్వనాథాష్టకమ్ ॥*

*॥తేజో మండలాధీశ మహాత్మ*
*శ్రీశ్రీశ్రీ విశ్వనాథ సద్గురునాథ మహరాజ్‌కీ జై ॥*

# అకారాది అనుక్రమణిక

పుటసంఖ్య


**అ**

అంతరంగాలలో - అలరారు (55)............................ 84
అందమైన డెండమని (65)...................................... 94
అందుకొనుమో పాండురంగా (07)............................ 29
అందుకోర కృష్ణయ్యా! అందాలహారతీ! (71) ................. 100
అందుకోవయ్యా - అందముగ నివ్వాళి (26).................. 51
అందుకోవయ్యా! మంగళము (63) ............................ 92
అల్లరివాడా! ఓ! శ్యామసుందరా! (61) ........................ 90

**ఆ**

ఆలపించుమా మురళిని (48) .................................. 76
ఆనందమయీ! శ్రీలలితా! (119)............................. 155

**ఉ**

ఉమాభరణం - శరణం (117) ................................ 151

**ఎ**

ఎందుకయ్యా జాగు సేతువు (100)........................... 134
ఎందుకు దయరాదు (43) ....................................... 70

**ఏ**

ఏహి మాధవా! రాధికాధవా! (80) ........................... 109

**ఒ**

ఒకసారి కనుపించవేమయ్యా! (21) ............................ **46**

**ఓ**

ఓం మంగళం నమశ్శివాయ! (95)............................ 128
ఓ పరమదయాకర! రామా! (84)............................ 114
ఓ... శివ! గౌరీధవా! (102)................................ **136**

## క

కదలిరా హరి! నిండుగా (52)................................ 81
కనిపించురా! కరుణాసాగరా! (75) ........................... 104
కనుపించకున్నావు - నిను నమ్ముకొన్నాను (18)............. 43
కనులార! ఒకసారి కనిపించుమయ్య! (81) .................. 110
కపీశా! హారతి గొనుమా! (91)................................ 121
కరిముఖ! శ్రీకర! పరమదయాకర! (01) ...................... 17
కరివరదా! కలవు సదా! (51)................................. 80
కరుణామయి! శ్రీలలితా! (121)............................... 157
కరుణాసాగరా! రాధాసుందరా! (22) .......................... 47
కలయహరే! దయానిధే! (33).................................. 60
కృష్ణ! పరమాత్మ! వేగ - రావయా! (60) ...................... 09
కొను మంగళమో హరీ! (54) ................................. 83
కొనుము నివ్వాళి - గోలోక రాజా! (42)...................... 69

## గ

గంగాధరా! హరా! (114) .................................... 148
గిరిధర! గోపాల! (77) ...................................... 106
గిరిధరా! మాధవా! (53) ..................................... 82
గురుదేవ! గురుదేవ!....(04) ................................. 20
గురువరా! నీ దయ....(03)................................... 19
గోకుల బృందావిహారీ! శ్రీహరి (70).......................... 99
గోపాల! దయసేయుమా! (40) ............................... 67
గోపాలదేవ! కాపాడరావ! (36)............................... 63

## జ

జననీ! నీరాజనం (122) ...................................... 158

జననీ! శ్రీరాజరాజేశ్వరీ! (120)................................ 156
జయ మంగళము కృష్ణ! (14) ................................. 39
జయ హారతి సత్యవ్రతదేవా! (127).......................... 164
జోజో చిదానంద సుందర (136)............................ 173
జోజో దయాపాంగ (135) ................................... 172

**త**

తే - దదామి - మంగళం (112)............................ 146

**ద**

దయాసాగరా! రుక్మిణీపాండురంగా! (08)..................... 31
దశరథ నందన! దశముఖ భంజన! (89).................... 119
దేవదేవా! పాండురంగా! దీనమందారా!(12)................. 35

**న**

నగజా మనోమందిరా! నటరాజ! (101) .................... 137
నటసార్వభౌమ! నాలో వెలుగుమా! (104).................. 138
నమో గోపబాల! నమో చారుశీలా! (39)...................... 66
నమో రుక్మిణీ పాండురంగ ప్రభో! (09) ....................... 32
నరుడా! హరిని భజించుమురా! (130)...................... 167
నల్లనివాడా! రేపల్లెరేడా! (35).................................. 62
నాకు సర్వస్వము సర్వదా - పాండురంగడే! (11) ............ 34
నా గతి నీవే రామా! (87)..................................... 117
నిటలాక్ష! నీరాజనం (98)..................................... 132
నినుజూడగలేనా? కృష్ణయ్యా! (17)............................ 42
నీరాజనము గొనుమా - గోపాలా! (34)...................... 61
నీరాజనమిదుగో - ప్రేమమయా! (62) ....................... 91
నీరాజనమిదె - గొనుమో! దేవా! (02) ........................ 18

నీరాజనము గొనుము వాణీ! (118) .......................... 154
నీరాజనము గొనుమా! కపివీర! (90)......................... 120
నీరాజనము- భవానీ శంకరా! (108) ........................ 142
నీరాజనమ్మో హరీ! శ్రీహరీ! (19)............................... 44
నీరాజనము - యశోదామాతా! (123) ...................... 159
నీలకంధరా! నీరాజనమ్మో! (109)............................ 143
నీలతేజ! రాధా - లోల! మంగళం (58)...................... 87
నీలమేఘసుందరా! (20) ....................................... 45
నీవాడనుగానా? శ్యామసుందరా! (73) ...................... 102

ప

పంచదశీ మను రాజ శోభతే! (126)......................... 162
పతితపావనా! కృష్ణా! (15)...................................... 40
పరమాత్మ! దయజూడరా! (99) ............................... 133
పరమాత్మ! హరా! (105) ....................................... 139
పరసుఖదా! శ్రీ అనంత - పద్మనాభ! (45) .................. 73
పరిపాలయమాం - గిరిధారిన్ (30).......................... 56
పలికింది మురళి - రాగాల రవళి! (25)...................... 50
పిలచితి - రావయ్యా! కృష్ణయ్యా! (47)....................... 75
పాండురంగ! రుక్మిణీ మనోహర! (13)......................... 36

బ

బృందావనమ్ములో - అందాలదేవుడు (24).................. 49

భ

భజరే! మానస - గోవిందం .... (06)....................... 27

# మ


మంగళం - గిరిజాంబికా సంగ! (94)........................ 126
మంగళమ్ (141) ........................................ 179
మంగళమమ్మ యశోదాదేవీ! (124).......................... 160
మంగళమయ్య - మహేశా! (103)........................... 137
మంగళమిదె గొనుమో! రామా! (85)......................... 115
మంగళమో - గిరిధారీ! (79).................................. 108
మంగళమో శంకరా! మా గతి (116)......................... 150
మదన - జనక! హరి! (57).................................... 86
మనసా దిగులెందుకే (82)..................................... 112
మన్నించుమా! మమ్ములన్ శ్రీరామా! (86).................... 116
మరచితివా - గోపాలా! (32)................................. 58
మహాయోగపీఠే (142) ....................................... 180
మాధవా! హరి! గోవర్ధన (44)................................ 71
మా పూజ గొనుమో! (05)...................................... 21
మురహరా! ఓ! గిరిధరా! (56)................................ 85
మురళీకృష్ణా! మోహనకృష్ణా! (28)............................ 53
మురళీధరా! తిలకించురా (67)............................... 96
మురళీమోహన కృష్ణయ్యా! (49)................................ 77
మురళీ మోహన మాధవా! (38)................................. 65
మేలుకో - గోపాల (138)....................................... 176
మేలుకో నరసింహ (140)........................................ 178
మేలు నీకగు దీపమాల గైకొనుమా! (110).................. 144

## ర


రసమయ శ్యామల (46)........................................ 74
రాధామాధవ గిరిధారి (66).................................... 95
రాధాలోలా! మంగళమో (64).................................. 93
రాధికా సుందరా! (72) ........................................ 101
రారవేగ చిన్నికృష్ణా! (23) ...................................... 48
రారా కృష్ణా! రాధాకృష్ణా! (50) ................................ 78
రారా మంగళమందుకోరా (93).............................. 125
రావయ్య మాధవా! (16)........................................ 41
రావయ్య – రాసరాజా (78).................................... 107
రావయ్య – శంకరా (107)...................................... 141
రావా? గోపబాలా! (29)........................................ 55


## ల


లాలీ గోపబాలా (134).......................................... 171
లాలీ వనమాలీ (133) .......................................... 170
లేవయ్యా! కృష్ణయ్యా! (139).................................... 177


## వ


వందనమో నృహరీ! (131)...................................... 168
వినుమా నివ్వాళి (31).......................................... 57
వివేకానంద యతివర్యా! (128) .............................. 165
వెండికొండ దేవరా (113)...................................... 147
వెల్గు వికసించింది (74)........................................ 103
వేణుగానలోలుడు (41)........................................ 68
వేదాటవిలో (76)................................................ 105

## శ

శంభో గిరిజా సమేత (106).................................. 140
శంభో శివ సాంబశివ (96).................................. 129
శరణు దేవదేవా (27)........................................ 52
శివ నీరాజనమ్మో (97)...................................... 130
శివ శివ యనవే (92)........................................ 124
శివా మంగళమ్ము (111)...................................... 145
శుభ మంగళమే రమే (125)................................... 161

## శ్రీ

శ్రీనాచశైల లక్ష్మీనృహరీ! (132)............................... 169
శ్రీనివాస ముకుందమురళీ (137).............................. 174
శ్రీపాండురంగా! తులసీ (59)................................... 88
శ్రీపాండురంగాయ శ్రీమనో (10)............................... 33
శ్రీరఘునందన! సీతారామ (83)................................ 113
శ్రీరామ జయరామ (88)....................................... 118
శ్రీవత్సాంకిత వామాంగమ్ (143)............................. 172
శ్రీసాయినాథాయ (129)...................................... 166

## స

సదా పాండురంగాశ్రక్షేత్ర (144)............................... 184
సమాకలయ శుభమంగళం (115).............................. 169

## హ

హారతి గొనుము – రాధాలోల (69)........................... 98
హారతి గిరిధారీ – గోవిందహరి (68)........................ 97
హారతిన్ గొనుమో శుభాకారా (37)........................... 64


❖ ❖ ❖